రయితుబిడ్డ

న. వెంకటరత్నం

రు1/-

ప్రచురణ: అద్దేపల్లి అండ్ కో
సరస్వతీ పవర్ ప్రెస్
రాజమహేంద్రవరము

రెండవ ముద్రణము 1950

Saraswathi Power Press, Rajahmundry.
Printed and Published by
A. Nageswara Rao
For Addepally & Co, Educational Publishers
Order No. 5772/1950.

అంకితము

"వజ్రాదపి కఠోరాణి మృదూని కుసుమాదపి, లోకోత్తరాణాం చేతాంసి కోహి విజ్ఞాతు మర్హతి" అన్నాడు శాస్త్రకారుడు. ఆయన హృదయము పుష్పమువలె కోమలము, వజ్రమువలె కఠినము. చేయుచున్నది జిల్లాసర్జను ఉద్యోగము. 'అయితే నేమి గుణవద్భ్యో జిల్లారెడ్డి, ఇంజనీయరు నాకుపరిచితులు కానక్కరలేదు. మీరే నాకు ముఖ్యమైన, ఆప్తులైన మిత్రులు' అన్నాడాయన ఒకప్పుడు. ఒకసారి ఎవరో ఒకరిని గూర్చి చెప్పినాను, వారికాయన వ్రాసినది: 'నేను మీకు మిత్రుడను, మీరు నాకు మిత్రులు. మిత్రులు కనుకనే నాపై మీకు స్నేహబద్ధమైన అధికారము కలదు. మిత్రులు కనుకనే మీరు చెప్పిన పని చేయుట నాధర్మము. మీకు సందేహ మేలనుకు' అన్న మిత్రుడాయన. అట్టి పరమమిత్రుడైన మేజరు ఎ. కృష్ణమూర్తి బి. ఏ., యం. బి. బి. యస్., ఎ. ఐ. ఆర్. ఓ., గారికి ఈ నాగ్రంథమును విపులరాగమున, వినీతభావమున సమర్పించుచున్నాను.

న. వెం. రత్నం

పరిచయవాక్యాలు :

ఇందలి కథలన్నియు 1927 నుండి 31 వరకు వ్రాసినవి. జాగ్రత్తచేయక పోవడముచేత అప్పుడు వ్రాసిన వానిలో కొన్ని పోయినవి, కొన్ని మాత్రమే దొరికినవి. అయితే, ఇవన్నీ స్వంతముగా ఆలోచించి, మననముచేసి వ్రాసినవే కాని ఇందు అనువాదము, అనుకరణము ఎంతమాత్రములేదు. చదివినది మయితే వాఙ్మయమున నోబుల్ బహుమతి పొందిన నట్ హామ్సెన్ (1920), జారన్సన్ (1903), థామస్‌మేన్ (1929), గ్రేజియా డెలిడా (1926), షా (1925), రోమియిన్‌రోలాం (1915), ఎనటోల్ ఫ్రాన్సు (1921), హాప్టమన్ (1912), లేగర్లాఫ్ (1909), సిగ్రిడ్ ఉండ్ సెట్ (1928) మొదలైనవారి ఉద్గ్రంధాలు, సుప్రసిద్ధ పాశ్చాత్య రచయితలైన డాస్టివిస్కీ, మేక్సింగోర్కీ, టర్గినీవు జేమ్సుగారీ, ఎమిల్ లడ్విగ్, వాల్లరుడిలామేరి, తియోడర్ డ్రెయిజర్, రసెల్, ఇబ్సన్, మెరిడిత్, ప్రీస్ట్లీ, హ్యూవాల్‌పోల్ మొదలైన వారి వెన్నో చదివినాను. అవి మనస్సులో జీర్ణమైపోయి వేరురూపము పొంది ఉండవలెను. హార్డీ, షెల్లీలపై గల అభిమానముచేత ఈ కథలలోని ఒకరిద్దరు వ్యక్తులకు ఇంగ్లీషుపేర్లు పెట్టాను. ఏమైనా నాకు తోచినది వ్రాసి లోకమునకు వినయభావమున అర్పించుట నాధర్మము. వానిలో ఏమైనా ఉత్కృష్టత ఉంటేనే అవి నిలుస్తవి, లేకపోతే...... .

ఇక — అన్నివిషయాలలోను మనము వెనుకబడి ఉన్నామనేమాట వేరే చెప్పవలెనా ! శాస్త్రాలలో, రాచకీయములో మనము చాలా క్రిందమెట్టు మీదనే ఉండిపోయాము. భూత కాలములో చాలాగొప్పవాళ్ళమని చెప్పుకొని ఏమిప్రయోజనము ! వర్తమానమున ఎల్లాఉన్నాము, మన భవిష్యత్తు ఎల్లాఉంది ! అనిచూస్తే, ఏడువేలమైళ్ళ దూరాన్నుంచి వర్తకం చేయడానికి వచ్చిన పరదేశీయులు విశాలమైన భారత దేశాన్నంతా జయించి పాలిస్తున్నారు. ముప్పయి రూపాయల గుమస్తాపని దొరికితేనే చాలుననీ, మూడు వందల రూపాయల ఉద్యోగము చేస్తేనే జీవితము ధన్యమైపోయిననట్లు తలంచేవారు మనలో వేనకు వేలున్నారు. ఇక దేశము, భాష, జీవితాదర్శముల గురించి ఆలోచించేవాళ్ళే లేకుండా పోతున్నారు. ఇతరదేశాలలో

మనదేశమును గురించి ఎటువంటి నీచమైన ప్రచారము జరుగుతూందో మనకు తెలియనిదా? ఏ ఒక్క రవీంద్రుని వల్లనో, గాంధీ వల్లనో మనమూ ఉన్నామని విదేశాలలో తలయెత్తుకు తిరుగుతున్నాము.

మా రాజమహేంద్రవరములో వీరేశలింగముగారి శిలావిగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి మోడరన్ రివ్యూ సంపాదకుడు, రామానంద చటర్జీగారు వచ్చినప్పుడు ఏమన్నాడంటే. 'మీ తెలుగు దేశములో ఇటువంటి వీరుడు, ధీరుడు, కవి, సంస్కర్త ఉన్నట్లు ఎంతోమందికి మనదేశములోనే తెలియదు, ప్రక్కనున్న మాకే తెలియదు. ఇక విదేశాలసంగతి ఏమిచెప్పను! మీలో ఎంతమంది ఆంగ్లభాషలో కోవిదులు లేరూ! వారంతా ఏమిచేస్తున్నారు? ఆ లోకోత్తర పురుషుడైన వీరేశలింగంపంతులు గూర్చి ఇంగ్లీషులో గ్రంథాలు వ్రాసి లోకాని కంతటికీ మీలో ఇంత గొప్పవాడున్నట్లు తెలియపరచకూడదూ!' అన్నాడు. అది ఎంత విలువైన సలహా! అయితే, ఆచరించిన పెద్దమనిషి ఏడీ?

నేను చెప్పవచ్చిన దేమిటంటే, మనలో అనేకమంది గొప్ప వ్యక్తులున్నారు, గొప్పగ్రంథాలున్నవి. ఇవన్నీ విదేశాలలో సయితము వెల్లడి కావలసి ఉంది. కాని మనలో మనకు అసూయ, ఈర్ష్య, కాపట్యము, కులగౌరవ ప్రతిష్ఠ ఎంత ఉన్నదీ! ఇవన్నీ చంపుకుని దేశము కొరకు ('దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్' అన్నాడు గురజాడ మహాకవి) భాషకొరకు మనము జేయవలసిన త్యాగము ఎంతో ఉంది.

ఎవరిమట్టుకువారు తమతమ కుటుంబాలతో, ఉద్యోగ వ్యాపారాలతో జీవితాలను సరిపెట్టుకుంటున్నారు. వారిదృష్టి, ఆలోచన స్వవిషయం, కుటుంబక్షేమం, పిల్లల పెళ్ళిళ్ళు తప్ప అంతకు మించిపోదు. ఇక ప్రజాక్షేమము భాషాభ్యుదయము ఎవరికి కావాలి?

షెల్లీ అన్నట్లు: 'Poets are the unacknowledged legislators of the world' సంఘాన్ని బాగుచేయవలసిన బాధ్యత రచయితలపైన ఉంది, అని మనవి.

రాజమహేంద్రవరము
1 వ సెప్టెంబరు 1938

న. వెంకటరత్నం

విషయసూచిక

రయితుబిడ్డ :

అది ఆషాఢమాసము. పశ్చిమగోదావరిలోని పూళ్ల : పల్లెటూరు. మధ్యాహ్నము రెండుగంటలవేళ; ఆమె గట్టుపై నున్న గున్నమామిడి చెట్టుక్రింద పసికూనను మెత్తని గుడ్డలపై పరుండబెట్టి అచట కూరుచుండియున్నది. ఆమెప్రక్కనే పదునైదేండ్ల కుమారుడు ఆసీనుడైయున్నాడు. పది అడుగుల దూరములో నొక తాటియాకుల యిల్లు, దానిప్రక్కనే గోడ లేమియు లేక మొకరములపైననే యున్నపాక, సమీపముననే కంచెవేసియున్న గడ్డివాము దొడ్డి కలవు. ఆమెకు ఎడమ చేతి వైపు చిన్నిచెఱువు, దానిగట్టుపైన అంటుమామిడి మొక్కలు, రెండు మూ డరటిచెట్లు, నాలుగైదు కొబ్బరిమొక్కలు, మల్లెతీగెలు, గుబురుగానున్న వేపచెట్లు, తాటిచెట్లు కలవు.

గట్టుక్రిందనున్న పొలములో కొందరు స్త్రీలు వరుసగా నిలుచుండి మెత్తని తడినేలపై లేతవరియాకు ఊడ్చుచున్నారు, వంచిన నడుములు ఎత్తకుండగనే. ఆమె, కుమారుడు గొంతెత్తి సన్నని మధుర స్వరమున ఇట్లు పాడుచున్నారు:

ఈగడ్డిపూవులే
ఈదారి పొంతనే
అలసి పోసీవోయి
దేవా, దేవా!

నీయిష్టమైనచో
నీపూల దండలో
మెరసి పోనీవోయి
దేవా, దేవా! (శ్రావణి)

తడినేలలో చెమటగార్చుచు పనిచేయుచున్న ఆ స్త్రీలు ఈ యిర్వురుపాడిన పదమును మరల ఆలపించుచుండిరి. వీరు పాడిన పాదమునే యొకసారి, మరియొకసారి దాని తరువాతి పాదమును నవ్వుచు, నడుమ నడుమ నొకరినొకరు వేళాకోళము చేసికొనుచు, ఉత్సాహముతో, ఉద్విగ్న హృదయములతో నా ఊడ్పు కత్తెలు పాడుచున్నారు. ఈ పాటవలన కలిగే ఆనందములో వారు పనిచేయుచున్న మాట, పనివల్ల కలిగే బాధ మరిచియే పోయినారు. నిమిషనిమిషమునకు ఇనుమడించుచున్న ఉద్వేగము, ఉత్సాహము వారికి మైమరపు కలిగించినది. 'ఆ కట్ట యిల్లా యియ్యవో అమ్మా' అనీ 'ఆకు యెంత లేతగావుందే మేలిమితీగెల్లాగు' అనీ 'ఆ యమ్మకి యేం వోపికే మనకీపాట నేర్పడానికి' 'అల్లాటి కంటం నాకే వుంటేనా' అనీ మధ్య మధ్య వారిలో గుసగుసలు మాత్రము బయలు దేరుచున్నవి.

ఇంతలో తొమ్మిదేండ్ల బాలుడు మణుగుబూరి [illegible]ర పర నమలుచు పరుగునవచ్చి 'అమ్మా, మన రవుడీ యెవరో మనిషిమీద భొంయి భొంయి మని మొరుగుతోంది' అన్నాడు.

ఆమె 'దాన్ని యిల్లా తీసుకురాకపోయావా మరెందుకూరుకున్నావు?'

బాలుడు "ఎంత పిలిచినా రాలేదమ్మా. గబగబా వెళ్ళి గబాలున మెడపట్టుకొని బతిమాలాను కూడా, రమ్మని. 'నేను రాను పో నీ కెందుకూ' అంటూ వుందమ్మా! మళ్ళా 'యేయి రవుడీ, జాగ్రత్త, నీ పని పట్టిస్తా, పో, యింట్లోకి పో, అంటే 'భోంయి, భోంయి' మని వచ్చి 'నీ మణుగుబూరి తినేస్తా జాగ్రత్త' అని మీాద పడబోతే వచ్చేశానమ్మా" అని గంతులు వేయుచు, గట్టిగా నవ్వుచు మణుగుబూరి నములుచునే పసిబిడ్డ దగ్గరకు పరుగెత్తి,

నీ పూల దండలో
మెరిసి పోనీవయ్యా
దేవా దేవా

అని సన్నగా మెల్లగా తనలో తానే పాడుకొనుచు అచటనే కూరుచుండి పోయినాడు.

తల్లి ఆజ్ఞానువర్తియై పెద్దకుమారుడు రాడీని తీసుకవచ్చుటకై పరుగున వెళ్ళినాడు. అయ్యది భయంకరమూర్తి అయినను చనవుతో బాలుడు దాని మెడనున్న త్రోలుపట్టా పట్టుకొని, అచట నున్న వానిని వెంటబెట్టుకొని తల్లి దగ్గరకు వచ్చినాడు.

ఆతడెవరో క్రొత్తవాడు. నవనాగరకుడు. మల్లెపూవువంటి తెల్లనివస్త్రములు; కండ్లకు బంగారు సులోచనములు; చేత నొక చక్కని చేకఱ్ఱ.

ఆమె లేచి నిలువబడి యింకను కుర్చీను పట్టుకొని యున్న పుత్రునిజూచి "వారిని తీసుకువెళ్ళి యింటిలో కుర్చీవేసి కూర్చోబెట్టి రా" అన్నది.

ఆ నూతనపురుషుడు మారు మాటాడకనే బాలునివెంట వెళ్ళి యింట నాసీనుడైనాడు.

రవుడీని కట్టివేసి వచ్చిన పుత్రునితో "తండ్రీ, దాని తరువాతి పాదములు కూడా వాళ్ళకు నేర్పుతూవుండు ; నే నిప్పుడే వస్తాను" అని పసిపావదగ్గర నున్న కుర్రవానిని తీసికొని, అదివరకే జారుముడి వేసియున్న కేశములు విడదీసి మరల ముడి వేసి పయ్యెద సర్దుకొని ఆమె బయలు దేరినది.

చిన్ని బాలుడు 'అమ్మా! ఈ మణుగుబూరి యేం చెయ్యనూ !'

తల్లి 'అక్కడ పెట్టి రా. మళ్ళీవచ్చాక తిందువుగాని. ఆమె ముప్పదియేండ్ల లావణ్యవతి. చూపుకు ఇరువదియేండ్ల యౌవనవతివలె కాన్పించును. చామనచాయ. పలుచని, బలిష్ఠమైన, నున్నని శరీరము. వదనమున సౌమ్యమైన తేజస్సు. వేషమున పల్లెటూరి పడుచువలె నుండినను ప్రకాశమానమైన మోము, వెన్నెలవెలుగు గల నేత్రములు, మృదుమధురమైనవాక్కు, మందగమనము — యివన్నియు నామె సామాన్య రమణి కాదనియు, నామెలో అపూర్వమైన, అనిర్వాచ్యమైనశక్తి, తేజస్సు యేదో కలదని అపరిచితులకు తోచును.

మెల్లగా నామె చిన్ని బాలునితో వచ్చి 'అయ్యా, దాహ మేమైనా పుచ్చుకుంటారా ?' అని అడిగినది.

ఆతడు అవనతవదనుడయియే ఏమో ఆలోచించుచునే 'కొంచె మిప్పించండి' అన్నాడు.

ఆమె లోనికి జని విశుభ్రమైన కంచుపాత్ర నిండా చిక్కని గేదెమజ్జిగపోసి ఆతనికి స్వయముగానే యిచ్చినది. నీ పేరేమిటి అని అదివరకే ప్రశ్నింపబడి యుంటచే నాబాలుడు 'ఊఁ — నా పేరా — మరి — బాలచంద్రుడు' అనుచున్నాడు.

ఆతడు చిఱునగవుతో 'ఏ వూరి బాలచంద్రుడువయ్యా నీవు! చుక్కల్లో చంద్రుడు నీ కేమవుతాడు' అన్నాడు.

బాలుడు 'నేనా పల్నాటి బాలచంద్రుణ్ణి అండీ. చుక్కలు, చందమామ, కొంగలు, ఎద్దులు, మా రవుడీ కుక్క అన్నీ మా చుట్టాలేనండీ, మా అమ్మ చెప్పింది'

అంతలో కంచుపాత్ర తీసుకవచ్చిన తల్లి ఆ పలుకులువిని పాత్రనందించిన తర్వాత బాలు నెత్తుకొని 'ఎవరు నేర్పినారయ్యా, ఈచిట్టిబుద్ధులు! నువ్వు పల్నాటి బాలచంద్రుడవా?' అన్నది చిరునగవుతో.

'అవునమ్మా. నాన్నగారు నామీద పద్యాలు నేర్పారు కూడాను. ఆ పల్నాటి బాలచంద్రుడే నువ్వు. బ్రహ్మనాయుడు నేను, ఐతమాంబ మీ యమ్మ అన్నారు కూడాను నాన్నగారు'

ఆమె ఆ ముద్దుపలుకులు విని వికసించిన హృదయముతో తేజోవంతములైన కళ్ళతో నవ్వుచు బాలునిశిరస్సుమూర్కొని "అయ్యా, తమ రేమి పనిమీదవచ్చినారో మగవారు ఇంటి దగ్గర లేరు. ఇప్పుడే గంటక్రిందట ఆకుమళ్ళ చెరువు కేసి వెళ్లినారు. తమరు కూర్చుంటే ఒక అరగంట, గంటలో వారు వస్తారు. మీరు మాట్లాడి వెళ్లవచ్చు" అన్నది.

అతడు 'వారితో నా కేమియు ప్రత్యేకపు పనిలేదండి. వీలైతే దర్శనముచేసి వెళతాను. కేవలము అందుకనే కాదు నేను రావడము. రోడ్డుప్రక్కనే వొంటరిగా వున్నయిల్లు, మీ రిందాక యేదో పాడుతున్నారు, చాలా శ్రావ్యముగా వుంది, విని చూచి పోదామని వచ్చాను ఇంతలో దాహము కూడా అయింది'

ఆమె 'మా పాటలేమున్నవి లెండి! ఏవో పల్లెటూరి పదాలు. పనివాళ్లకు నేర్పితే వాళ్లుకూడా నేర్చుకొని ఆనందించుతారుకదా అని పూసుపోక నేర్పుతున్నామే కాని—'

అతడు 'అమ్మా, అల్లా అనకండి. పల్లపూరులో మీ సంగతి అనుకుంటూవుంటే విన్నట్టు జ్ఞాపకము. మీ భర్తగారు చాలా విద్యావంతులనీ, మీరుకూడా ఇంగ్లీషు సంస్కృతము బాగా చదుకున్నవా రనీ అక్కడివారు చెప్పుకుంటూ వుంటే విన్నా. అయినా ఆ పాట పల్లెటూరి పాట యెల్లా అవుతుంది లెండి, మీ వంటివారు పాడుతూవుంటే' ఆమె 'ఏమండీ అల్లా అంటారు, మేము పల్లెటూరి వాళ్లముకామా. మా

తండ్రిగారు రైతు, భర్తగారు రైతు, చిన్నప్పటినుంచి పెరిగింది కేవలము పల్లెటూళ్లలో. కాస్త చదువుకున్నంత మాత్రానే బస్తీ వాళ్లమైపోతామా!'

అతడు 'దానికేమి లెండి. ఇందాక అబ్బాయి పద్యాలేవో నాన్నగారు నేర్పారన్నాడు. ఏమైనా చదవమనండి. చిన్నపిల్లలు చదువంటే నాకు అమితమైన కోరిక.'

తల్లి 'ఏది నాయనా బాలచంద్రుడు పద్యాలు చదువు మీ నాన్నగారు నేర్పినవి, వారు వింటారట' అని బాలుని క్రింద దింపినది.

బాలచంద్రుడు ఠీవిగా నిలువబడి చేతులు ముడుచుకొని :

'ఈవిశాలప్రపంచాన నింతదనుక
నెందరోపుట్టి గతియించి రేమి ఫలము!
వీరులగు వార లేనాటివారలైన
శాశ్వతులు వారె కీర్తి రాజ్యమున నెపుడు.
శత్రువుల గుండెలవియ దేశంబుకొరకు
ఘోరముగ బోరి పల్నాటి వీరుడైన
బాలచంద్రుండు తన మెలప్రాయమందె
స్వర్గమున కేగి యెన్నేండ్లొ జరిగిపోయె.
నాటి పల్నాటివీరు డొనర్చినట్టి
వేడినెత్తుటి మడుగు లానాడె యింక
అతనిచే కూలినట్టి యోధాళితనువు
లవనిగర్భంబుతో నాడె యైక్యమయ్యె.

పాడుపడె నాటిపల్నాటి పౌరుషంబు ;
చెరగె నావీర విక్రమచిహ్నములెల్ల ;
గాని యీనాటికిని గూడ వానియశము
పులకరింపగజేయు నాంధ్రుల యొడళ్ళ.
వీరుడగు బాలచంద్రుని విక్రమంబు
వేడ్క నానాడు జూచి పవిత్రమైన
నాగులేరిప్పుడును పలనాటియందు
నాయమృత శౌర్యగీతము లాలపించు.
వీరుడగు బాలకుం డుద్భవించి నట్టి
వెలమకులమెల్ల విఖ్యాతి వెలయుచుండె
నతని పదధూళిచే ధన్యమైన యట్టి
వీర మేడపి లోకైక విదిత మయ్యె.
అతని తలిదండ్రులై యొప్పి సుభగులైరి
బ్రహ్మనాయుడు, నైతమాంబయు, ధరిత్రి ;
ఖిలముగా నెప్పటికిని వీరులసమాధి
శౌర్యసుమముల ధర్మవాసనలజిమ్ము.' (గీతామంజరి)

మధురమైన కంచువంటి కంఠమున పాడినాడు.

అతడు 'సెబాష్! తెలివిగల పిల్లవాడవోయి. మీకు పేరు ప్రతిష్ఠలు తెస్తాడు, అందులో సందేహము లేదు. ఏదైనా బడిలోకి పంపిస్తే క్రమమైన పద్ధతిగా విద్య నేర్చుకోవడానికి, రేపు

ఏ బి. యల్., యం. ఏ. గానా వ్యాసపడానికి పీలుంటుందిగా, అల్లా చేయకపోతున్నారూ ?'

ఆమె 'సరేగాలెండి. వీళ్ళ నిల్లా బ్రతుకనిస్తున్నారూ ! వాళ్ళ తండ్రి యిదివరకు ఆయన కాలేజీలో ప్రొఫెసరుగా పనిచేసే వున్నారు — యిప్పుడు మాపిల్లలకే ప్రొఫెసరైనారు. ఏదో పదిపుట్ల నేల పండించుకుంటూ యీ పొలముగట్టుమీద వున్నవాళ్ళనుకూడా పంచమబాలుణ్ణి పెంచామని, మేము పంచములమని వూరువారంతా బహిష్కరించారు. ఇదీ వొకందుకు మంచిదే అనుకున్నాము. ఇక ఈ పిల్లవాణ్ణి బడిలో అడుగు పెట్టనిస్తారూ, ఆ మొనగాళ్ళు.'

అతడు 'ఓహో, అల్లాగటండీ! అయితే నేమిలెండి, ఏపిల్లవాడి వల్ల మీరు చిక్కులుపడతారో, ఆపిల్లవాడిమూలంగానే మీరు శాశ్వతకీర్తి పొందుతారు. బాగావృద్ధిలోనికి వస్తాడుతప్పకుండా'

ఆమె 'కీర్తి యెందుకులెండి. ఈ కుర్రవాడితోనే ఆ ఛాందసులకు బుద్ధి కరిపించాలి అని మా మగవారి అభిప్రాయము. అందుచేతనే ఆయన స్వయముగా ప్రత్యేకశ్రద్ధతో ఈ పిల్లవాడికి విద్యచెప్పుతూ వుంటారు. ఇద్దరి పిల్లలసూక్ష్మ బుద్ధి, చురుకుదనము చూచి వాళ్ళనాన్నగారు పట్టరాని సంతోషముతో ఇబ్సన్ నాటకములో చెప్పినట్లు 'Then you Shall drive all the wolves out of the country, my boys!' అంటూవుంటారు. అందరము నవ్వుకుంటాము'

ఆతడు 'అంతకంటే యేమికావాలండి మీకు ! నిక్షేపమువంటి

సంతానము ; కోట్లధనము కంటే విలువైన విద్యాసంపత్తి. అయితే తోడేళ్లు అంటున్నారు. ఎటువంటి తోడేళ్ళో నా కర్థము కాలేదు.'

ఆమె తెచ్చుకొనిన ఉద్రేకముతో "సంఘము: కొయ్యబారినసంఘం. క్రూరమైన సంఘం. దట్టముగా ఒకప్రక్క అడివి పెరిగిపోయి అందులో తోడేళ్లు, ఎలుగు బంట్లు స్థిరనివాసము యేర్పరచు కొంటే కళ్ళుమూసుకొని కొయ్యబొమ్మల వలె ఊరుకున్నారు. ఇప్పటికే అవి చాలామట్టుకు నాశనము చేసినవి. ఇల్లాగే కళ్ళుమూసుకుని పశువులులాగా వ్రుంటే ఈపశువుల నన్నింటినీ అవి తినివేస్తవి. ఇప్పుడా కారడవిని కొట్టివేసి ఆ క్రూరజంతువుల్ని — కొన్నిటిని నాశముచేసి—కొన్నిటిని సముద్రములోనికి తరిమివేసి—ఈద గలిగితే యీదుతవి లేకపోతే చస్తవి — మరలా దేశమంతా సస్యశ్యామలము చేయవలె.' అని తన ధీరావేశమును గూర్చి తానే నవ్వుకొనినది. బాలుడు 'అమ్మా, అడివి నేనుకూడా కొట్టివేస్తా. మొన్న నాన్నగారు బ్రహ్మాజెవుడు తుప్ప కొట్టి వేస్తావుంటే నేనుకూడా కొడవలిపట్టుకొని పరపర నరికివేశా. యేం అమ్మా, నేనుకూడా నీతో రానా అడివి నరకడానికి'

తల్లి "వద్దుగానిలే నాయనా, నేను వెళ్లేటప్పుడు — (గభీర వదనమున) అయ్యో, దేశమంతా మూర్ఖులు. నూటికి తొంబది తొమ్మండుగురు పరమపశువులు. ఎవ్వడైనా ఒక్క వ్యక్తి మానవుడుంటే అతడు నిద్రబోతూ వుంటాడు. ఈ తొంబది

తోమ్మందుగునే సంఘాన్ని, దేశాన్ని నడుపుతున్నారు. ఆ వొక్కడు తెలిసివుండికూడా 'పదుగురాడుమాట' అని చెప్పి తానుకూడా పశువులలో చేరిపోతాడు. ఇదంతా మార్పుకావడానికి కొంతకాలము పడుతుంది — అయ్యో లేకపోతే చూడండి, ఈ పసిబాలుణ్ణి చేరదీశామని ఈమూర్ఖుల కింతకష్టు ఎందుకూ! అందరిలోనూ వెలిగే వెలుగు వొక్కటే అని ఆమూర్ఖులకు తెలియచెప్పితే మాత్రము తలకెక్కుతుందీ? సూర్యునికి కిరణములెల్లాగో మనముకూడా పరమేశ్వరుడి కల్లాగు అని మా మగవాళ్ళు అనేకవిధాల ఆమూర్ఖులకు చెప్పి చూశారు. పశువులకు మనుష్యుల మాటలేమి అర్థమవుతవి, పోనీ మీరే చెప్పండి!" 34403

అతడు 'అవునండి. ప్రపంచము. ఎదురుచెప్పితే కష్టాలున్న మాట నిజమే. ఏమి చేస్తాము!' 554 57 3

ఆమె 'ఏమండీ, మీరుకూడా అల్లాగే అంటారు. చూస్తూ చూస్తూ విషము త్రాగమంటే యెల్లాగండీ! అల్లాగైతే కుక్కలకు, కాకులకు, మనుష్యులకు తేడా యేమున్నదీ! కొన్ని విషయాలలో ఈమూర్ఖులకంటె కుక్కలు, కాకులు నయమనిపిస్తని. — అయినా యిప్పుడేమనుకుంటే ప్రయోజనమేమున్నదిలెండి! చేసేరీతిగా చేయవలెగాని. రేపు ఈశ్వరుడే వాళ్ళకళ్లు తెరిస్తే అప్పుడు మేలుకుంటారు.'

తల్లి ఉద్రిక్తయై మాట్లాడుటగని, అంతవఱకు పరాయత్తచిత్తుడైయున్న బాలుడు ఆమె చెంగుపట్టుకొని 'అమ్మా, ఆయా

నతో ఎందుకే అంతకోపముగా మాటాడుతున్నావు? రఘుడీని తీసికురానా యేమిటి? అదే వెళ్లనులే చెప్తుతుంది, మనము దెప్పడమెందుకు' అన్నాడు.

వారిద్దరు నవ్వుచు:

ఆతడు 'గడుసువాడవోయి, చంద్రా'

ఆమె నవ్వుచు : 'ఆయన నాళ్లవ్వాగు, పెద్దపట్టణం తీసుకు వెళ్లి పెంచుకుంటారట వెళతావ్వా ? '

బాలుడు ఊఁ, నాకేఁ వెళ్లదాకా. ఇక్కడైతే నాన్న గారిదగ్గర చదువుకుంటూ, కోతికొమ్మచ్చి ఆడుకుంటూ, నాపెంపుడు పొదకోడి నేమిచేయమంటావు? మరి దానికో ఎవరు పరిగెత్తుతారు — అమ్మా, నేవెళ్లితే పాప నెవరాడిస్తారూ?'

తల్లి 'రఘుడీ ఆడిస్తుందిలే. లేకపోతే చందమామకిస్తే అది ఆడిస్తుంది.'

బాలుడు 'నేనూ చంద్రుడినేగా, నాకే ఇవ్వరాదూ! నేను తీసకెళ్లి చిలకలకిస్తే అవి జాంకాయలు పండువి పెడతవి. ఎంచక్కాగా తిని నుళ్లా నాదగ్గిర కొస్తాడు. మన తెల్లావు పాలిచ్చి పెంచి, దానిదూడ, నేను, పాపాయి గంతులేస్తూ దాగుడు మూచి ఆడుకుంటాము.'

తల్లి 'ఆటలో తల్లి యెవరుంటారు మరి మీకు?'

బాలుడు 'మన సంగీతపుచెట్టు చిటారికొమ్మల్లో గూడుపెట్టిన కాకిపిల్లలతల్లి మా ఆటలోతల్లి. అవన్నీ నీకెందుకేమిటి ? నీవు మాజతలేనన్నావుగా, నన్ను ఆయనతో వెళ్లిపొమ్మన్నావుగా.'

తల్లి 'లేదయ్యా, అల్లా అనలేదు. నిన్ను నేను విడిగా పిడకానా ఆయన యివ్వమంటే మాత్రము. మనమందరమూ రేపు ప్రొద్దున్న దాగుడుమూచి ఆడుకొందాములే' —

అతనివైపు తిరిగి 'అయ్యా, మీరు పాటవిందామని వచ్చినట్లు కనిపిస్తుంది. అక్కడికి వెళుదాము రండి పల్లెటూరి పాట ఎల్లావుందో చెప్పుదురుగాని.'

ముగ్గురు బయటికి వచ్చినారు.

కోకిలరాగము. పెద్దకుమారుడు కళాయుక్తముగా మధుర మందముగా, ఆగి ఆగి వీచుచున్న పెనుగాలికెగయు జలతరంగములవలె నడుమ నడుమ కంఠము విసరచు ఉత్సాహోద్వేగముతో, ఉన్మీల నేత్రములతో లేత అరటి ముువ్వలవంటి చేతులు ఊపుచు ఈరీతి పాడుచున్నాడు:

'ఈ చిన్ని సెలయేళ్లు
నీకొండ కోసనే
ఎండిపోనీ వోయి
దేవా! దేవా!
నీయిష్ట మైనచో
నీప్రేమ రాశిలో
నిండిపోనీ వోయి
దేవా! దేవా!'

ఊద్భుకత్తెలు కూడా అంత ఉత్సాహోద్వేగముతోనే మధ్య మధ్య బడలికచే గొంతు నొక్కి నొక్కి ప్రతిపదము ప్రతిధ్వనించుచున్నారు.

చిన్ని బాలుడు పరుగునవెళ్లి పసిపాప ప్రక్కలో దాచి వచ్చిన మణుగుబూరి పట్టుకొని, 'అమ్మా!' – అని ప్రశాన్త ప్రకాశితమైన కనులతోనే అడిగి అనుమతిపొంది ఎగరంగ [illegible] లుట మొదలు పెట్టినాడు.

ఆమె 'అయ్యా, యిటు దయచేయుండి' అని, పసిపాప దగ్గిర కాతని తీసికొని వెళ్లి అచట కూర్చుండజేసి తానుకూడ రెండు బారల దూరములో పసిపాప ప్రక్కలో కూర్చుండి, 'అయ్యా, మాకేమున్నది, రైతులకు భూదేవి తల్లి పది వేళల పచ్చగావుంటే చూడడమే పండుగ. పచ్చని పొలము బంగారురంగుగా మారిందా అంటే సంక్రాంతిపండుగ వస్తుంది; యిక అప్పుడు పాటకజనమేమిటి, పక్కారయితుబిడ్డ నేమిటి ఒళ్లుమరచి పండుగ జరుపుకుంటారు. కొందరు కోడి పందాలు, కొందరు పొలిమేరమ్మకు వేటపోతులు, వచ్చేకూతుళ్లు, అల్లుళ్లు – యిదే రైతులకు పదివేలు. ఇక నేమో ఆసంక్రాంతి పదిరోజులు మామగవారి పెత్తనముక్రింద ప్రార్థనలు—— పొలము బాగా పండించి వర్షములు సమృద్ధిగా కురిపించి తన సంతానాన్ని ప్రేమదృష్టితో ఆశీర్వదించినందుకు ఆపరమపితకు నమస్కారము చేస్తాము. మాపనులుచూచి వాళ్లు మేముపిచ్చి వాళ్ళమంటారు. వాళ్ళ క్రూరమైన నీచమైన కోడిపందాలు, అమ్మవారికి కల్లు పోరబోయిడము యిటువంటివి చూచి మేము చిరాకు పడతాము. ఏమున్నదండీ మరీ ఈకాలువక్రింది వూళ్లలో తృణకాష్ఠ జలసమృద్ధిగా వుండడము, ఈపశువులను

సరియైన త్రోవలో నడిపే పశుకాపరి లేక పోవడమువల్ల కిన్ని మన్ను గానకుండా వున్నారు. ఏమైనా, ఎంత వెదికినా ఆ స్త్రీవాళ్ళ కంటే చాలా సుగుణాలు వీళ్ళు నయము మేలెండి. ఇప్పుడు దాక పోతే వొకప్పటికైనా మోక్షమున్నదని ఆశపొడకట్టునా వుంది.'

అత డేమియో ఆలోచించుచు వినుచున్న వానివలె నంతవరకు కూరుచుండి 'అయితే యేమమ్మా, కడమా పొలాలేవీ అంత పచ్చగా వున్నట్టు కనిపించవు; ఈచుట్టుప్రక్కల అప్పుడే పూడ్చి వేసినట్లు కనిపిస్తుంది యేమి కారణము!' అన్నాడు.

ఆమె 'చెప్పడము లేదండి. పొలము చక్కగా దుక్కి దున్ని జాగ్రత్తగా వొళ్ళువంచి దమ్ముచేసి ముదురుగా వూడిస్తే భూమా పాడుకాదు, పంటా బాగా పండుతుంది ఈచుట్టూ పచ్చగా కనిపించే దంతా మనదే. దీన్ని దేవుడుచెర్వుపొల మంటాము; ఇది అరవయి యెకరాల ఖండ్రిక. అందరికన్నా ముందుగా ముదురుగా వూడ్చవలె అని మా మగవారి పట్టు. ఈయేడు అల్లాగే చేశాము. నిరుడు ఈ కనిపించే ఆరుమడులూ చెరుకు వేయడము వల్ల కొంచెము చెల్లాచెదరైనది. ముందు యీ మడులు బాగుచేసి సరీ తర్వాత తక్కిన మడులు దమ్ముచేశాము. అదృష్టవశాత్తు నిరుడు చెరుకుపంట సమృద్ధిగా పండింది: ఎదిగాళ్ళు చేతిలో సొమ్మాసయి. ఆపై సంవత్సరము — ఆ యీశాన్యమూలగా మాతచెట్టువున్న గట్టు జూశారూ, అక్కడ సామర్లకోట ఫారమునుంచి తెప్పించి క్రొత్తరకము అరటిచెట్లు వేశాము. ఓపికతో, చెమట వోడ్చి

యిద్దరమూ కూడా అందులో పనిచేశాము. నిన్న చెప్పినట్టుగా కంపినీ చక్రకేళీ గెలలు కాచినవి, ఇల్లాగే శ్రద్ధగా పని చేసుకుంటే ఫలము దక్కుతుంది. మావూరివాళ్ళకు భూదేవి మాటే మరుపుకు వచ్చి మత్తెక్కి రెండురాళ్ళు చేతిలో వేసుకొని బస్తీమీద పడి నానా పాడు అవుతున్నారని చెప్పలేదటండీ. పొలమంటే, హాయిగా మెల్లగా పనిచేసుకుంటే యెంతో దయతో అది ఫలితము చేతి కందిస్తుంది ఈ శాస్త్ర పనికూడా మా రైతుపోకిల్లాలకు భారమైపోతూంది. కోతలైన తర్వాత దంటుతడుపు పెట్టే పొలాలకు దంటుతడుపు పెట్టవలి, మెరకవేసిన ఒడ్డుమళ్లు మరమ్మతు చేయువలి, గొర్రెల పెంట కట్టేదానికదీ, పాటిమట్టి పోయవలసిన దానికదీ, మెరకపల్లాలు బాగుచేసుకోవడము, ఆకుమళ్ళ చొగవు మెరక వేస్తే మళ్లీత్రవ్వించడము, విరిగిపోయిన గట్లు మరలా పోసుకోవడము - ఒకటేమిటండీ వేయినూ్నగ పనులున్నవి భూదేవికిచేస్తే. గిట్లపైన ఒనుపు, కంది, వేస్తే, పండుతుంది. పొలము గొడ్లుతొక్కి పాడుచేయకుండా కనిపెట్టి జాగ్రత్త చేసుకుంటే భూమి పాడవ్వదు. ఇవన్నీ చిన్నవిషయాలే. అందుచేతనే మరీ యెక్కువశ్రద్ధతో గమనించవలి. మా మాగ వారు జాగ్రత్తగా యివన్నీ చూసుకుంటారు, నాకూ పిల్లలకూ చదువు చెపుతారు, కోఆపరేటివు యూనియనుపని చూసుకుంటారు. ఇప్పుడు బిల్డింగు సొసైటీ వొకటి పెట్టవలి అని ఈ నడుమనే ఇంగ్లండుకు వ్రాసి నేషనల్ బిల్డింగు సొసైటీవారి దగ్గి

ర్నుంచి యీూవత్తు భోగట్టా తెప్పించారు. ఏదో యీూవిధ ముగా క్రింద పడుతూ, మీూదపడుతూ కాలము వెళ్ళబుచ్చు తున్నాము.'

అతడు 'అబ్బా, ఎన్ని విషయాలు క్రొత్తవి, తెలిసిన వండీ యీూరోజున. మీూవంటి స్త్రీలు పదిమందివుంటే దేశము బాగు పడదటండీ.'

ఆమె 'నాశక్తియేమున్నదండీ. ఆయన అన్నీ శ్రద్ధతో నాకు బోధచేస్తూ వుంటారు. అవన్నీ మనసుకు పట్టించు కుంటాను. చేయుగలిగినంతా పాటుపడుతూ ఉంటాను.'

అతడు 'అయితే యేమమ్మా, ఎంతతృప్తి, ఎంత ఆనందము ఈపనుల్లో ఉన్నప్పటికీ ఈ నడిదీవిలో మానవ పురుగు సం బంధము లేకుండావుంటే లోకముతో సంబంధము తెగిపోయి నట్లూ, వొంటరితనముగాను బెంగగాను ఉండదూ! మీూరేమో మీూ పొలాలేమో అయితే ప్రపంచమెల్లా నడుస్తూందో ఏమేమి రోజు రోజుకి క్రొత్తవిశేషాలు జరుగుతూన్నవో తెలి యకపోతే నడిసముద్రముమధ్య దీవిలో వున్నట్టు కష్టము గానూ, లోటుగానూ అనిపించదూ ?'

'ప్రపంచపుసంగతులు తెలీక యేమండీ! ఆంధ్ర, కృష్ణా, ధర్మ సాధనీ పత్రికలు, ఇంగ్లీషులో బొంబాయి టైమ్సు పత్రిక, హిందూపత్రిక, మోడరన్‌రివ్యూ వస్తవి. ఇవి నన్ను, పిల్లలను, పనివాళ్ళను యెదటకూర్చోబెట్టుకొని ఆయిన చదివి వినిపిస్తూ వుంటారు. ఇంకా విదేశాలనుంచికూడా పత్రికలు వస్తవిలెండి.'

అతడు 'ఓ, అల్లాగటండీ. అయితే కేవలము స్వర్గలోక మండీ మీాది. ఏమేమి పత్రికలు వస్తవండీ, విదేశాలనుంచి ?'

ఆమె 'అమెరికానుంచి లిటరరీడైజస్టు, ఫిజికల్ కల్చరు, ఎగ్రికల్చరిస్టు, ట్రుస్టోరీ, ఇంగ్లాండు దేశంనుంచి మాంచెస్టరుగార్డియను, అవుట్ లైన్ టిట్ బిట్స్, టవున్ అండ్ కంట్రీ మాగెజిన్సు, ఆర్గొసి పత్రికలు ఆదివారమునాడు హారిన్ మెయిలురోజున వస్తూవుంటవి. ఏవో యివీ అవీ చదువుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ మధ్య మధ్య పొలముపని చూసుకుంటూ — పిల్లలను సగబెట్టుకుంటూ గడుపుతున్నాము — అన్నట్టు మరిచిపోయినాను, పూలతోట చూపిస్తాను రండి ' అన్నది.

ఆమెవెంట నాతడు, బాలచంద్రుడు బయలుదేరినారు. రెండు అడుగులు వేసినతర్వాత బాలచంద్రుడు పట్టుకొనిన తల్లి చిటికెనవ్రేలు వదిలి రెండు గంతులువేసి ప్రత్యేక మేర్పరుపబడిన గూటిలోనున్న పొదకోడిని పట్టుకొనివచ్చి తల్లికెదురుగా వెళ్ళి ఆమె నాపుజేసి కోడిరెక్క విడదీసి పట్టుకొని 'అమ్మా, నాకుకూడా యిటువంటి రెక్కలేవుంటేనా చెట్లు ఎక్కకుండానే, నేరేడిపళ్లూ, తాటిపళ్లూ, కొబ్బరిబొండాలూ కోసుకొచ్చి ఒక్కగంతులో నీకివ్వకపోయూనా—అమ్మా, యింకా యేమిచేస్తానో తెలుసా ఎప్పుడు బెంగపుడితే అప్పుడే నాన్నగారిదగ్గిరి కెళ్ళి ఆకుమళ్ల చెరువులో వాల్తాను' అని ఆమ చెరగు పట్టుకొని లాగుచు ఆమె కనులవంక చూచుచునే అన్నాడు.

అతను 'నా సంగతి నేనొక్క నెక్కి ఎగిరి పోగాను సూర్యుడికి త్రోవ చెప్పాను'

బాల 'అన్నయ్య కొండనెక్కి మొగండుపు చేస్తేనా సూర్యుడు వచ్చినట్లు నాకేమనిపిని, ఆపాటికి ప్రాణాలొదిలిన్నప్పుడు ప్రజాపతిగాయిని యెదురొమ్మునిక్క కొట్టి పంపినవాణ్ణి —'

తల్లి 'బాలా—'

బాల 'లేదండి, పోనీలెండి, ఆరోజున ప్రజాపతిరాయి చచ్చి పోయాడని తెలియంగానే మాయమ్మ, మానాన్నగారు ఏడ్చారండీ. నేనుకూడా యేడ్చానండీ! పాపం—'

తల్లి నవ్వుచు సంభాషణ మార్చే యుద్దేశముతో 'పోద కొండనెక్కి చందమామదగ్గిరికి వెళ్ళరాదూ, నీకుపెద్దన్నయ్య అవుతాడుగా అతను' అన్నది.

బాల 'అవునమ్మా, నిన్న చందమామ మేఘాలతో పరిగెత్తలేక వెనక పడిపోతే మనమంతా చూచి నవ్వలేదూ! ఏమి పిచ్చి అన్నయ్యా యింతేనా నీపస అని చెప్పి వద్దామనుకున్నా కూడాను—అమ్మా, అటుచూడు కొండ మీద నల్లమబ్బులు ఎల్లాపరుగెత్తుతున్నవో! వాటితోటి సమానంగా భూమిమీద నేనూ పరిగెత్తగలను.'

నూతనుడు, ఆమె కూడ ఒకేసారి ఆకసపువంక జూచి:

ఆమె 'ఎంతలో మబ్బులు క్రమ్మేసినయి'

అతడు 'అవునండీ, ఈ మాటలసందడిలో మనము చూడనే లేదు' అన్నాడు.

బాలచంద్రుడు గంతులు వేయుచు అమ్మా 'చినుకులు పడుతున్నయ్యే' అని

'వానలు కురవాలి
వరిచేలు పండాలి
మాగరిసె నిండాలి
బుడుగో! బుడుగో!
మాగాసి దంచాలి
మాయమ్మ వండాలి
మాబొజ్జ నిండాలి
బుడుగో! బుడుగో!'

అనుచు పరుగెత్తి పోయినాడు.

చటాలున వెనుకకు తిరిగివచ్చి బాలచంద్రుడు 'అమ్మా! వాన కురిస్తే నేలంతా తడుస్తూవుంది; కొండ తడవదేమే' అన్నాడు.

తల్లి 'కొండ తడవదు నాయనా! అక్కడ సూర్యుడుండి తడవకుండా కాపాడుతాడు.'

౨

మొకరములమీదనే ఆధారపడియున్న పాకలో నొక మెత్తని చీటపై నా నూతనపురుషుడును, కొబ్బరియాకు చాపపై నామెయు, నామె యొడిలో బాలచంద్రుడును కూరుచుండి

యున్నాడు [illegible] చూపగించిన [illegible] ఏనుగు తొండము[illegible] [illegible] [illegible] వచ్చి ఒక్క గంతులో [illegible] వచ్చి పడి నారు. పసిపాపను [illegible] తల్లి యున్న పాక లోనికి జనినాడు. వెంటనే తల్లి గండు[illegible] తనక్రింది పెదవి నొక్కినది పుత్రుని రాకగాంచి. ఆ దెందులకో బాలుడు గ్రహించినాడు. చంటిపిల్ల నొకచో ఉత్తరీయాకుల చాపపై గుడ్డలుపరచి పరుండబెట్టి వెళ్ళి తల్లిప్రక్కనే ఆసీనుడైనాడాతడు.

బాలచంద్రుడు తల్లి గుండెలోనుండి లేచి వెళ్ళి చంటిపిల్ల వద్ద కూరుచున్నాడు. వాన అటులనే జోరుమని కురియు చున్నది. నడుమనడుమ మెల్లగా ఉరుములు, తళుకు తళుకు మని మెఱుపులు.

తల్లి 'మా పిల్లలకు వాన అంటే చాలా యిష్టమండీ. క్రొత్త వారు మీరున్నారని ఆగినారు గాని లేకపోతే ఈసరికి బట్ట లన్నియు తడుపుకొనేవుంటారు. నామట్టుకు నాకు కూడా వాన కురుస్తూవుంటే మెక్కుడలేని సంతోషము, ఉత్సాహము కలుగు తుంది. జోరుమని వాన కురుస్తూఉంటే ఏమో పరమేశ్వరుడే తనకరుణావృష్టి కురిపించుతూ ఉన్నాడా అనిపించుతుందండీ, అదేమో కాని.'

అతడు 'అవునమ్మా, వానలు లేకపోయినా, సూర్యుడు లేక పోయినా మనుష్యులగతి యేమయిపోవలసిందీ! పంటలు బాగా

పండుతయి, పదిమంది కడుపునిండా భోంచేస్తారు.' పెద్ద వారు 'ఈ మధ్య అమెరికావారు వాన కురిపించే యంత్రమును కని పెట్టినారండీ మీకు తెలుసునో లేదో! యంత్రము పైకివెళ్ళి అక్కడి గాలిలోవున్న సూక్ష్మమైన నీటిబిందువుల నన్నిటినీ చేరదీసి వర్షము కురిపిస్తుంది.'

బాలచంద్రుడు 'దాని జోలి నా కెందు కన్నయ్యా! చల్లగా వాన కురుస్తూ ఉంటే మన ముతకబట్టల్లో యెంత వెచ్చగా ఉంటుందో చూడు, కుంపటిదగ్గిర, చలిమంటదగ్గిర కూడా అంత హాయిగా ఉండదు.'

నూతనుడు 'అయితే యిందాకనే మిమ్మల్ని అడుగు దామనుకొని మీరేమనుకుంటారో అని అడగలేదు; యింత నాజూకుదనము, చదువు వున్నటువంటివారు మీరుకూడా యిటువంటి మోటుగుడ్డలు వేసుకోవడము చూస్తేనాకు నవ్వు వస్తుందమ్మా, మీరేమన్నా సరే. అల్లాగైతే మీరు స్వదేశీ వారా యేమిటి?' అనిపరిహాసాత్మకమైన చిఱునవ్వు నవ్వినాడు.

ఆమె 'మేమే యేమిటి, మీరు మాత్రము స్వదేశీవారు కారా! మనము విదేశీవాళ్ళ మెల్లా అవుతాము, యీగడ్డ మీదపుట్టి యీగాలిలో పెరిగినవాళ్ళము.'

అతడు 'అదికాదండీ నేనన్నది. అయితే మీరుగాంధిగారి శిష్యులా యేమిటి అన్నమాట.'

ఆమె (నవ్వుచు) 'ఓహో, అదా మీఅర్థము. అల్లాగైతే ఒక విషయములో మేము గాంధిగారి శిష్యులమే, గుడ్డలు

వేసుకోవడములో, మీ వంటివారిని కూడా యీ మోటు కద్దరు బట్టలు వేసుకోమని బతిమాలుతాము. ఈముతక బట్టలు మనము వేసుకోవడమంటే సగమంది కూడా లేని వాళ్లకు అన్నము పెడుతున్నామన్నమాట. మనదేశ మెంత బీద దేశమో మీకుమాత్రము తెలియదా యేమిటి? మావంటి ఆడవాళ్లు చెప్పవలెనా.!

అతడు 'అదియేమో కాని గాంధి మాటాడితే 'రాట్నం, రాట్నం' అని కలవరించడము చూస్తే నాకు నవ్వువస్తుంది.'

ఆమె 'అవును మీ వంటివారికి నవ్వు రావడములో ఆశ్చర్యములేదు, విదేశీయులు కూడా ఆతని మహాత్మ్యము తెలుసుకొని పూజాదృష్టితో చూచుతూ ఉన్నప్పుడుకూడా. గాండ్రు, గ్రాండుమని మీదపడే సింహాన్ని ఒక్క పోటుతో చంపే బలాఢ్యుడు కూడా పుండుపై వ్రాలి బాధకలిగించే ఈగలను పట్టుకోలేక పోతాడని మీకు తెలియని సంగతా! 'బలవంతమైన సర్పము చలిచీమలచేత జిక్కి చావదెనుసుమతీ' అని చిన్నప్పుడు చదువుకున్న సంగతి మరచిపోయారూ?'

అతడు 'ఎంత ఆలోచించినా నాకీ కద్దరు ధరించడ మెందుకో అర్థము కాదమ్మా! మొన్న మొన్నటివరకూ జర్మను మహాయుద్ధముతో దేశమంతా అట్టుడికినట్లు ఉడికిపోయింది. మళ్లీ యీ నాన్‌కోపరేషన్ బయలుదేరి దేశాన్నంతా శ్మశానము చేసివేస్తూంది. ఉద్యోగము చేసుకొని పదిడబ్బులు గడించి కుటుంబాలను పోషించేవాళ్లంతా ఉద్యోగాలు మానివేశారు,

చదువుకునే పిల్లలు బళ్లు గుంగట్టోట్టచేశారు. ఉన్న విలువగల బట్టలన్నీ తగలబెట్టుకొన్నారు. గాంధీగారి ఆజ్ఞ అయితే యిళ్లు కూడా తగలబెట్టుకొందురు అప్పుడు సొంతవూళ్లలో వుండేటంతే వుండేటట్లు కనిపిస్తుంది వీళ్ళంతా. ఉనికి లేదుయిందిగాని: ఉభయ భ్రష్టత్వము ఉపరి సన్యాసమూ చిల్లి గవ్వకైనా పనికి రాకుండాపోయారు వీళ్ళంతా. ఎవరో గడుసువాళ్లుమాత్రము కాంగ్రెసు సభలుచేసిన కోటి రూపాయలు వాడిలో పోసుకొని దారితీశారు. కడమా వాళ్లు తెల్ల మొగాలు వేశారు. ఒక కథ ఉన్నదిలెండి: బాగా బలిసివున్న వొక నక్క కటకటాలు వున్నదొడ్డిలోని ద్రాక్షపళ్లు తినడానికి ప్రయత్నించిందట. లోపలికి ఎల్లా వెళుతుంది, కటకటాలలో నుంచి దూరలేదు బలిసివున్న శరీరంతో. అందుకని మూడు రోజులు ఉపవాసంచేసి బక్కచిక్కి కటకటాలలో నుంచి దూరి తృప్తిదీరా రోజుఅంతా ద్రాక్షపళ్లుతిందిం. మళ్ళా బలిసింది. బయిటికి వద్దామంటే పట్టదు. మళ్ళా ఉపవాసముచేసి బక్క చిక్కి బయటపడింది. ఏమిప్రయోజనము? అల్లావుంది నేటదకు ఎందుకూ చెల్లకుండా పోయారు. హాయిగా శాంతియుతముగా దేశముంటే ఈ నాన్‌కోపరేషనేమిటి, బట్టలు తగలబెట్టుకోవడ మెందుకు? కడుపులో చల్ల కదలకుండ పడివుండలేక యీ గోలఅంతా యెందుకో వీళ్లకి?'

పెద్దకుమారుడు 'నక్కకథకు నాన్‌కోపరేషనుకు సంబంధ మేమిటో నా కర్థము కాలేదు. 'కడుపులో చల్ల కదలకుండా,

వుండడంగుంటే : గాడిదలు, కుక్కలుచేసే పనిఅదే. వాటికి కావలసిన దేనిటో తిని యిటుఅటు దొర్లి 'ప్రపంచమునాతో నా కేమి. ని' అన్నట్లు 'పుట్టింది, చచ్చింది' అన్నట్లుగానే బ్రతుకు వస్తుని. మనమో మనుష్యులము. జంతువులవలె ఎల్లా వుండగలమూ ? అయితే యిక వాటికీ మనకూ భేదమేమిటి ? జీవితోన్నతి—రోజురోజుకి శ్రేష్ఠత్వము కోసము మానవులకు పిపాస స్వభావసిద్ధముగానే వుంది. ఆ పిపాస తీర్చుకోవడానికి, జీవితోన్నతి పొందటానికి ఎటువంటి కష్టములైనా పొందవలె. రాళ్లవలె అప్పులవలె మన మూరుకుండలేము. మనము సజీవులము. మన రక్తనాళాలలో వేడినెత్తురు ప్రవహిస్తూ ఉన్నంతకాలము, మనలో దివ్యతేజస్సు వెలుగుతూ ఉన్నంతకాలము, జంతువులవలె, రాళ్ళవలె ఊరుకుండలేము. పైమెట్టు ఎక్కడానికి, చేతినుండి జారిపోయిన, లాగుకొనిపోబడిన స్వేచ్ఛామృతముకోసం—ఆజ్యోతికోసం పోరాటము జరుగుతుంది. జరగవలసిన అవసరము ముమ్మాటికి గలదు. మీమో ఎవరో పరిపాలిస్తున్నారు, కాస్తతిండి పడవేస్తున్నారు — పడివుండరాదా అనవలసింది మీవంటివారు కాదు. వాళ్ళు వేరే వున్నారు. జర్మను యుద్ధమైంది. మళ్లా ఈ పోరాటము అలజడి యెందుకు పిచ్చివాళ్ళు కాకపోతే అంటారా ? మనుష్యులు, మనుష్యులు కత్తులు, తుపాలు పట్టుకొని యుద్ధము చేయడము లేనంతమాత్రానే శాంతికలుగుతుంది. శాంతి అంటే అదికాదు. యుద్ధము అయిపోయినంత మాత్రాన

శాంతి దేశానికి లభించలేదు. అది ఆత్మలోనుంచి-సంస్కా రమువల్ల ప్రసాదింపబడుతుంది. బహిఃప్రపంచము కొంతవరకూ దానికి సాయపడుతుంది. నిరనధికమైన, నిస్తులమైన శాంతి దేశానికి ప్రసాదించడానికే ఆ మహాత్ముడీ యుద్యమాన్ని బయలు దేరదీసింది. ఇది ఒకానొక మహోత్కృష్టమైన సాధు ఆత్మోన్నతికోసము, జీవితోన్నతికొరకు. Spinoza చెప్పాడు 'For peace is not the absence of war' అన్నా నిన్న నాన్నగారు చెప్పారు దాని తరువాతి వాక్యమేమిటి?'

తల్లి 'It is the virtue that is born of the vigour of the soul' అని Tractitus Politicus లో వుంది.

బాలుడు 'అవును, అవును వినండి మళ్లా వొకసారి, It is the virtue that is born of the vigour of the soul, అన్నాడు Spinoza అనే ఒక గొప్ప డచ్చి వేదాంతి. అంటే ప్రతీ ఆత్మ ఉన్నతినందవలె. అప్పుడు శాంతి ప్రశాంతి. అంతవరకు కష్టము, సుఖము, ఆనందము, దుఃఖమూ ఏవీ లేవు. అటువంటి virtue, ఆత్మోన్నతి కోసమే ఆమహాత్ముడీ యుద్యమానికి ప్రాణముపోసింది. పరదేశీయుల పరిపాలనలో నిర్వీర్యులైన, నిస్తేజులైన, నిష్ఫలులైన ధర్మజ్ఞానములేక పరమేశ్వరప్రసాదితమైన స్వాతంత్ర్యము గోల్పోయియున్న జాతికి ఆత్మోన్నతి యెక్కడిదీ. లేకపోతే? ఇవన్నీ - యింకా మన ఊహకుకూడా అందని వెన్నో లోతుగా ఆలోచించియే ఆమహాత్ముడు ఈయుద్యమము బయలుదేరదీశాడు. మనము విజయము పొందినప్పుడే ఆనాడు

నిష్కారణముగ, నిర్విణ్ణులై, నీరవులై, క్రూరముగా, నీచముగా జలియనువాలాబాగులో ప్రాణములు గోల్పోయిన ఆపరమ భాగవతుల ఆత్మలు శాంతి నందుతయి. ఆనాడే ఆదేశీయ సోదరుల పవిత్రాత్మలు ఆనంద ధామము చేరుతయి. అంత వరకు మనకూ వారికీ కూడా ముక్తిలేదు.'

అంతటి చల్లని వాతావరణమున గూడా ఉద్రేకముచే చెమటలు గార్చుచున్న పుత్రునిగని ఆమె చిరునగవుతో, 'తండ్రీ, అంతతొందర పడకూడదు, ఇతరులతో మాట్లాడే టప్పుడు. ప్రశాంతముగా వున్న చిన్న తటాకములో ఒక రాయి వడవేస్తే నీరంతా అల్లకల్లోలమైనట్లు, ఆయనేదో అనేటప్పటికి అంత ఉద్రేకం పొందినావు. అది సరికాదు. ఒక్కొక్కప్పుడు నేనుకూడా యీవిషయమైయే చాలా పరి తాపపడుతూ వుంటాను. మీనాన్నగారో, ఆయన హృదయం సముద్రమువలె అనంత గంభీర మయినది. అందులో ఒక బెడ్డ కాదు ఏనుగు దూకినను చలించక అటులే వుంటుంది. నీ దృష్టిలో ఆ యాదర్శ ముంచుకోవలె. ఎవరితో ఎప్పు డెల్లా మాట్లాడవలెనో కూడా నీకు నాన్నగారు చెప్పే వున్నారు.' అని మరల రెండుమ్రేళ్ళతో తన పెదవి నొక్కుకొన్నది.

బాలు డేమియు మాటాడక చిరునగవు తోడనే ఊరు కున్నాడు.

బాలచంద్రుడు 'కాంగ్రెసుసొమ్ము దొంగతనముగా తిన్న వాళ్ళంతా రాంబొందులకన్నా నీచులని నువ్వే చెప్పావు కాదమ్మా.'

తల్లి 'అవునునాయనా, ఎంతోమంది మహాపతివ్రతలు దేశం కోసమూ, మానంకోసమూ గాంధిమహాత్మునకు ఇచ్చి పోతు మెత్తితే ఒంటిమీదినగలు, కట్టుకునేబట్టలు అన్నీతీసి, చివరకు మంగళసూత్రాలు కూడా తీసిఇచ్చి త్యాగమూ కనబరిచిన మహా త్యాగమూర్తు లిచ్చిన ధనం హరించిన వాళ్లు మన దృష్టిలో రాంబొందులకంటే, రాక్షసులకంటే నీచులు, క్రూరులు కారా మరి? వాళ్ళకు హృదయంలేదు. ఒకవేళ ఉన్నదా అది రాతితో చేయబడ్డదే. నాయనా ఈయన దృష్టిలో గడుసువారు, కమనీయ కీర్తులు, పాపం!'

అంతవరకు వర్షమువైపు, ఆకసమువైపు చూచుచు ఆమె మాట లాలకించుచున్న అతడు 'వాళ్లు ఏమైతే మనకేమి లెండి. ఏదో మాటవరుసకన్నానుగాని నేనుమాత్రము వాళ్ళ పని హర్షించుతానా అంతమంది ముందువెనకా చూడకుండా త్యాగముచేసిన సొమ్ము హరించారంటే - కాకపోతే నా సందేహ మేమిటంటే అటువంటి దొంగలు, నీచులు — ఇందాక మీరే అన్నారుగా నూటికి తొంబయి తొమ్మండుగురు మూర్ఖులని - యిటువంటివాళ్లు యింతమంది వుంటే ఒక్క గాంధీమహాత్ముడుతోటి — మీవంటివాళ్లు పట్టుదల గలవాళ్లు వట్టుమని పదిమందిలేకే — యింత చిన్నసంఖ్యతో స్వరాజ్యం యెల్లావస్తుందా అని నాసంశయం. ఒకప్రక్క హిందూమహమ్మదీయులు, యింకొకప్రక్క బ్రాహ్మణులు, బ్రాహ్మణేతరులు మరియొకప్రక్క పంచములు, క్రైస్తవులు పోట్లాటలు.

పోనీ యివి అంత లెఖ్ఖచేయతగినవి కావు అనుకుందామా, మనము మాటాడేది ఒకభాష, ప్రక్కవాళ్లు మాటాడేది యింకొకభాష. ఒకరిభాష వొకరికి తెలియదు — దేశ మంతా నూటతొంబయి తొమ్మిది భాషలు, వేయినూర్లు కులాలు, జాతులు — ఇన్నిటితో ఐక్య భావము ఎల్లా కలుగు తుందో నాకర్థము కాకుండా వుంది' అన్నాడు.

ఆమె 'అయ్యా, యిదంతా పాతపురాణం. మూర్ఖులు లేని దేశమే లేదు. ఫ్రెంచి రివల్యూషన్‌లో ద్రోహులు లేరా, అమెరికా స్వాతంత్ర్య సంగ్రామములో కుచ్ఛితులు లేకపోయి నారా? రషియా స్వేచ్ఛాసమరములో కల్మషులగతి యేమ యినది? కాకపోతే వీళ్ళందరినీ నడపటానికి శక్తిమంతులైన నాయకులు కావాలి. నాయకులు తాము చెప్పినమాట దాట కుండా వీళ్ళనందరిని తయారుచేసుకోవాలి. చీమలు చూడండి. వేనకువేలు, లక్షలు వుంటవి. అవన్నీ నాయకుడు చెప్పినట్లే బాలురుతీర్చి వెంట బయలుదేరుతవి. అంతటి సుజ్ఞానము కూడా మానవులలో మాయమైపోయింది. అది నేడు సమర్థు లైన నాయకులవల్ల పొందవలె. ఇక అనేకభాషలు, అనేక కులాలు ఉన్నవంటారా? నిజమే. ఏడువేలమైళ్ళ దూరము నుంచి వ్యాపారము నిమిత్తము వచ్చి అదివరకే వున్న డచ్చి, పోర్చుగీసు, ఫ్రెంచివాళ్ళను, పీఠంవేసి యేకఛత్రంగా నిరంకు శంగా పరిపాలిస్తూవున్న మహమ్మదీయులను మసిబూసి మారేడుకాయ చేసివేయలేదూ కుంపినీవారు? వారికి మన దేశ

భాషలైనా రావే! మనదేశములోవున్న ఆచారాలు, కులాలు వివిధజాతుల భావప్రవృత్తి (Psychology) అయినా బాగా ఎరగరే. వారు అటువంటి పరిస్థితులలో మనభాష తెలియకున్నా! మనకు బాటలైనా సరిగాలేవు, ఆరోజుల్లో. వారు రక్తమైనా ఎక్కువగా దేశానికి బలియిచ్చుకోకుండా బెంగాళాంతా జయించలేదూ! మనమో ఈదేశములో పుట్టి, ఈ దేశములో పెరిగి — మన భావప్రవృత్తి యెట్టిదో మన మెరుగుదుము — బాటలు, క్రొత్త క్రొత్తపరికరాలుకూడా లభించివున్నాయి. ఇప్పట్లో ఇట్టిపరిస్థితిలోనే మనదేశాన్ని మనము పొందలేక పోతే యింకెప్పుడో ఎక్కడో ఎల్లాగో చేయగలుగుతా మనేది కలలోవార్త. ఒకప్రక్క గాంధి, మరొకప్రక్క జవహర్‌లాలు ఇద్దరు మహావీరశిఖామణు లున్నారు — వీరి నాయకత్వములో మనవారు ఒక్కహృదయంగా అయిపోయి ఒక్క తాడుమీద నడిస్తే యేమి సాధించలేము?'

అతడు 'అయితే కావచ్చు, ప్రస్తుతము నే నేమీ చెప్ప జాలను. కాని — నిన్నగాక మొన్న కలకత్తా, ఢిల్లీ, లాహోరులలో మహమ్మదీయులు, హిందువులు కొట్టుకొని చచ్చినారు దానికేమి చెపుతారు' పెద్దకుమారుడు 'అమ్మా, ఈసారి జనాబు నన్ను చెప్పనియ్యవే! — అయ్యా, యిటు చూడండి మహమ్మదీయుల మధ్య హిందువుల మధ్య కొట్లాటలు ఉండ వలసినదే. బ్రాహ్మణులకు బ్రాహ్మణేతరులకు సాంఘిక సమరముకూడా ముఖ్యముగావుండవలె. పంచములలోను, క్రైస్త

వులలోను కలవరము కూడా ముఖ్యముగా వుండవలెనని చెప్పు తాను. ఇవన్నీ ఏమనిచెప్పుతున్నవో చిత్తగించారా! దేశములో స్వాతంత్ర్యేచ్ఛ, స్వేచ్ఛా సమరోత్సాహము వ్యాపించినదని. ఇంతకాలరకూ అడిగిమడిగి, అధఃపాతాళమున కణగిపోయి నుట్టి దిన్న పాములవలె పడియున్న దేశీయులలో ఒకజాతికి, యింకొక జాతికి యీ సమరగములు బయలుదేరినవంటే సంచలనము కలి గినదన్నమాట. ఒకరికంటె ఒకరు జీవితోన్నతి బడయవలెనని కోరిక, పట్టుదల కలిగిన వన్నమాట. ఇంతవఱకు 'సంధ్యా వందనము నిరభ్యంతరముగా జరిగితేనే చాలు' నని కొందరు — 'పొలం బాగాపండితే పదిపుట్లు ధాన్యం ఒడిలో నడత' వని కొందరు — 'బ్రతికుంటే బలుసాకులైనా యేరుకు తినవచ్చు' నని మరికొందరు - 'యేమిశాశ్వతం, బ్రతికే రెండురోజులు కడుపులో చల్ల కదలకుండా' అని యిందాక మీరన్నారే, అల్లాగు కొందరు వైరాగ్యముతో సమస్తము సన్యసించిన సన్యాసుల వలె ఆకాశమువంక చూస్తూ మీనమేషాలు లెక్కపెట్టు కొనుచూ రాజ్యము పరులచేతులలో బుద్ధిపూర్వకముగానే మనము పెట్టివేశాము. వైరాగ్యము: 'ఏదియెల్లాపోతే మన కెందు' కనే మనకొంప తీశారు ఆనాడు దేశీయులు. ఇప్పుడో ఆ వైరాగ్యపు వెర్రివదిలింది. వైరులపై వైరుధ్యము మనస్ఫూ ర్తిగా కలిగింది. వేడిరక్తము ఉబికింది. నాళాలు బిగిసి శక్తి మంతమైనవి. చిన్నప్పుడు నేర్చుకున్న 'నరుడు పౌరుష జీవి తోన్నతికేగాని పుడమి పుట్టుటు చచ్చిపోవుటకుగాదు' అనే

వాక్యము సాధనలో పెట్టవలె ననే సంకల్ప ముదయించింది. స్వాతంత్ర్యపు వాసనలు దేశమంతా వ్యాపించిపోయినవి. క్రొత్త నడక, క్రొత్తదృష్టి, క్రొత్తవిజ్ఞానము, సరిక్రొత్త దేశభక్తి దేశీయప్రజలను వశపరచుకొన్నవి. అందుచేతనే ఈ కొట్లాటలు, పోట్లాటలు, ఒకరికంటె ఒకరు పైకి రావలెనని, ఒకరికంటె ఒకరు తమశక్తి చూపవలెనని, ఒకరికంటె ఒకరు తమదేశభక్తి యెక్కువగా ప్రకటించవలెనని — పిపాసాగ్ని రేకెత్తి యిదివరకు వున్నమందమతితనము, నిద్రమత్తు, వైరాగ్యము బద్ధముచేసి దేశీయప్రజలలో వొక నూతన తేజస్సు కలిగించింది. ఆస్వాతంత్ర్యేచ్ఛయొక్క, ఆపౌరుషజీవితోన్నతికై పిపాసయొక్క రేఖలే, ప్రతిబింబాలే ఈ దేశములోని కల్లోలము, అలజడిన్నీ. ఈ కల్లోలము, ఈ సమరోత్సాహము రాబోయే గొప్పయుద్ధానికి—యుద్ధమంటే తుపాకులు, తుపాకులు పుచ్చుకొని యుద్ధము చేయడముకాదు — అది ఆధ్యాత్మిక సంగ్రామము. దానికి యివన్నీ ప్రథమసోపానములు. ఇప్పుడిది సాధనాసమయము. దేశీయులు శిక్షపొందుచున్నారు, వీటి మూలంగా ఫలసిద్ధి అందుకోవడానికి, తుదకు సమస్తము కూడా త్యాగముచేసి.

'అయితే కేవలము ఈ పోట్లాటలు ఉత్తమమైనవే అని నేను చెప్పడములేదు. వాటిలో మంచి ఉన్నది, చెడ్డకూడా ఉన్నదంటాను. ఆకొద్ది దోషములు పోగొట్టుటకైయే సత్యాగ్రహము, బ్రహ్మసమాజము, ఆర్యసమాజము, రామకృష్ణ వివేకానందమతము, విశ్వభారతి పని చేస్తున్నవి. వీటిమూలంగా

దేశీయులలో శాంతిప్రయత్నము జరుగుతూ ఉన్నమాట నిజమే అది తెలిసివుండియే నేను రెంటిని చూచి హర్షించుతాను. అసలే సంచలనము లేకపోతే, యేదో వొకరీతిగా, దేశీయులు కొన్నాళ్లకు రాళ్లవిగ్రహాలై పోతారు. సర్వము మంచికొరకే అనే పద్ధతిలోవాణ్ణి నేను. నాకు కావలసింది దేశములో ఉజ్జీవము, ఉత్తేజము, స్వాతంత్ర్యపిపాస ప్రస్తుతము మన కీపు జయమువల్ల, అపజయమువలన కూడా లభిస్తున్నవి. మొన్న బార్డోలీరైతుల సత్యాగ్రహ యుద్ధములోని విజయము, అతని పాదధూళికైనా తాకుట కర్హతలేని యొకానొక అల్పుడు లజపతిరాయిని చంపాడూ అంటే తన్మూలమున కలిగిన అపజయము — రెండును దేశీయుల రక్తనాళములలో నూతనోత్సాహము, నూతనోత్తేజము, స్వేచ్ఛాపిపాస ప్రజ్వలింపజేసినవి. ఒకానొక నూతనబలము, వొళ్లు మరపించే శౌర్యము, వాడలు పులకించే పట్టుదల ఆవేశించినవి ప్రజలలో. ఇక మనకు భయములేదు. ఇక మనహృదయాలలో నిరాశకు, నిర్వీర్యానికి చోటులేదు. ఆ దురదృష్టపురోజులు గతించి పోయినవి. ఇప్పుడు గాలిలో కూడా ఆధ్యాత్మిక సమరోత్సాహము ప్రసరించి పోయింది. నక్షత్రాల వరకు వ్యాపించి పోయింది. మనలను పరమేశ్వరుడు ప్రేమదృష్టులతో ఆశీర్వదించుచున్నాడు; అందులో అబద్ధములేదు.'

తల్లి 'బాగా చెప్పినావోయి, తండ్రీ. కాని మగవాడవైనందుకు నీగుణము పోయిందికాదు. మా స్త్రీల తోడ్పాటు సంగతి చెప్పినావే కాదేమి! సరోజినీదేవివంటి నాయికురాలు మనకున్నదంటే, వసంతాదేవివంటి సదమల మాతృదేశా

రాధకురాలు మనభాగ్యమైతే, అన్నపూర్ణాదేవివంటి మహాత్యాగశీల, వీరవనిత మనలోనివుంటే మనకేమి కొరతవున్నది! ఆనాడు ఫ్రాన్సులో జోన్ ఆఫ్ ఆర్కు వీరావేశురాలు వున్నదీ అంటే, మనదేశములో ఝాన్సీలక్ష్మీబాయివంటి నిర్వ్యాక్రమ పరాక్రమురాలు వెలిసినది ఏనాటికైనా లక్ష్మి, సరస్వతి, పార్వతీ దేవులవలె పురుషులతో పాటు స్త్రీలుకూడా వుంటేనే త్వరలో దాస్యవిముక్తి కలుగుతుందన్నమాట మరిచిపోయినావు కామాను! ఆనాడే విజయలక్ష్మి తనంతతానే వరిస్తుంది దేశాన్ని. అప్పుడు దేవతలు పూలవర్షము కురిపిస్తారు. పరమాత్ముడైన జగన్నాథుడు హృదయపూర్వకముగా ఆశీర్వదించుతాడు.

బాలుడు చిరునగవుతో 'అవునమ్మా, మరిచిపోయితిని. క్షమించు' అన్నాడు.

బాలచంద్రుడు 'అమ్మా నేనుకూడా రావద్దేయుద్ధానికి.'

నూతనపురుషుడు ముసిముసినవ్వు నవ్వుచు 'నువ్వెవరితో యుద్ధము చేస్తావోయి. నాతోచెయ్యరాదూ, లేకపోతే పోనీలే గాలితో చెయ్యి చూద్దాము.'

పెద్దకుమారుడు 'ఏమండీ, నేను మాయమ్మ చెప్పినదాని కేమంటారు?'

బాలచంద్రుడు తెచ్చుకొనిన కోపముతో 'నేనిప్పుడు గాలితో కుస్తీపట్టు నేర్చుకుంటున్నా. పెద్దయ్యాక ఎవరు అడ్డు వస్తే వాళ్లమీద చేస్తాను యుద్ధము' అన్నాడు.

నూతనుడు పెద్దబాలునివైపు చూచి 'ఏమనుటకేమున్నది? మీవంటివారికి యేమిజవాబు చెప్పగలను. నీకు చూస్తే ఏది

హేనుయేళ్ళులేవు; ఈ వుపన్యాసాలు ఎక్కడ నేర్చుకున్నా వయ్యా!" తల్లి 'మావాడు కొన్నాళ్ళు ప్లాటుఫారములెక్చరులు కూడా యిచ్చాడులెండి; అప్పుడు బాగా తరిఫీయతు అయ్యాడు.'

నూతనుడు: 'కాని యేమైనా మీవంటివారు పట్టణాలలో వుండి వుద్యోగాలు చేస్తూవుంటే యెంత కనులపండువుగా వుంటుందీ! ఇప్పుడు కచేరీలలోన, ఉద్యోగాలలోను వున్న మాలిన్యమంతా ఊడ్చిపెట్టుకుపోతుంది. అప్పుడు మీచేతికింద పదిమంది బంట్రోతులు, ఆశ్రితులు కలకలలాడుతూ వుంటారు. ఏమైనా యిదేమో అడవిలాగు మనుష్య సంచార మైనా లేకుండా వొక్కరే వుండడమంటే నాకుమాత్రము నిజము చెపుతున్నాను కష్టముగానే వుంది. వచ్చి గంటన్నర కాలేదు మొల్లాగో బెంగగా వుంది అప్పుడే.'

ఆమె 'నాకు ఎల్లెటూళ్ళే స్వర్గలోకం. ఆ వుద్యోగవు దర్జాలు, నౌకర్లు, చాకర్లు మాకెందుకులెండి, మీవంటివారికి గాని. బస్తీల చెడుగాలి, యిరకాటము, హడావుడి మేము భరించలేము. మాకీ గొడ్లు, గోద, పాడి, పంట, యివేపదివేలు. స్వచ్ఛమైన నీటిలో హాయిగా స్వేచ్ఛగా తిరిగే మత్స్యాన్ని తీసుకువెళ్ళి సింహాసనము మీద కూర్చో బెట్టితే దానికి బంగారము, వెండి, రత్నాలు, సేవభావలు ఎందుకూ? మీదుమిక్కిలి వుక్కిరి బిక్కిరి అవుతుంది కూడాను.'

నూతన పురుషుడు 'ఇప్పటికే చాలా ఆలస్యమైంది. వాన వెలిసింది కూడాను. నేనేమైనా తప్పులు మాటాడితే క్షమించండి. సెలవుపుచ్చుకుంటాను' అని లేచినాడు.

ఆమె 'మంచిది. నాయనా, వారి సంతోషవరకు ఉంచింది గా' అని చెంటిపిల్లను, బాలచంద్రుని తీసుకొని పొలముగట్టువైపు బయలు దేరినది. పొలములో నెప్పటివలెనె కూలిస్త్రీలు కోస్తున్నారు. మొలకనవుకున్నకు పెద్దబోదెమీరాని తాటి పట్టెలు జాగ్రత్తగా దాటి తుమ్మచెట్ల గుంపువరకు వెళ్లినారు.

ఇంతలో యింటియజమాని, పెద్దకుమారునితో కలిసివచ్చుట గని ఆమె లేచి మరల రెండుగ్రేళ్లతో పెదవి నొక్కుకొన్నది. యజమానియు నటులే పెదవి నొక్కుకొని నవ్వుచు 'రోడ్డు ప్రక్కనే బోదె బాగుచేయిస్తూ అతని మనయింటివేపు రానిచ్చాను చూశాను. కనిపెట్టినావుకదూ!' అన్నారు.

ఆమె 'తెలిసే మీదేవ్వారని కూడా అడగకుండానే పంపించి చేశాను. మన రవుడీ అందరికంటె ముందుగానే పసిగట్టింది సుమండీ!' అన్నది.

* * *

ఆరునెలలు గడచినవి. సాయంసమయము. ఆమె వంట చేయుచు లోపల ఉన్నది. ఆయన పడకకుర్చీలో కూర్చుండి ఆంధ్రపత్రిక చదువుచున్నారు.

అప్పుడొక పోలీసుఇన్స్పెక్టరు, ఇర్వురుబంట్రోతులు వచ్చి ఆయనకొక కాగితము అందించినారు. ఆయన మహానముతో డనే ఆ కాగితము అందుకొని వంటయింటిలోనికి వెళ్లి నవ్వుచు "ఏమండీ, అమ్మగారు, మనకు సర్కారువారి సెలవుఅయింది, కృష్ణజన్మస్థానానికి రమ్మని ఇద్దరినీ. వంట కొంచెం ఆపుచేయించండి, వచ్చే సంవత్సరం వచ్చి మరల వంటచేసుకోవచ్చు.

ఈలోపుగా నీకున్నూ, నాకుంకూడా విశ్రాంతి" అని ఆమెకు కాగి తము అందించినాడు. ఆమె వారంటుచదివి వెంటనే బయటకు వచ్చినది; ఆయనకూడా వచ్చినాడు

ఇంతలో పెద్దకుమారుడు, బాలచంద్రుడు, రవుడీ కుక్క పరుగున వచ్చి, తలిదండ్రుల ప్రక్క జాగ్రత్తగా వినాలకో నిలుచున్నారు. రవుడీమాత్రము చాలరోజులక్రింద పామూలు పెద్దమనిషిలాగు వచ్చి వెళ్లిన ఇన్స్పెక్టరును ఆనవాలుపట్టి "భొంయి భొంయి" మని మొరగినది. బాలచంద్రుడు దానిని ఆపుచేయుచున్నాడు.

ఇన్స్పెక్టరు భయముతో "అమ్మా, ఇది మావిధి. పోలీసు ఉద్యోగంలో చేయకూడని పని అంటూలేదు. తమవంటివారికి కూడా వారంటు తీసుకురావలసిన దురవస్థ నాకు పట్టింది. తమరిద్దరూ మొన్న పొన్నూరులో రాజద్రోహకరమైన ఉప న్యాసాలు ఇచ్చినందుకు ఫలితంగా మాదొరవారిచే జారీ చేయ బడింది ఈ కాగితం."

ఆమె "అయ్యా, మే మెప్పుడూ అందుకు సిద్ధంగానే వున్నాము. ఇందులో తమరు చేసిన తప్పేముంది!"

ఇన్స్పెక్టరు "అమ్మా, తమరు తీరికిగా బయులుదేరవచ్చును. తొందర యేమీ లేదు."

ఆమె "అయ్యా, మేము సరుదుకునేది యేముంది, (పెద్ద కుమారునితో) నాయనా, తమ్ముణ్ణి జాగ్రత్త, పాపను నా వెంట తీసుకువెళ్లుతాను. ఆ తర్వాత చేయవలసిన అజ్మాయిషీ అంతా నీకు తెలిసిందే. (ఇంతలో అక్కడ గుమిగూడిన పని

వాళ్లను చూచి, దిగాలుపడివున్న మేస్త్రీ(స్త్రీ) అన్నాడు, ఏమీ విచారించకు. మనము ప్రతిరోజూ చూడడములేదా, ఒక గింజను పాతిపెడుతున్నాముగా అంటే ఎందుకూ, అందులోనుండి ఫలపుష్పాలు మనము అనుభవించాలి అంటే, ఆగింజ భూమిలో కొంతకాలము ఉండాలి, తనరూపే మారిపోయి, అంతేకాగు ఆ గింజ తాను నశించిపోయి, తనలో నుండి మొక్క, మొక్క నుండి పువ్వులు, పండ్లు యిస్తూంది. ఆ గింజ నశించితే కాని దానివల్ల మనకు ఫలం దక్కడములేదు మా జీవితాలు కూడా అంతే. సర్వమూ త్యజించడానికి —"

అక్కడున్న వారందరికి కనులనుండి కన్నీటిబిందువులు రాలినవి పోలీసుఉద్యోగము చేసి గుండె రాయిచేసికొనిన యిన్స్పెక్టరుకూడా ఒకటిరెండు కన్నీటి బిందువులు విడిచినాడు

ఆయన, ఆమె చంటిపిల్లను తీసికొని బయలుదేరినారు, పోలీసువారు వెంట. అడుపాజ్ఞలలో పెరిగిన పిల్లలిద్దరు, పని వాళ్లు అటులనే ఉండిపోయినారు. చీకటిముసుగు ఆవరించు చున్న దొంక ప్రక్కనుండి.

తమ్ముని ప్రక్కన కూరుచుండ జేసి, పెద్దకుమారుడు రెండు చేతులు జోడించి:

"కనికర మెదలో కరగి పారగా,
అనదల కష్టములన్నియు దీర్చెడి
దిన మది సుదినము కాదా, ప్రభూ!"

అని పరమపితను గూర్చి గానము చేయ మొదలిడినాడు.

వలపు కాన్క

అతడు చామనచాయ మనిషి, వయస్సు ఇరవై అయిదు. ముఖము నిర్మలము, కోమలము, గంభీరము. భావసంపద, భావ స్థిరత్వము ఆ కళ్ళ వెలుగులో మెరుస్తూఉంటవి. చిన్ని గుండ్రని గడ్డము గాంభీర్యము కోమలత్వము కలిసి పులకరించే ఏదో భావాన్ని తెలుపుతూ ఉంటుంది. విశాలమైన నెన్నుదురు, అప్పటప్పట అచట వాటంతట అవే వచ్చే ముడతలు సాధన గల ఆత్మను స్ఫురింపజేస్తుంటవి. అంత బలిష్ఠమైన శరీరం కాదు, ఒక మోస్తరు.

ఆమె కూడా చామనచాయ. వయస్సు ఇరవయి. చక్కని ముఖము. స్త్రీకి సహజంగా ఉండే సుకుమారత బాగా ఉంది. ఏదో అర్థముకాని తేజస్సు ప్రకాశిస్తుంటుంది. కళ్ళల్లో నుంచి బయల్వెడలే సిగ్గుదొంతరలు ఆ తేజస్సును అప్పుడప్పుడు కప్పి వేస్తూ ఉంటవి. అప్పుడప్పుడే కాదు తరుచు చిరునవ్వునవ్వుతూనె తెరలు తెరలుగా వచ్చే సిగ్గుకెరటాలలో తేలిఆడుతూఉంటుంది. పెదవులు గభీరత నెంతమాత్రము తలపుకు తేక సుకోమల త్వాన్నే స్ఫురణకు తెస్తవి. నుదురంత విశాలమైనది కాదు. ఆమె ప్రతివిషయము మామూలుగ్గానే చూస్తుంది. భావములే కాదు హృదయంకూడ అంతలోతు గలగి కాదు. ఇన్ని వివరించేకంటే ఆమె సాధారణంగా వర్తించే ఒకానొక విద్యార్థిని అంటే! — పలుచని శరీరం. అంతపొడగరి కాదు. భూషణములా —నవ్వు

చూసే ఆమె క్రిందటిసారి వచ్చిన రాజకీయపు ఉప్పెనలో వదలి పెట్టివేసింది ఉన్నవన్నీను. అందరూ ఆశిస్తున్నారు నేనెందుకు ఇయ్యకూడదని కాదు, అప్పట్లో ఆమె మనస్సు కరిగింది. కాని తర్వాత ఎప్పటి చిరునగవుతో —

౨

అది శ్రావణమాసము. సాయంకాలము అతను పొంగి పొంగి వస్తూవున్న గోదావరి చూస్తూ నడుచుచున్నాడు గట్టుమీద. వ్రేలుఆనవాలు పెట్టుకొనివున్న గ్రంధము చేతిలో వుంది. మనస్సు పుస్తకంమీద వున్నప్పటికీ కనులపండువుగా గట్టు రాసుకొని ప్రవహిస్తూవున్న గోదావరి, అందులో కొట్టుకొని వచ్చే పుల్ల పుడక, పెద్దపెద్ద చెట్లు ఇవన్నీ అతను ఎంతో కోరికతో చూస్తున్నాడు.

ప్రక్కనుంచి నలుగురుపిల్లలు వెళ్ళారు. అందులో ఆమె ఉంది. అతన్ని ఆమెచూచిందో లేదో కాని అతడుమాత్రము ఆమెను చూచాడు. అంత, తర్వాత మనస్సు కొంచెము సేపు గోదావరి మీదికి, చేతిలోని పుస్తకంమీదికి పరుగెత్తింది. వెంటనే అప్పటి నిండుగోదావరి, జీవితానికి జీవితపరమావధికి అనుబంధమైన ఏదో భావాన్ని స్ఫురింపజేయగా అతడు దాన్ని మననముచేయ మొదలు పెట్టాడు. అంతటితో ఆమెవూసే మరిచిపోయాడు

మిత్రులు రాగానే కొంతసేపు గట్టుపైన కూర్చుండి ఈ కబురు ఆ కబురు మాటాడుకొని బయలుదేరడానికి లేచాడు.

గోదావరి మీదుగా పడమటిదిశ ఆకాశంలో నెలవంక కనిపించింది. వెంటనే ఈ మహానది ఎంతమంది ప్రేయసీ ప్రేయసులను చూచిఉంటుందో అనుకున్నాడు. మరు నిముసాన్నే యిందాక ఆ గుంపులో వెళ్లిన ఆమె స్మృతికి తోచింది ఏమో అనుకొన్నాడు నిర్లక్ష్యంగా.

అతడు చిన్ననాటినుంచి ఆలోచనగలమనిషి. ప్రతిచిన్నవిషయాన్ని గురించికూడా లోతుగా ఆలోచించే స్వభావము. కోమలమైన, నిశితమైన అతనిబుద్ధికి హిందూసంఘములోఉన్న కులభేదాలు, మూఢాచారాలు, వెర్రినమ్మకాలు, భావదాస్యం, సొంతంగా ఆలోచించేబుద్ధి లేకపోవడము, అజ్ఞానం, ఎంతో బాధ, దుఃఖము కలిగిస్తూఉంటవి. ఇటువంటి పెద్దపెద్ద సంగతులు అతనిహృదయాన్ని కలచివేస్తూఉండేవి. వీటిగురించి గ్రంథములు తరచడమేకాదు, అతను సొంతంగా ఎంతో ఆలోచించాడు. ఇట్లుండగా రెండోసారి రాచకీయపుతుపాను రెట్టింపు బలంతో వచ్చింది. ఇందులో తాను కొట్టుకుపోతానేమో అనుకున్నాడు. అందుకు కొంచెము జడిశాడనికూడా చెప్పవచ్చు. ఈ నడుమ దాన్ని గురించి అతను ఎంతో దీర్ఘంగా లోతుగా తన్ను తానే అడుగుకుంటున్నాడు : "సంఘం యిటువంటి దుర్దశలో కుళ్ళుతో జీవితం గడుపుతుంటే రాచకీయపుస్వాతంత్రము ఎంతవరకు అవసరం? ఒకవేళ దేశానికి స్వరాజ్యంవస్తే వ్యక్తిగతంగా ప్రయోజనం ఏమిటి? ప్రత్యేకవ్యక్తికి మానసికంగా ఎంతవఱకు ముక్తిఉంది?" ఈ ఆలోచనలు ఎన్నాళ్ళనుంచో,

ఈ రోజున కూడా, అతని హృదయాన్ని మేధస్సును పరి పాలిస్తున్నవి.

వీటిగూర్చి చింతిస్తూనే అతడు ప్రక్కపై పరుండి ఉన్నాడు. ప్రక్కనే ముడిచివేసిన పుస్తకము ఉంది. మరల ఆమె అప్పు డప్పుడు స్ఫురణకువచ్చుచుండుట అతడు గమనించాడు : "పాప చెపుము !—" అనుకొన్నాడు.

కొంతసేపటికి కిటికీలోనుంచి బాలచంద్రుడు కనిపించాడు. చుట్టూ ఎన్నోనక్షత్రాలు మెరిసిపోతూన్నవి. అతనికి చుక్క లంటే ఎంతో యిష్టము. నెలవంకకూడా యిష్టమే కాని చుక్కల్లో అతని కేదో తియ్యని సంగీతము, మెరుపులు కని పిస్తూ ఉంటవట. కాని నేడు నెలవంక అతనిదృష్టిని ఎక్కువగా ఆకర్షించింది. రెప్పవేయక, ఊర్పునాపి రవంతసేపు చూచాడు: "పురుషుని జీవనాకాశంలో ప్రేయసికూడ అల్లాగే కామాను" అనుకొన్నాడు. వెంటనే ఒక మబ్బుతునక నెలవంకను కొంచెము కప్పివేసింది. అతని హృదయవీణను ఎదో కనిపించని చేయి మీటినట్లయింది : "దేహంలో కలిగే మార్పులవల్ల నేమో" అనుకొన్నాడు.

" ముత్యాలను గీటురాయిమీద విలువ కడితే యేమి తెలుస్తుంది" అని సమాధానం చెప్పుకొన్నాడు తనలోతానే. ఈసారి ఆమె స్మృతికి రాలేదు

స్త్రీలో లేని గుణాలు యువకులు కల్పించుకుంటారనీ, లేని పోని సౌందర్యం ఊహించుకుంటా రనీ, తెలివితక్కువతనం

వల్ల ఆమె చీరముడుతలలో, శిరోజములలో, అడుగులలో, కదిలే వ్రేళ్ళలో ఏమేమో వింతవింత కళలు తెచ్చిపెడతారనీ, ఆమె మాటలలో, కంఠంలో, గమనంలో వెఱ్ఱిమాధుర్యము ఊహాచేస్తారనీ, పురుషుడెంతో స్త్రీకూడా అంతేకాని అంత కంటె ఎక్కువకాని, తక్కువకాని స్త్రీలో లేదనీ, ఒక స్త్రీ యింకొక స్త్రీ యెడల ఎటువంటి నిష్కామమైన దృష్టితో ఉంటుందో అటులే యువకులు కూడా స్త్రీయెడ వర్తించవలె ననీ, అదికూడా సంఘోద్ధరణకు యితరవిషయములతో పాటు సమానమైన అవసరం గల సంగతనీ తోడియువకులతో అనేక సార్లు అతడు చెప్పాడు. అతడు స్త్రీయెడ అటువంటి నిష్కామమైన దృష్టితోనే ప్రవర్తించుతాడని అందరు అను కుంటారు. అంతేకాదు స్త్రీలను చూచి యువకులు ముగ్ధులై తెలివితక్కువవారై పోవుచున్నారని అతడు అప్పుడప్పుడు స్త్రీజాతిని నిందించడముకూడా కలదు.

కొన్ని నెలలు గడచిపోయినవి. ఆమె అతనికి ఒకటి రెండు సారులు మాత్రమే కనిపించింది. అప్పు డాతని హృదయం అతనికి తెలియకుండానే కొంచెము వణికింది. నరములుకూడా వణికినట్లయినవి. ముఖము తెల్లబారింది. చూపులు ఆమెమీదికి ఇటు అటు పరుగెత్తినవి. ఎందుకో అతనికి తెలియలేదు. ఆపుచేసుకోవలెనని ప్రయత్నించాడు. అతి ప్రయత్నముమీద లోబరచుకున్నాడు హృదయాన్ని, కళ్ళను.

ఆమెమాత్రము అతనివైపు చిరునగవుతోనే ఒకటి రెండు సార్లు చూచింది. చిరునగవుతోనే తలవంచుకొనేది. ఒక్కొక్క చూనే సిగ్గుతో కళ్ళు మూసుకొనేది ఇదంతా ఒక్క నిమిషములోనే.

ఒకరోజున టవునుహాలులో టీపార్టీ అయింది. స్త్రీలు పురుషులుకూడా వచ్చారు. అతనూను వచ్చాడు ఆమెగూడా చెలులతో వచ్చింది.

కొంచెము సేపటికి జనసమ్మర్దము ఎక్కువైపోయింది. వడ్డన సరిగా జరగడములేదు. అంతవఱకు పైపై అజమాయిషీ చేస్తూ ఉన్న అతడు వడ్డన కందుకొన్నాడు. స్త్రీలదగ్గరకు ఫలహారాలు ఒక్కటీ సరిగా వెళ్ళడములేదు. అతనికి అడ్డు ఏమి౦ది! అంతేకాదు నియమములు, స్థిరమైన భావములు, సాధన ఉన్న సంస్కారి ఆమె అక్కడ ఉండడము అతడు చూచినాడో లేదో కాళ్ళు రవంత తడబడినవి, చొరవచేసుకొని వెళ్ళాడు. వడ్డిస్తూవున్నాడు. ఆమెకు దగ్గరగా వచ్చాడు ఆమెకుకూడా వడ్డించాడు ఫలహారాలు. ఆమె చిరునగవుతోనే అందుకొన్నది. మధ్య మధ్య ఆమెను సిగ్గుదొంతరులు మాత్రము కప్పివేస్తూ ఉండేవి అయినా ధైర్యంగా ఆమె రెండవసారి టీ అడిగింది. అతడే తీసుకొనివచ్చి మాటాడకుండా యిచ్చి వెళ్లిపోయాడు. ఈసారి అతడు ఆమెను జాగ్రత్తగా చూచాడు. ఇంతకు పూర్వము అతడామెను ఈరీతిగా దృష్టి సారించి చూడనైనా చూచి ఉండలేదు.

అత డెరుగును; ఆమె వ్రేలెత్తి చూపదగిన సౌందర్యవతి కాదని. ఆమె సర్వావయవములు మామూలుగానే ఉన్నవి కాని అందేమియు ప్రత్యేకతకూడాలేదని. అయినను అతని నామె ఏలనో ఆకర్షించింది. ఎందుకో ఎట్లో అతనికే తెలియదు. అతడు దృఢచిత్తము కలవాడు. నియమములు, కొంతవరకు స్త్రీజాతిఅంటే అయిష్టము ఉన్నవాడు. అవన్నియు మెల్లమెల్లగా సమ్మోహనమునకు చోటిచ్చినవి. ఆమె రూపవతికాదు. అయితేనేమి ఆమెలో ఏదో అతడే యెరుగడు అతనిని ఆకర్షించింది! ఇంతవరకు ఒక్క సౌందర్యమే ఆకర్షిస్తుందని తలంచే అతనికి ఇదొక క్రొత్త అనుభవము. ఈ అనుభవములో మాధుర్యము అతడు అపేక్షతో చూరగొన్నాడు. కాని తన్ను తాను ప్రశ్నించుకొనేవాడు: "ఎందుకు!... ... జీవిత పరమావధిమాట... .. !" అని. "స్త్రీ కూడా ఒక జంతువే. స్త్రీకి తెలివి తేటలుకూడా ఎక్కువలేవు. సౌందర్యము కూడా ఎక్కువకాదు. పురుషుడే స్త్రీ కంటే ఎక్కువ అందమైనవాడేమో కూడాను ....గ్రీకు శిల్పులు తమకళలో... మరి నన్ను ఆమె దేనితో ఆకర్షిస్తూఉంది...! అదే అర్థము కావడములేదు. అర్థమయ్యేదేముంది! పదిరోజులు తప్పించుకు తిరిగితే ఈపిచ్చిభావాలు, అపేక్ష వాసంతటవే మాయమవుతవి" అనుకొన్నాడు.

పచ్చికబయళ్లు తాత్కాలికంగా ఎండిపోయినట్లు కనిపించినా తొలకరించగానే నవజీవంతో మెరుస్తవి అనే విషయము అతను

మరచిపోయాడు. మరచిపోవడముకాదు తన హృదయం రాణి నేలవంటి దనుకొన్నాడు. స్త్రీలయెడ తాను నిష్కామంగా స్త్రీనవలె ప్రవర్తించవలెనని దృఢచిత్తం చేసుకొన్నాడు. అంతే కాదు స్త్రీ మనోహరత్వానికి లోబడిపోవడము పురుషుని హృదయదౌర్బల్యము తెలియపరుస్తుందని అతని నమ్మకం. అంతటితో ఆగలేదు, పాపముకూడా నేమో అని అనుకుంటూ ఉంటాడు.

౪

మూడునెలలు గడచినవి. ఆమె కాతడు ఒక్కసారి కనిపించలేదు. బుద్ధిపూర్వకంగానే తప్పించుకు తిరిగేవాడు. ఆమెను మరిచిపోవలెనని ప్రయత్నించాడు. మరిచిపోవడము అంత కష్టమైనపని కాదనుకొన్నాడు. మరిచిపోయాననుకొని తృప్తిపడ్డాడు. మరిచిపోయినందువల్ల బాధ లేదనుకొన్నాడు. పూర్తిగా మరిచిపోయానో లేదో అని పరీక్షచేసుకోవడములోనే ఆమెస్మృతి యింకా తనలో ఉందనుకొన్నాడు. ఏమైనా ఆమె నీడజాడలు అతని హృదయవీధిలో గోచరిస్తూనే ఉండేవి.

అది సాయంసమయము. మబ్బులు పట్టి చల్లగాఉంది. అతడు టేబిలుముందర కూర్చుండి తీవ్రంగా చదువుకుంటున్నాడు. మనస్సు ఉత్సాహంగ, చురుకుగా పనిచేస్తూ ఉంది. పెద్ద పెద్ద భావాలు కెరటాలులాగావచ్చి పరుగెత్తుకుపోతున్నవి. ఈ విశ్వమంతా అప్పుడతనికి లేనట్లే.

గచ్చకాయరంగు చీర కట్టుకొని, సరిగంచు జాకెట్టు ధరించి, తలలో పారిజాతపు పూలగుత్తులు పెట్టుకొని సిగ్గుతో తలఆడించు కుంటూ చిఱునవ్వుతోనే ఆమె వచ్చింది. ఆమెను సరిగా చూచినాడో లేదో ఒకమెరపు మెరసినట్లయింది. ఆ మెరపు దెబ్బకు హృదయము, మనస్సు, మేధస్సు ఒక్కసారిగా క్రుంగి మఱుక్షణాన్నె నవజీవంతో లేచినవి. మెల్లగా అడుగులు వేసుకొంటూ శిరస్సు వంచుకునే తడబడుచు ఆమె చెట్లనీడల లోకి వెళ్లుతూ వుంది. అతడు మరల తలయెత్తి చూచాడు. ఒత్తుగా మెరసిపోతూవున్న పెద్దజడ కనిపిస్తూవుంది. తన హృదయం ఆమె అడుగుల ననుసరించి శబ్దించుట అతడు కని పెట్టాడు. తన మనస్సు నామె బలంగా లాగుకొనిపోవడము గ్రహించాడు. తాను అంతలోనే మానసికంగా నీరసం అయి పోవడము తెలుసుకొన్నాడు.

కోపంతో ఇకెన్నడు ఇటువంటిపని జరుగకూడదు. ఒకపేరు వూరు లేని యువతి నన్ను లోబరుచుకోవడమేమి టనుకొ న్నాడు. ఆమెలో వున్న గొప్పతన మేమి టని ప్రశ్నించు కొన్నాడు. ఇంత తెలివితక్కువగా ఆమెముందు కూలబడిపోవడ మేమి టనుకొన్నాడు. ఆమెకు నాకు ఏవిధమైన అనుబంధం అనుకొన్నాడు. ఇక ఈసారి యిట్టి పతనమునకు అవకాశ మివ్వకూడ దనుకొని నిశ్చయం చేసుకొన్నాడు. ఇదంతా ఒక్క అరనిమిషములో.

పుస్తక మక్కడనుంచి లేచివచ్చి కిటికీ ప్రక్కనున్న కుర్చీలో కూలబడ్డాడు. ఆ తీవ్రత తగ్గిపోయింది. మునుపున్న స్పృహ తొందరలోనే వచ్చింది. శాంతంగా ఆలోచించ మొదలు పెట్టాడు. జీవితంలో స్త్రీకి పురుషునికి వున్న సంబంధ మేమిటి, ఎంతవరకుండాలి, ఎప్పుడేరీతిగా వుండాలి, స్త్రీ పురుషులకు అసలు పరస్పర సాహాయ్య మెంతవరకవసరముంది, ప్రేమ నాధారంగా చేసికొని స్త్రీ, పురుషుడు ఏల నివసించరాదు. వివాహం అసలు అవసరమా లేదా, వివాహంలేని పరస్పర ప్రేమకు, నిజమైన ప్రేమలేని వివాహానికి తారతమ్యమేమిటి...... (మనసు తీవ్రత మెల్లగా బిగినడలింది) నాహృదయంలో ఎందుచేతనో ఈమెమీద అపేక్షకలిగింది, ఇది ఎంతవరకు ప్రకృతిసిద్ధమయింది...... ఒక స్త్రీని ప్రేమించుట ఆమెకు లోబడిపోవడ మెల్లాఅవుతుంది......ఒక రమణిలో వున్న దేదో కనిపించని మనోహరగుణము ఆకర్షించితే అందుకు అవకాశమివ్వడము, కనిపించని సౌందర్యాని ఆరాధించడము పాపమెల్లా అవుతుంది......ఆమెను నేను కోరడమో లేక ఆమెకు నన్ను అర్పించుకోవడమో, కాదు ఈరెండూకలిసి ఏదో చెప్పజాలని దవుతుంది. అటువంటి ప్రణయ జీవనం గడపడములో దోషముంటుందా ...... ఇన్ని ఆలోచించడమేకాని ఆమె దృష్టి నాయెడల ఎట్లుందో ఊహించనైనా ఊహించకుండా, తెలుసుకోవడానికైనా ప్రయత్నించకుండా ...... " అంతలో ఆమె తిరిగివచ్చింది. ఆమె చిరునవ్వు నవ్వుతునే ప్రకాశిస్తూ

వున్న ముఖంతో అతనివంక కిటికీగుండా చూస్తూవుంది ఇది వరకు పైలె అప్పుడాతనిలో ఏ స్ఫూర్తి తరంగము లెగయలేదు. ఆ ఆలోచనాచింతనముంగా మునిగిపోయివున్న అతనివదనం అప్పుడు భావసంపద స్ఫురింపజేస్తూవుంది. అందు చిఱునవ్వు తునక అయినా లేదు. అతడామెను కొలదిపాటి గంభీరమైన ముఖము తోనే చూచాడు. వారి యిరువురి చూపులు సంపూర్ణముగా మిళితము కావడము ఇదే తొలిసారి. ఒకరిచూపు చిఱునవ్వు వెన్నెలలు ప్రసరింపజేస్తూవుంది ఇంకొకరిచూపులో భావముల వెలుగుమాత్రమే మెరుస్తూవుంది. పాపము, ఆమె అతడు తన వంక తీవ్రంగా చూస్తూన్నాడేమో అని సంశయించింది. వెరపుతో తలవంచుకొంది. నడుస్తూనే మురల చిఱునవ్వుతో అతనిని చూచింది. ఈసారి అతడుచిఱునవ్వు నవ్వ ప్రయత్నించాడు. లోతుగల అతని భావాలు అప్పుడు చిరునవ్వుగా చోటివ్వలేదు. ఏనాటినుండో ప్రసవించే భావాలప్పుడతని వదనముమీద తాండవమాడినవి. ఆమె గ్రహించింది. ఆమెచిఱునవ్వు చూపుల తోనే అతని కొరకు పూజాపుష్పము సమర్పించింది. అతడా పూజాపుష్పాన్ని ప్రేమతో, కోరికతో అందుకొన్నాడు.

ఆమె పుష్పాంజలులు వేసింది. పూలచెట్లలోనుంచివచ్చిన [illegible] తమ [illegible] తెలిపిన ప్రక్క గుబురుగా [illegible] జోగవచ్చి [illegible] ని [illegible] కూడా [illegible] సంతో షము వెలిబుచ్చినవి. ఒక [illegible] చినుకులతో, తన కుంకుమపు [illegible] సూర్యుడు ఆశీర్వదించాడు.

"నా భవిష్యత్తు అనంతమైన శూన్యాకాశం. అందులో నెలవంక ఎప్పుడుదయిస్తుందో" అనుకొన్నాడతడు.

ఆమె "నిజముగా చెప్పండి, మరల పెళ్లిచేసుకోరుకదూ?" అనెను.

రామేశ్వరుడు దీనవదనముతో "లక్ష్మీ! నీమాటలు నేను వినజాలను. ఈరోజున ఏమిటి నీవు నాహృదయమును దహింప జేస్తున్నావు" అనెను.

ఇరువురును నూతన యౌవనులు. రామేశ్వరుడు ఇరువది నాలుగు వత్సరముల ప్రాయమువాడు, లక్ష్మి పదునెనిమిది వర్షముల యువతీమణి. ఒకదినమున అపరాహ్ణసమయమున ఈ సతీపతులిరువురు చతురంగము ఆడుకొనుచుండిరి. ఆటనడుమ లక్ష్మి సంభాషణమును మార్చి పై విధముగ దీసికొని వచ్చినది. సహజకోమల హృదయుడు — రామేశ్వరుడు ప్రియతమ, మిత భాషిణి యగు లక్ష్మి ఇట్లు మాటాడుటగని ఆశ్చర్యపడుటయే గాక అంతరంగమున చాలబాధ ననుభవించుచుండెను.

లక్ష్మి లేనినవ్వు తెచ్చుకొని మిగుల మధురము, మిగుల కఠినముగాని కంఠస్వరమున "మీ మనసుకు బాధ కలిగించవలెనని నామతము కాదు. మీ రేమనుకొనినాసరే. ఈ ఒక్కవిషయంలో నాకు స్వేచ్ఛప్రసాదించి నిక్కముగా జవాబు చెప్పండి. ఇక నే నేమీ మాటాడను" అని పతివైపు పిచ్చిదానివలె జూచుచుండెను. ఆ చూపులో భావమేమియు లేదు. అర్థమంతకన్న లేదు.

రామేశ్వరున కెన్నడు లక్ష్మిపై కోపము రాలేదు. అప్పుడప్పుడు రామేశ్వరుడు భార్యను కోపించుచుండునని లోకులనుకొనెదరుగాని ఆమాటలో గొంచెమైనను సత్యము లేకపోలేదు. ఇదివరకు వచ్చినది కృత్రిమకోపము. వివాహమై ఆరువత్సరములు గడచినవి. లక్ష్మిపై నిజమైనకోపము ఈ రోజునమాత్రమే వచ్చినది. రామేశ్వరుడు చటాలున దగ్గరనున్న తిలకుగారి 'కర్మయోగశాస్త్రము' దీసి శిరసున బెట్టుకొని కోపముతో "లక్ష్మీ! ఇదే నేను ప్రతిజ్ఞచేస్తున్నాను. నా లక్ష్మి జీవించియున్నను లేకపోయినను నేను పరస్త్రీముఖము కలయందైన జూడను. (కొంచెము నే పూరకుండి) ఇకనైనా నన్ను వదలవా?" అని చతురంగపుటలు సాగించెను.

పతివ్రతాశిరోమణి యగు లక్ష్మి తలవంచుకొనినది. ఒకటి రెండు అశ్రుబిందువులు కనుకొలంకులనుండి జారినవి. భర్త ఆ విషయము గాంచలేదని యామె ముద్దరాలనుకొనెను; గాని రామేశ్వరుడు చూడకపోలేదు. ఆతని నవనీత కోమలహృదయము విదారితమైపోవుచుండెను. జోస్యము చెప్పగలవారైనను ఆ రంగము గాంచి రామేశ్వరునిది "అసలైన ప్రేమ" అని యనకుండజాలరు.

౨

పదునొకండు మాసములు గడచినవి. లక్ష్మి మార్గశిర బహుళ ఏకాదశినాడు అర్ధరాత్రమున ఆడశిశువును ప్రసవించినది. కాలగర్భమున లీనమగుచున్నవారందఱు నేల అట్లగుచుండిరో ఎవరు సిద్ధాంతీకరించి చెప్పగలరు? బహుళద్వాదశి నాయం

సమయము. అంధకారము మెల్ల మెల్లగ ఆవరించుచున్నది. అనంతనీలాకాశము, పక్షులు, వృక్షములు, మందమారుతము సర్వముకూడ దుఃఖించుచున్న భంగి తోచుచున్నవి. లక్ష్మి — ప్రాణవాయువు ఈ పాంచభౌతిక దేహమును విడిచిపెట్టి పోయినది. పూర్ణ గ్రామమున— ఆ దుఃఖమయ భవనమున ఎల్లరు దుఃఖితహృదయులై యుండిరి. ఒక పెద్దను సాగ్రహంగా నిగ్రహంగా నేర్పుచున్నారు. ఎంతపవిత్రమైన నేమి [illegible] ! [illegible] వంటి శరీరమును విడిచి [illegible] యినది. ఒక విరాగి ఆ త్రోవను పోవుచు "ఎందుకు దుఃఖపడుతారు?" అనుకొనెను.

3

పరమేశ్వరుడు "లక్ష్మి అను ఈఆత్మ నరకలోకానికిపోవలెను"

లక్ష్మి—ఆత్మ "ప్రభూ! నరకలోకానికి నాకేమీ పోవడానికి అభ్యంతరములేదు. [illegible] నాభర్త, నేనూ చాలా అన్యోన్యంగా వుండేవాళ్ళము. నేను మానవశరీరములో వున్నప్పుడు ఆయనను విడిచి ఎప్పుడూ వుండలేదు. వివాహమైన తరువాత ఆయనను విడిచి పుట్టింటికికూడా వెళ్ళలేదు. ఆయనకూడా [illegible] శయ్యను వుండేవారు. మీ ఆజ్ఞ అయినందున విడువలేక [illegible] లేక నాప్రాణేశ్వరుని విడిచివచ్చాను. ఏం చెయ్యను; విడిచి రావలసివచ్చింది. ఒక్కసారి నేనాయన్ను దర్శించుకు రావడానికి—ఓదార్చడానికి సెలవు దయచేయించండి ప్రభూ! ఆయన

నా కోసము ఎంతదుఃఖిస్తూవుంటారో నేనేమి మనవిచేయగలను! ఒకనిముసమైనా విడువకుండా వుండే నాహృదయేశ్వరుని అపార దుఃఖసముద్రములో – నిబిడాంధకారబంధురముగా విడిచి వచ్చేశాను. పన్ను విడిచి—ప్రియతమమైన ఈ దాసినివిడచి నాప్రియతముడు ఎల్లావున్నాడో భావించుటకు కూడా నేను సహించలేకుండా వున్నాను. నేను ఖాళ్ళల్లో పెట్టి పూజించే దాన్ని. అంత కోమలంగా వుండే ఆ సుకుమారమూర్తిని "నా కోసం దుఃఖించవద్దు. జరగవలసినట్టు జరుగుతుంది' అని ఓదార్చి కన్నీరు తుడిచివస్తాను. సర్వము తెలిసిన ప్రభువగు నీకు నేనేమి చెప్పగలను. దేవా! సెలవు దయచేయించండి!" అని వినయవినమితయై చెప్పుకొనెను.

స్వర్గుడు "వెళ్ళిరమ్ము."

ఆత్మ పరలోకమును విడిచి భూలోకమును ప్రవేశించెను; భర్తృగృహాభిముఖియై వెళ్ళుచున్నది. ఇంతలో నొకయూరు నందు రామేశ్వరుని కంఠస్వరము వినిపించెను. ఆ యాత్మ త్వరితముగా ఆ మందిరమును ప్రవేశించి, రామేశ్వరుడు నవనవోన్మేషయగు నొకరమణీమణిచెంత కూర్చుండి ప్రణయసల్లాపము లాడుచుండుట గాంచెను. "ఏమీ! ఈమెయెవతె? (కొంచెమాలోచించి) ఔరా అప్పుడే ద్వితీయవివాహమా!— మోసము, మోసము, ఇంతకన్న మోసమున్నదా, ఏ లోకములోనైనా?

ఇచట కూర్చున్నది నా ప్రాణేశ్వరుడేనా! ఇటులు జరుగుతుందా? ఆ ప్రేమ, ఆ ఆదరము, ఆ అభిమానము ఎక్కడికి

పోయినవి. ఎంతో దుఃఖిస్తూ వుంటాడనుకొన్న భర్త ఆనందమున వోలలాడుటయా?—నేను నమ్మజాలను.

ఏమీ! ఆనాడు భగవద్గీత నెత్తిపై బెట్టుకొని ప్రమాణం కూడ చేసెనే? ప్రమాణములతో లెఖ్ఖయేమి. అంత ప్రేమతో వుండే భర్త ఇంకేలోకములోనూ వుండడు అనుకున్న నా భర్తయేనా ఇట్లయిపోవుట. అయ్యో దేవా! నీవెంత విచిత్రుడవు! నా భర్త లోపమేమియు లేదు. నీదే లోపము —

అయ్యయ్యో! పరమాత్ముని తూలనాడుచున్నాను! 'సర్వము నీవే. నీవు లేకపోతే ఏమీలేదు' అనుచుండే నా భర్త ననవలెను కాని. నన్ను శాశ్వతధర్మపత్నిగా స్వీకరించినట్లు అగ్నిసాక్షిగా ప్రతినకూడా చేసెనే! 'నిజమైనప్రేమ నా భర్తది. ఇతరుల దందరిది బూటకపుప్రేమ' అనుకొన్న నేను 'అది ప్రేమకాదు కామము' అని అనుకొనవలసి వచ్చిందా ప్రభూ! దేహాన్ని మాత్రమే కామించే భర్త నిజమైనభర్త యెట్లగును!—

ఈతడెదైవము వేరే దైవములే డనుకొనేదాన్ని. ఒకసారి ఒకనెచ్చెలి భర్తను దైవముగాగు చూడాలి, కాని భర్త దైవము కాజాలడు అని చెప్పింది. ఆ మెమాట లెఖ్ఖచెయ్యలేదు. ఈతనికంటె ప్రేమింపదగినది ప్రపంచంలో ఇంకేమీలేదు. ఈ యనే నేను; నేనే ఈయన అనుకొని ప్రేమించినందుకా ఇట్లు మోసగించుట. అయ్యో ప్రభూ! నిన్ను గ్రహించుట ఎట్లాగు?

ఇక ఆ చంటిపాపగతి ఏమవుతుందో. ఇంత చిత్తచాంచల్యముగల మానవులను ఎట్లు నమ్మగలను? 'పురుషులను

నమ్మకూడ' దని దేవుడు వ్రాసిపెట్టి వుంచాడు కాబోలు. ఆ సంగతి ఇదివరకు తెలియలేదు. పురుషులిలాంటివాళ్ళని తెలుసుకోలేకపోయాను. ఇంకా యెందుకిక్కడ? ఇకపోతాను." అనకొని పరలోకమునకు ప్రయాణమయ్యెను.

౪

లక్ష్మి పరమేశ్వరుని దివ్యసన్నిధికి జని "దేవా! నన్నిక నరకలోకానికి పంపండి" అనెను. పరమేశ్వరుడు "నీ విక నరకలోకానికి వెళ్లవలసిన ఆవశ్యకతలేదు. నీవు ఇట్టిపతిని దైవముగా భావించినావు. దైవమొకడున్న సంగతి మరచి అతను దైవమనుకున్నావు. భర్తను భార్య దైవమువలెయెంచి గౌరవించవచ్చును; కాని ఆతడే దైవమని తలంపకూడదు. ఇవుడు నీవు పడిన పశ్చాత్తాపమువలన నీ దోషముపోయినది. పతి చిత్తచాంచల్యము — విషయలోలత్వము చూచి నీవుపొందిన దుఃఖము మిగిలిన పాపపంకిలమును తుడిచివైచింది. ఇక నీవు పవిత్రమైనదానవు. స్వర్గానికి వెళ్ళి ఆనందమున నుండుము. సత్యమైన ప్రేమామృతము నీ విచటమాత్రమే అనుభవించగలవు. ఇంకెక్కడా నీకా ప్రేమామృతము లభింపజాలదు. పోయి శాంతినిలయము, ఆనందనిలయము, ప్రేమనిలయము అయిన స్వర్గధామంలో వుండు." అని ఆశీర్వదించెను.

లక్ష్మి ఇప్పుడు ప్రశాంతినికేతనమగు ప్రేమానందనిలయమున సంకల్పరహితయై యున్నది.

దిక్కులేని పక్షి

ఒక దుర్లభాశావిదీర్ణహృదయము — నవనవలాడుచున్న లేత కాపుపడుచు, ముందఱనున్న [illegible] వేసి, ఉదయించుచున్న కుంకుమవర్ణపు సూర్యునికేసి జాలిగొలుపు [illegible] జూచుచు [illegible] నిలువబడియున్నది. ఆకసము మేఘశూన్యమై విమలమై ప్రశాంతము బోధించుచున్నట్లున్నది. పిచ్చుకలు, ఇంకను రంగు రంగులపిట్టలు కిలకిలలాడుచు ఆనందములో నాడుకొనుచున్నవి. అప్పుడే యింకొక లోకమునుండి వచ్చుచున్న సూర్యభగవాను డెంతో ఆనందదాయకముగా కనిపించుచున్నాడు అంతయు నానందమయముగా నున్నది. కాని ఆ కాపు పడుచు హృదయము మాత్రము దుఃఖాన్వితమై యున్నది. ఈ ఆనందప్రదమైన ప్రకృతి ఆమె నెంతమాత్రము ఓదార్పజాలకున్నది. అప్పుడామెకు ఉదయసూర్యుడు దుఃఖకారకుడైనాడు. ఎందుచేతనో ఆమెకే తెలియదు. చల్లగా వీచుచున్న పిల్లవాయువులలో నామెకు ఎవో దురంత విషాదగీతికారావములు వినిపించినవి. ఒకటిరెండు కన్నీటిబొట్లు లా శుష్కదేహ కళాయుక్తమైన నయనముల నుండి జారిపడినవి. ఆ బిందువులలో ఉదయసూర్యుడు ప్రతిబింబించినాడు. ఆమె మోకరించి యెదుట కనిపించుచున్న భగవానునకు మ్రొక్కినది.

ఆమెపైనుండి ప్రకృతి సంతానమగు రెంకుకాకులు "కావు కావు" అనుచు నెగిరిపోయినవి. సమీపములో నొక తెలివి గల పసులకాపరి గొంతెత్తి యిట్లు పాడుచున్నాడు.

"తల్లీ యందునా, తండ్రీ యందునా,
యెల్లర బ్రోచెడు నీశ్వరా యందునా,
ఏమని పలుతును నన్ను, నే నేమని పిలుతును నిన్ను"

* * * *

శుక్లపక్షము — ద్వాదశి. నదీ పులిన భాగమున దిరుగాడు చున్న ఆమె అలసట జెందిన దేహమునకు సంధ్యానిలము విశ్రాంతినిచ్చుచున్నది. తపించి తపించి యున్న ఆ శేత హృదయమునకు చల్లని చందురుడు చల్లదనమిచ్చి సేద దీర్చుచు నున్నాడు మనోహరమైన ఆకసపు వింత రంగులు, నదీతరంగములలో ప్రతి బింబించి అంతకన్న అందముగనున్న చందమామ, మెత్తగనున్న యిసుకతెన్నె — ఇవన్నియు నిప్పుడామె అమాయకపు హృదయమునకు నిసుమంతయేమి, బాగుగానే ఆనందము నిచ్చుచున్నవి. ఈసమయమున నామెకు లోకము కఠినముదిగా కనిపించలేదు.

కాని అంతలోనే ఆమెకు తన దీనావస్థ స్మృతికివచ్చినది. ఆమె విస్మృతికుహరాంతరమునసున్న విషాదమయ చారిత్రము నేదో కఠినహస్తము పైకి దీసి విప్పి యామె కన్నులయెదుట బెట్టినది. ఆ దిక్కుమాలినపక్షి ఒకటొకటిగా పుటలుత్రిప్పి తన గతజీవితమును మెల్లగా జదువుకొనినది.

మరల నొకటిరెండు బిందువులు కనుకొలంకులనుండి ఆమెకు తెలియకుండగనే భూమిపై బడినవి. ఆ విదీర్ణహృదయమునుండి వెడలి వచ్చిన నిట్టూర్పు గాడ్పులు అనంతమైన గాలిలో గలిసి పోయినవి.

కాపుపడుచు సొమ్మసిల్లినది.

కోకిలము మధురముగ బాడినది. కోకిలారావము ఆమె కిట్లు వినిపించినది: 'ఎన్నోవరు రక్షించుచున్నారు!'

* * *

కనిపించని చేయి యేదో ఆమెను ఆ యిసుక తిన్నెమీదనే నిదుర బుచ్చినది. కాపుకన్నె కలగన్నది:

బలిష్ఠమైన శరీరముగల రయితుబిడ్డ కనిపించి "అమ్మాయీ, ఎవ్వరులేని యీనిర్మానుష్య ప్రదేశములో నీవొక్క తెవు ఎందు కున్నావు?" అమెను ప్రశ్నించినాడు.

"ఏమిచేయను అన్నా! నేను దిక్కులేనిపక్షిని. నాకు తెలి యని శక్తి యేదో నన్నిట్లు త్రిప్పుచున్నది."

"నీ చరిత్ర యేమిటి చెల్లీ?"

"అన్నా! నీకంత దయగలిగితే చెపుతాను విను. అయ్యో! అన్నా ఎవరికీ లేని దయ నీకెల్లా కలిగినదీ? నాచిన్నతనములో నాకొక తల్లీ, మాయింట్లో ఒక దాసీ ఉండేవారు. నాతల్లి నాతో చెప్పకుండగనే ప్రాణమువిడిచింది. అప్పుడు ఆ దాసీ నన్ను సంరక్షించుతూ ఉండేది. అదికూడా కొన్నాళ్ళకు చని పోయింది. అప్పుడు నేనేమిచేయను అన్నా! దిక్కుమాలిన

పక్షినై పల్లెపల్లె తిరుగాడుతూ ఉన్నాను. నా దయనీయ మైన స్థితిచూచి ఒకరూ నన్ను దయతలచినారు కాదు. ఈ తల్లిలేనిపక్షికై తలదాచుకొనడానికి రవంతచోటిచ్చి పుణ్యము కట్టుకొనడానికి వచ్చావా నా అన్నా!" అని రెండుచేతులు జాచి ఆమె లేవబోయినది.

కాపుపడుచుకు మెలకువ వచ్చినది. కనులు తెరచిచూడగా రయితుబిడ్డ కనిపించలేదు; ఇంకొకవ్యక్తి కనిపించినది. ఆమె క్రుంగి క్రుంగి యున్నహృదయము దడదడ కొట్టుకొనినది. ఆ ప్రక్కన నిలుచుండి యున్నవ్యక్తి యెవరు? వికలాంగుడైన యొకానొక యోధుడు.

ఆ వీరు డామెదగ్గరకూరుచుండి "భయపడకు" అని ఆమె కేసి నిష్పందనయనుడై చూచినాడు.

కాపుపడుచు కూడ నాతని నిశ్చలదృష్టితో పరికించి "అయ్యా, నీ వెవరవు, నన్ను రక్షించడానికి వచ్చావా?" అన్నది.

వీరు డామెను దగ్గరకు తీసికొని రెండుచేతులమధ్య నామె నిడుకొని "నీ పేరేమి?" అన్నాడు.

"నా పేరా? — నాగరత్నం."

"రత్నం" అని ఆమెను కౌగలించుకొన్నాడు ఆ వీరుడు.

* * * *

అతడు జేబులో నుండి యొకకాగితము దీసి ఆమె కా లేఖ జూపుచు యిట్లు చదివినాడు.

నందపురము
విజయనగర సంస్థానము
30 జనేవరి, 1565

ప్రియా!

నా శరీరములో అస్వస్థతగా నుండుచున్నది. కావున నాకు విచారముగా లేదు. పదునాలుగు రోజులక్రిందట కుమార్తె కలిగినది. ఈ వా[illegible] [illegible] ప్రమాద[illegible] [illegible]గలదు. పాపకు నాగరత్నం పెట్టదలంచినాను. మీ యుద్ధ మెట్లున్నదో వ్రాయకోరెదను. నేను, దాసి, నాగరత్నము సుఖముగ నున్నాము. మీ యుద్ధ మెట్లున్నదో వ్రాయగోరు చున్నాను. శ్రీ శ్రీ శ్రీ విజయనగర మహారాజులుంగారైన రామరాజుగారి సైన్యమును సుల్తాను హుస్సేను నిజాంషాగారి దండులు చెల్లాచెదురు చేయుచున్నవని యిచట వినికిడి. ఈ యుత్తరము మీకు చేరునో చేరదో అనియు, మరల మనము కలియుదుమో లేదో అనియు సంశయభావమున నిది వ్రాయు చున్నాను.

ప్రేయసి భూషణం

వారిద్వురు ప్రేమైక గాఢాలింగనమున చాలసేపున్నారు. చాలసేపైనను వారికా సమయ మొకస్వప్న మధుర క్షణము వలె తోచినది.

సుధాకరుడు, సుధామయకాంతి, నక్షత్రములు, మారుతము, తరంగములు వారి నాశీర్వదించినవి.

సంస్కృత దోషము

అపరాహ్ణసమయము — విశాఖపట్టణము. ఇస్లామియా వాస్తుశాస్త్రప్రకారము చక్కని గురుజులతో నిర్మితమైన [illegible] భవనము వలపువాంఛదీర్చెడి [illegible] రమణి విశాలతరనయనముల [illegible] సౌందర్యకళలు విరజిమ్ముచున్నది. సముద్రపుటొడ్డున నుండుటచేత ఆ శ్వేత సుందరమందిరమునకు గోషావిడిచిన తుర్కీ [illegible] వలె, [illegible] ఆవరించి ఆరూపకళలో సమ్మిళితమైపోయినది. దాని ముంగిట రెండే పొడుగుపాటి సర్వీ చెట్లు, కొన్ని పూలమొక్కలు, క్రోటనుచెట్లు. భవనపుధర సౌందర్యమునకు తగినటులే నామధేయము. బంగారురంగు అక్షరములలో 'ఒమర్ కయామ్'

టేబిలుముందట కుర్చీలో స్వేచ్ఛగా కూర్చుండి మనోహరముగా అలంకరించుకొనియున్న ఆమె ఒక్కొక్కప్పు డెదు[illegible] నెత్తురువలె [illegible] అస్తమించనున్న సూర్యుని [illegible] ఒక్కొక్కప్పుడు తెలియని [illegible] నుండి [illegible] కొరకు [illegible]

అటు [illegible] కాంచుచు [illegible] ఆమె [illegible] కోర్కె [illegible] మెరియుచున్న కనులు వెలుతురా అది — [illegible] కనులలో [illegible]ంచిన చిరునగవా? ఆ సుందరిని తెల్లని లేతబుగ్గలలో కనిపించు చిరుగుంటలు తెలుపుచునే యున్నవి

చిఱునగవే అని. తన వలుచని కోమలశరీరమునకు నన్నత ఆపా దించుచున్న వాలరంగుపట్టుచీరె గాలితాకుడు కెగురుటచే ఆమె నాజూకుగా గులాబీరంగు వ్రేళ్లతో సరుదుకొన్నది చేలాంచలములు. పొడుగుపాటి కాటుకరంగు కురులు విరబోసి యుండుటచే అనిలతరంగములతో ఆడుకొనుచున్నవి. కుడివైపున కొన్నికురులనడుమ ముచ్చటగా ముడివేయబడియున్న ఎఱ్ఱని పట్టురిబ్బను [illegible] తాకుడుకు కదలుచు [illegible]న్నది.

అప్పుడే యెలాస్టరు [illegible] ప్రా[illegible]త్తివేసి — [illegible]లో కనిపించిన కన్యకోసము తిరిగి తిరగి, ఎక్కడ! ప్రకృతి నిశ్శబ్ద సమయాలలో — సౌందర్యపిపాసతీర్చుకొనుటకు, కాల్చివేయు చున్న పిపాసజ్వాలలు ఎవరు శాంతించునది, అటువంటిశక్తి యున్నవారు — ఎక్కడాఉన్నది: పిపాస, పిపాస, ఈఅంతు లేని పిపాస, దయతో ఆర్పివేయుచున్న పిపాసకు — ఏదీ ఆ సౌందర్యము! ఆమాధుర్యము! ఏదీ ఆజీవనశక్తి, అమృతప్రవా హము — యిటువంటి ఆవేశము, జీవము ప్రసాదించిన షెల్లీ కవిహృదయమును దూరవులోతు చూపులతోనే, ఊర్పు గాడ్పులతోనే అభినందించుచు గదినుండి వెలుపలికి వచ్చి:

“కవీ, నీవు మాంత్రికుడవా — యిటువంటి మెరుపులు నీవు దాచివేయడానికే ప్రయత్నించివుంటే నీవెన్నహృదయాన్ని అవి చించివేయవూ! యిటువంటి గులాబీహృదయాన్ని దిగ మ్రింగితేనేగాని ఆ క్రూరపు యిటలీనీళ్లకు కడుపుమంట చల్లా రిందికాదూ!’’ తనలో తానే అనుకొన్నాడు రాధారమణ.

రమణ యిరువదేనిమిది వత్సరముల ప్రాయమువాడు. చామనచాయ. పుష్టిగలశరీరము. నొక్కులు నొక్కులుగా మెరయుచున్న నల్లని క్రాపింగు.

ఆమెవంక చూచినాడతడు. ఒడలు పులకరించి పోయినది. రక్తముష్ణమై ఆవేశము నందినది. అతని కెప్పటికప్పుడామెలో నవనవానందము, నవ్యసౌందర్యము, క్రొత్తజీవము, క్రొత్తకళ గోచరించుచునే యుండును. ఎప్పుడామె సహచర్యమున జీవము అణుమాత్రము తగ్గినట్లు అనుమానము కలుగునో – ఆతడు వెంటనే మెకువగలిగి తెలివి తేటలతో ఎడబాటు బలముతో నిర్వారి జీవితములు రసవత్తరజీవపంతములు చేసికొనుచుండును. అదియే అతనిలో 'గొప్ప' అందు రతని స్నేహితులు.

రెండుగంటల యెడబాటుతో అతని చూపులు ఆవేశ గర్భితములైనవి. ఉబుకుచున్న ఆవేశము లాతడు పదిలముగా అణచుకొని మెల్లగా నడుగులిడుచు వెళ్లి చటాలున ఆమె కనులు మూసినాడతడు.

ఆమె నవ్వినది నెలబాలుని వెన్నెలలాగు. చిఱుగుంటలు బుగ్గలమీద, ఎంత ముచ్చటగా ఉన్నవీ!

రమణ చూచినాడు వానిని. హృదయ మొక్కగంతువేసినది, చిఱుగుంటలనుండి వెలువడిన విద్యుత్తరంగముల స్పర్శతో.

"విపియానీ – " అన్నాడతడు ప్రేయసిని ముద్దు పేరుతో.

"ఎవరుమీరు! షెల్లీ – పట్టువడ్డారులెండి, యింకెందుకూ"

రమణ యేమీ మాటాడకుండా ఆమెను అటులనే సోఫా దగ్గరకు తీసికొనివెళ్లి అందుకూర్చుండజేసి వెనుకకు కొంచెము వంచి చటుక్కున చేతులు తీసివైచి గుండ్రని [illegible] పట్టుకొని:

"పట్టుపడినందుకు బహుమతీ యేమిస్తావు, విధీ!" అన్నాడు.

"ఏమివ్వమంటారో చెప్పండి" అన్నది [illegible] ఆత్రజేసికొని

"[illegible] ఊఁ, అల్లాఅయితే నని [illegible] గారాము పెట్టుచున్న [illegible]"

"వాప్పుకోపోతే నే నేమిచేస్తా, నేనూ వొప్పుకోనూ, అప్పు డేమిచేస్తారూ?"

"ఊఁ, అదేమిటి! అల్లా యెల్లా [illegible]! నన్ను పాపాయినిచేసి ఆడిస్తున్నావు."

"అవునవు, [illegible] పాపాయి – [illegible] నీకు బహుమతీ యేమి [illegible]

"నా కవి [illegible], [illegible] చూస్తాము" అన్నాడు రమణ [illegible] "ఆదేమి టన్నావు, అల్లాఅను [illegible] కొండ [illegible] స్పష్టాళ్ళు [illegible]

"పోనీ, నీ యిష్టమొచ్చిం దియ్యి"

"వొకసారి-అడిగేసిన తర్వాత యింకా నాయిష్టమేమిటి. మీరడిగిందే యిస్తాను. తీసుకోండి, యెక్కడున్నా లెక్కించే"

రమణ యిక పట్టలేకపోయినాడు, ఉత్తుంగ తరంగములలాగు వెల్లువయై యుబుకుచున్న ఆవేశము. దక్షిణహస్తముతో ఆమెను గట్టిగా ఎదురుగా దగ్గిరకు తీసుకొని యెదురొమ్ము కదిమి వేసుకొని తన యినుపకౌగిలిలో, గులాబిపువ్వువంటి వంపులుతీరిన చిన్ని పెదవులను మనసార, కసిదీర తన్ను తానే మరిచిపోయి ముద్దిడినాడు. ఆమె తన రెండు లేతహస్తాలతో రమణను ఉద్రేకముతో తన యురమున కదుముకొన్నది అర్ధ నిమీలితనయనములతో అతనివంక చూచుచు.

కుడిచేయి ఆమె గుండ్రని కోమలమైన మెడచుట్టూ వేసి, యెడమచేయి ఆమెవక్షస్థలముపై నుంచి రమణ ఆమెను తన ప్రక్కకు దగ్గిరగా తీసికొన్నాడు. ఈసారి ఆమె అతనినడుము చుట్టివైచిన డాకచేతితో. ఆవేశముతో సున్నితముగా ఆమె కంఠసీమ కౌగిలించుకొని శిరస్సు నామె గుండ్రని భుజముపై ఒకనిమిషముంచి పీల్చివేయుచున్న తృష్ణ, అంతులేని పిపాసతో బంతిపువ్వులాగు మనోహరముగానున్న మెడ ముద్దుపెట్టుకొన్నా డతడు. వక్షముపై చేయి — పిల్లగాడ్పుల కదిలిన అలలువలె నెగురుచున్న ఆమెవక్షముతోపాటు, అచటనున్న రమణ చేయికూడ కదలుచున్నది. రమణ చూచినాడు నాజూకుగా చేయివక్షముపై చరచుచు. మెడ చుట్టియున్న రెండవచేతి బొటన చూపుడు వ్రేళ్ళు చిరునగవుచే ఏర్పడిన చిరుగుంటలపై నుంచి ఆమెకన్నులలోనికి ప్రేమతీవ్రతతో చూచినాడు రమణ. ఒక నిమిషము మరల ఉద్రేకము. ఈసారి శక్తికొలది ఆమె

పూవువంటి మెత్తని పలుచని శరీరము తన యినుపకౌగిలిలో ఎన్నోసారు లదుముకొన్నాడు. వివియానీ కూడ అతనిని తన లేతకౌగిలిలో కసిదీరా అణిచి వేసినది. రమణ ఆమెను నలిపి వేసినాడు. ఆమె అతనిని కలచి వేసినది. తన్మయులైపోయి—పిపాస, సౌందర్య పిపాస—ఎట్లుతీరగలదు? ఆనందించినా రొకరి నొకరు. అనుభవించినా రొకరి నొకరు. తృప్తి యేదీ—ఆమె పలుచని శ్వేతహస్తాలతో తీగెలాగు చుట్టివేసినది అతనిని. అత డామెను తన పుష్టిగల బలిష్ఠమైనచేతులతో గట్టిగా నొక్కినాడు. ఏమేమోకబుర్లు చెప్పుకొన్నారు. ఏమేమో మాటాడినారు ఒకరి చూపులో ఒకరు, ఒకరి సౌందర్యములో ఒకరు ఐక్యమైపోయి.

అతనికి దక్షిణపార్శ్వముననున్న వివియానీ మృదులకంఠ సీమ జుట్టి యాతని హస్తము, ఆతని నడుమునుచుట్టి ఆమె మంజుల హస్తము అటులనే యున్నవి.

టీ వేళయినది. సేవకుడు టీ తీసుకొనివచ్చి వారిముందునిచి వెళ్ళినాడు. చిఱునగవుతో నామె రమణనోటి కందించినది పాత్ర. ఆతడు కొంచెము త్రాగి మరల ఆమె వదనము ముందుంచినా డతడు కంఠమును జుట్టియున్న చేతితోడనే. ఇటులనే మెల్లగా చాలసేపు ఉప్పొంగిపోవుచున్న హృదయములతో, విచ్చియున్న చిత్తములతో, పులకరించియున్న అంగములతో త్రావి నా రిర్వురును.

తర్వాత ఆమె సిగరెట్టు అతని నోటిలోనుంచి తానే వెలిగించినది. అతడు కొంచెము కొంచెము తియ్యని పొగ విడు

చుచు ఆమె మెరుపుకన్నుల ప్రకాశములోనికి చూచుచు, ఆమెను నవ్వించుచు నవ్వినప్పుడు కలిగిన చిరుగుంటలు రెండు వ్రేళ్ళతో సున్నితముగా నొక్కి ఆనందించుచు, కురులు యెదో తనకు తెలియని పద్ధతిని సవరించుచు ముంగురులు మోముపైకి తీయుచు మరల వానిని చిక్కుచేయుచు, శిరోభాగము, నెన్నుదురు ముద్దిడుచు, ఆమె శిరస్సు తన భుజముపై నాన్చుకొనుచు, ఆమె ముద్దులందుకొనుచు — కొంతసేపు వెళ్ళబుచ్చినారు.

రమణ చటాలున లేచివెళ్లి తన గదినుండి ఉడుకులాన్ సీసా తీసికొనివచ్చి వివియానీ తొడపై శిరస్సునుంచి పరుండి పరిమళోదకము ఆమెపై కొంత చిలుకరించినాడు. ఆమె సీసా తీసికొని అతనిపై కొంత జల్లినది. అతడామె బంతిపువ్వువంటి కుంద్రని చిన్ని చుబుకమును పట్టుకొని:

"వివీ, మనము కలకత్తా బొటానికల్ గార్డెన్సులో గడిపిన రాత్రి జ్ఞాపకముందా"

"ఆఁ, ఎందుకు జ్ఞాపకముండదూ. అటువంటి కఠినపరీక్ష మరచిపోవడమే యింకా యేమన్నా వుందా"

"ఆపరీక్షలో తప్పవలసింది నువ్వు, ఏమిచేసేవాణ్ణో తెలిసేది"

"మీరే తప్పడము తటస్థించితేనా ఏమిచేసేదాన్నో తెలుసా"

"ఆఁ, నాకు తెలుసు — ఒకచిన్ని బుగ్గపోటని"

"అవునుకాని యేమండీ అటువంటి పరీక్ష లెవరైనా చేస్తూవుంటారూ!"

"ఎవరో జోలి మనకెందుకు పోనిస్తూ, నేను పెట్టినపరీక్ష బాగుందా లేదా !"

"ఏమి చెప్పమంటారూ ?"

"అదిగో —"

"యిప్పుడు నన్ను మీా రేమి చేయఁగల రేమిటి ? పరీక్ష ప్యాసయిపోయినానుగా — యింకేమి చేస్తారు !"

"అవును కాని విపీ. ప్లాను బాగా తోచింది ముత్తానికీ. ఆరాత్రి మనము గార్డెన్పుషికారు వెళ్ళడమూ, అక్కడికి వెళ్లాక ప్రేమపరీక్ష వొకరినొకరు చేసుకోవాలని మనయిద్దరికీ ఒక్కసారి తోచడమూ, సరే యేమిచేద్దామంటె యేమిచేద్దా మనుకోవడమూ, ఆరాత్రంతా మనమిద్దరమూ రెప్పవాల్చకుండా సూర్యోదయమువరకూ మేలుకోవడమూ, యిందులో యెవరు రెప్పవాల్చితే ఆ వ్యక్తి హృదయపాత్రలో ప్రేమరసము అంచులువరకూ తొణుకుతూ నిండా లేదనీ అందుకు అసంపూర్ణప్రణయానికి శిక్షగా ప్రేమరసము అంచులువరకూ నిండటానికి యెడబాటు మంచి మందు గనుక నెలరోజులు లొకరికొకరు కనిపించకూడదనీ, వోడిపోయిన మనిషి గెలిచిన మనిషికి ఉత్తరములు వ్రాయవచ్చు కానీ, గెలిచినమనిషి వోడిపోయిన మనిషికి వుత్తరాలు వ్రాయకూడదనీ, యిద్దరమూ పరీక్షలో గెలుపొందితే — అంటే మనమిద్దరమూ ఒకరి కొకరు ఇసుమంతకూడా తక్కువలేకుండా ప్రేమిస్తున్నామనీ, మనయిద్దరి హృదయపాత్రల్లో ప్రేమరసము అంచులువరకు

త్రోణుకుతూ వుందని గెలుపుసూచన : దీనికంతటికీ పౌర్ణమి చంద్రునిసాక్షి. గెలిస్తే సంతోషప్రకటన మిత్రులందరికీ కారణము చెప్పకుండా పెద్దవిందు చేయడము. బలేపరీక్ష, విపీ ! ఆ విందుకు కారణము తెలియక ఆ రోజు చాలామంది అనుమానపడ్డారూ, చివరి కేమనుకున్నారో వాళ్ళంతా."

"ఒకామె మాత్రము బహుచక్కగా అనుమానపడింది. చెప్పనా—మీరు, గర్భిణివచ్చిందేమో అంచేత చేస్తున్నారని అనుకుంది పాప మావిడ."

రమణ ఆమెమోము తనముఖము దగ్గరకు తీసుకొన్నాడు. ఆమె అతనిని ముద్దుపెట్టుకొన్నది. చేయి అటులనే కంఠము చుట్టునుంచి మోము దగ్గరగా నుండగానే,

"విపీ, నువ్వు నాదానివయిపోయినా కూడా, యీ విధంగా తృష్ణతీర్చుకుంటూవున్నా కూడా యేమిటో రోజురోజుకి పెరిగి పోతూంది తృష్ణలోతు. రోజురోజుకీ గంటగంటకీ పెరిగిపోతూంది తృష్ణవైశాల్యం. ఒక్కొక్కప్పు డనుకుంటా— యెల్లా నా విపీకి నాచిత్తకి హృదయం విప్పి — అబ్బా యేమేమిటో చేద్దామను కుంటా విపీ ! విపీ యెల్లాపెంచుతావు యీప్రేమ — యెక్క డుంది ఈశక్తంతా విపీ నీకు" అని మరల రేకెత్తిన ఉద్రేకముతో ముద్దిడినాడు రమణ.

ఆమె మృదులహృదయము పులకరించిపోయినది. చలించి నదికూడా ఆమాటల తీవ్రతవల్ల. కనులు పెద్దవిచేసి, వెంటనే

చిన్న పిచేసివైచి అతని హృదయమునకు నొకరించి నమస్క రించుచున్నవా యన్నట్లు చూపులతో :

"ఒక్కొక్కప్పుడు నాకు భయంవేస్తూ వుంటుందండీ తెలుచుకుంటే. అంత తీవ్రం, అంతలోతూ, అంతగంభీరతా, అంత చక్కదనం వున్న ప్రేమకు ప్రతిరూపుగా అటువంటిదే మళ్లా అర్పించుతున్నానా లేదా అని అనిపిస్తూ వుంటుంది. ఇప్పుడు భయంవేస్తుందని ఏక్షేమైనా అనుకోండి : ఎప్పుడైనా తెలివి తక్కువచేత అటువంటి ధనం చెయిజారి పోగొట్టుకుంటానేమో అని — అప్పుడొళ్ళు వణికిపోతుంది" ఆమె అన్నది.

రమణ ఆదరముతో ఆమెను దగ్గరగా హత్తుకొన్నాడు.

"విమీ, నువ్వు అల్లా అనుకుంటున్నావా! నే నేమనుకుంటు న్నానో తెలుసా! విమి అంతటి రూపరాశి : తానేకాదు, తన హృదయం, తన ప్రేమ, తన సర్వస్వమూ నాకే అర్పించివేశింది. అంతకన్నా యేమికావాలి-నేనొక్కణ్ణే ఈప్రపంచంలో ధన్యుణ్ణి, ధన్యుణ్ణి—"

"ఊఁ"

ఒక నిమిష మాగి—

"అచ్చంగా అల్లాగే నేనూ అనుకుంటూవుంటానండీ. అదే ఆభయాన్ని అప్పుడప్పుడూ అణిచివేసి పోగొడుతూ వుంటుంది. అప్పుడెంతో వుప్పొంగిపోతుంది మనసు. నాఅంత అదృష్టవంతు రాలుందా అటువంటివారు తమకున్నదంతా హృదయం ప్రేమా అంతా నాపై నిలిపివేశేశారు చలనము లేకుండా.

ఎంతగర్వం, నేనేకదా నాసౌందర్యమేకదా అల్లా ఆకర్షించ కలిగింది అనీ. ”

అత డామె నింకా దగ్గరగా అదిమికొని :

“ విపీ, జన్మలంటే నాకు నమ్మకంలేదు కాని వొక్కొక్క ప్పుడు మాత్రం—మనయిద్దరకీ పూర్వజన్మంలో యెదోవిచిత్ర మైన సంబంధం వుండివుంటుందనిపిస్తుంది విపీ. ”

“ అదేమో నాకు తెలియదుకాని, మీరు నాకోసం, నేను మీకోసం యీవిధంగా పుట్టామని మాత్రం నాకు తెలుసు— జరిగిపోయిందానిజోలి జరగబోయేదానిజోలి మనకెందుకు ? యెప్పటికప్పుడు ఆనిమిషం ఆనందంతో మనమిద్దరమూ అనుభ వించడమే మనపని. ”

“ ఊం, అల్లాగే ” అని రమణ ఆమెను మండిపోవుచున్న ఉద్రేకజ్వాలతో ముద్దుపెట్టుకొన్నాడు.

“ అవునుకాని యేమండీ, యిన్నికబుర్లు చెపుతానా వొక్కొ క్కప్పుడు యింత Passionate గాను రసవంతంగాను గడిపే జీవితం—మనయిద్దరినడుమా బంధం, ప్రేమ మామూలే అయి పోయి నీరసంగాను పేలవంగాను అయిపోతుందేమో కొన్నా ళ్ళయిపోయాక అనిపిస్తూ వుంటుంది. ”

“ విపీ, నీ కన్నీ సందేహాలే. మన పెళ్ళిఅయి నాలుగుసంవ త్సరాలయినాయి, యేమంత తగ్గిందేమిటి మన బంధంయొక్క పురీ! మనజీవితంలో యేమితగ్గిందీ, సౌందర్యమా, మాధుర్యమా,

ఆనందమా? ఈ జీవితం యెప్పుడూ యీ పసతో గడిచి పోవలసిందే."

"అవునులెండి నాకు తెలుసు—అవునుకాని అల్లాఅంటారు సంతానముతో కొందరి జీవితాల్లో ఆనందము పట్టు తప్పడము మనం చూడడములా."

"విపీ. నిజమైన ప్రేమవున్నచోట యేదీతగ్గదు, దాన్ని అనాంతరా [illegible] [illegible] [illegible] వాడుతుంది. మనవాళ్లు తెలివితక్కువచేత ప్రేమను పెంచుకోనడము చేతకాక [illegible] వంటమర చేసివేసో, దాసీదాన్ని చేసి వేసో, లేకపోతే యెక్కువ మోహంవల్ల వొకరినొకరు విడవకుండా కొత్త కాస్తా గడవడముతోనే యెడ మొగం పెడ మొగం చేసుకునో—యింకా యిటువంటి కారణా లనేకము వున్నాయి, యీ విధంగా చక్కని గులాబిపువ్వులాంటి జీవితం శ్మశానం చేసుకుంటారు, వొకరినొకరు అనుభవించడము చేతకాక. పురుషుడి ఆనందము కోసం స్త్రీ, స్త్రీ ఆనదముకోసం పురుషుడు సృష్టింపబడ్డా రన్నమాటే మరచిపోయినట్టు కనిపిస్తూం దీలోకం యెవరిచి. విపీ మొన్న మనం సముద్రపొడ్డున కూర్చున్నప్పుడు చెప్పాలా! ప్రేమ వొక గొప్పకళ. దాన్ని పెంచితే పెరుగుతుంది; నిర్ల క్ష్యంచేస్తే చచ్చిపోతుంది. ఈప్రేమకళామర్మం తెలిసికోకుండా, రాత్రుల్లు మాత్రమే వుక్కపోస్తున్న గదుల్లోనూ; తెరలు చాటున కలిసేవాళ్ళ జీవితాలు శ్మశానాలుకాకుండా దేవేంద్రుని తోటకావాలంటే యెల్లా అవుతుంది. ప్రేమను భద్రపరచుకొని,

ప్రాణపదంగా వుపయోగిస్తూ—నిరుపయోగం చేయకుండా వుప్పొసిల్లనుకొని—ప్రేమకళాజ్ఞానం సాయంతో ప్రేమ పెంచు కుంటూ యెడబాటు సాయంతో దానికి యెరువువేస్తూ యెంతో మెలకువగా వుంటే తప్ప లేకపోతే పన్నీరువంటి ప్రేమలోని ఆనందం కుళ్లి కంపు వేస్తుంది కూడాను మనం చూడడములా కొందరి జీవితాల్లో; చదువుకున్న వాళ్ళకూడా అటువంటి కుళ్ళి కంపువేస్తున్న జీవితాలు గడుపుతూవుంటే జాలి వేస్తుంది. వాళ్ళకన్నా పొలాల్లో పనిచేసుకునే కూలిదంప తులు నయం—వివీ యింతే, ప్రేమను పెంచి రెట్టింపు వుత్సా హంతో అనుభవించేట్లు చేయడానికి యెడబాటుతప్ప దాని కింకో యెరువులేదు—యేమిటి వివీ, కళారహస్యం తెలిసినదానివి నువ్వుకూడా అనుమానపడుతూ వుంటావు.” అని రమణ ఆమె మెరియుచున్న తరళనయనములు చుంబనముగొన్నాడు.

ఆమె మధురముగ నవ్వుచు సన్నని కంఠమున మెల్లగా “ అందుచేతే కామాను మహానుభావులు మీరు యీ ‘యెడ బాటు’ మాటని శాశ్వరూపంగా వుంచి మనసు కలత పెడుతూ వుంటారు !” అన్నది.

అతడు ప్రత్యుత్తరముగా నవ్వినాడు సంతోషముతో.

తర్వాత టేబిలు కిరు కెలంకుల నిద్దరు కూరుచుండి చతు రంగము ప్రారంభము చేసినారు. లోతుగా ఆలోచించుచు ఒకొక్కప్పుడు నవ్వుకొనుచు, మఱొక్కప్పుడు తెచ్చుకొన్న

కోపముతో నిర్వురు నుత్సాహముతో నాడుచున్నారు. నడుమ నడుమ యెవో కబుర్లు—

"అయి దవ్వొస్తూంది. వేణుగోపాల్ వచ్చే వేళయినట్లుంది" అన్నది ఆమె.

"ఈగోపాల్ యెక్కడ దొరికాడు విపీ, నీకు" అన్నాడతడు.

"బాగావుందండీ, చిన్నప్పు డెంతస్నేహంగా వుండేవాళ్ళ మనుకున్నా రేమిటి!"

"యెల్లావుంటా డతను నే నెప్పుడూ చూడనే లేదు."

ఆలోచనలో పడిన దాతని మనస్సు

"చిన్నప్పుడు చాలా బాగుండేవాడు, యిప్పు డెల్లా వున్నాడో తెలీదుగాని యీమధ్య యింగ్లండు వెళ్లాడని చెప్పాగా? యింగ్లండు వెళ్లినవాళ్ళకి క్రొత్తఅందము వస్తుందండీ! అయినా నేను చూసి చాలారోజు లయింది."

"ఊఁ – కాని యీ వుపన్యాసం."

"చిన్నప్పటిరోజులు జ్ఞాపకమొస్తే యెల్లావుంటుం దనుకున్నారూ! ఒక్కసారి అమాంతంగా చిన్నపిల్లనై పోయి ఆడుకోవాలనిపిస్తుంది."

"తరువాత, తరువాత" అన్నాడు రమణ నవ్వుచు.

"గోపాల్ చిన్నప్పు డెంత అందంగా వుండేవా డనుకున్నారు – అదుగో నవ్వుతున్నారు, అయితే నేను చెప్పను."

"లేదు, లేదు, విపీ, చెప్పు వింటాను" అన్నాడతడు ఆమె చుబుకము పట్టుకొని.

"మల్లిపువ్వంత తెల్లగా వుంటాడండీ. గుండ్రని మొగం. అదే మొగాని ఆడవాళ్ళ అందము నాకు బాగా తెలీదు కాని గోపాల్‌లో ఆడరూపు చూచినప్పుడు మాత్రం ముచ్చటగా వుండేది. అంతా ఆడవాళ్ళలాగు సన్ననికంఠమూ, మెత్తని మనస్సు, నాజూకుదనమూ, మొగంలో స్త్రీరూపం — యివన్నీ అందరిలోనూ కనిపించవండీ. అదేమిటోగానీ మొగవాళ్ళలో యిసుమంత స్త్రీరూపమూ, ఆడవాళ్ళలో కొంచెం అణుమాత్రం పురుషరూపమూ క్రొత్తఅందం తెచ్చి పెడుతుందండీ"

"మరి నీలో ఆరూపు లేదే"

"మీలో వుందికనకా నాలో వుండటానికి! యిద్దరం వొకళ్ళేగా, అందుచేత మీరు నాలోనూ, నేను మీలోనూ వుండి అది పూర్తిచేశామన్నమాట — మరిచెప్పేది, పూర్తి చేయనీయండీ! అతను నాచెల్లలైపోతే బాగుండుననిపించేది, మనస్ఫూర్తిగా. ఆకోరిక వట్టలేక వొకరోజు యేమి చేశాననుకొన్నారేమిటి! అప్పుడు మాయిద్దరికీ యెనిమిదేళ్ళుంటయి. నాకొక చిన్నపట్టుచీర వుండేదిలెండి. అతనికి నచ్చజెప్పి, మెల్లగా చాక్లెట్సు పెడతానని, చీరకట్టాను. మరి క్రాఫింగు అడ్డువచ్చిందిగా వయస్సు యెనిమిదైనా బెంగాలీల మాదిరి ముసుగువేశా. గబగబా అద్దందగ్గిరికి తీసికెళ్ళి నిలువుటద్దం

ముందు నిలుచోబెట్టి ప్రతిబింబంచూస్తే యెంత ముచ్చటగా వుందనుకున్నారు. తిన్నంగా అతనివంక చూసేదానికన్న అద్దంలో రూపుచూస్తే యెంతో ముద్దొచ్చింది. అప్పుడు తను సరదాపడ్డానా, మళ్ళా అంతే వయస్సులో అందంగావున్న ఆడపిల్లను చూస్తే అంత యిష్ట మయ్యేదికాదు." కృత్రిమ మేమియులేక ఆ అమాయికపుహృదయ మనస్సులో ... దంతయూ కలుషిత ... వైచినది. అందు కాతడెంతయో ... చినాడు.

అప్పుడే వచ్చినాడు వేణుగోపాల్. దరహాసితవదనముతో, మృదు మంజుల రావముతో ఆమె, గోపాల్ ఉభయులకు నమస్కారము చేసికొనిన పిదప ఆమె గోపాలును పతికిట్లు పరిచయము చేసినది.

" యితను వేణుగోపాల్. మేము చిన్నప్పటినుంచీ స్నేహంగా వుండేవాళ్ళము."

తరువాత :

" ఈయన్ని అందరూ రాధారమణ అంటారు, నేనుమాత్రం మెల్లీ అంటూ వుంటాను—యింకేమి చెప్పను (తన్ను చూపించుకొని) యీమె ప్రతిరూపు ఆయన, ఆయన ప్రతిరూపు యీమె."

అందరూ నవ్వినారు. రమణకూడా కష్టముతో నవ్వినాడు. ఏదో తనకు తెలియనిది అప్పుడే ఆతని హృదయము నాతనికి తెలియకుండగనే ఆవరించుచున్నది. మెల్లగా అన్నాడిట్టులు:

"యెప్పుడొచ్చారు మీరు?"

"మధ్యాహ్నం మెయిలులో వచ్చాను. సిసిల్ హోటలులో బసచేశాను. మొన్న సుబ్బులు తల్లిగారిని చూడడానికి వెళితే మీరు చల్లగాలి కొరకు యిక్కడికి వచ్చారనీ, కలకత్తావెళ్లాగూ వెళుతున్నాను గనుక విశాఖపట్టణంలో దిగి సుబ్బుల్ని మిమ్మల్ని చూచి వెళ్ళమనీ చెప్పారామె."

"సుబ్బులుపేరు తీసివేశామండీ. క్రొత్తపేరుతో పిలవాలి యిప్పుడు మీరు 'వివియానీ' అని."

వేణుగోపాలుకు షెల్లీప్రణీతమైన Epipsychidion గీతారచనకు కారకురాలైన నిరుపమసౌందర్యరాశియగు యిటలీ రమణి మెరపువలెస్మృతికి దోచినదికాబోలు, అతడునవ్వినాడు.

తరువాత రమణ యేమియు మాటాడలేదు. అటులనే మాటాడక మౌనివలె కూర్చున్నాడతడు కొంతసేపు.

వివియానీ, గోపాల్ యేవేవో చిననాటి సంగతులు మాటాడుకొనుచు, వానిలో నవ్వులలో మునిగిపోయినారు.

రమణ హృదయాంతరమున సన్నని నీలితెర పడినది; ఆ దొకవిధమైన చిడిముడిపాటుతో వారిసెలవు గైకొనకుండనే అతడు లేచి వెళ్లిపోయినాడు చటాలున.

అది నిశితబుద్ధియైన వేణుగోపాల్ కనిపెట్టకపోలేదు. కాని మంచువంటి స్వచ్ఛమైన లేతహృదయముగల ఆమె చిననాటి మిత్రుని సమ్ముఖమున ఆనందపారవశ్యమున దానిని తెలిసికొనలేకపోయినది.

రమణహృదయమున కలిగిన యుత్తలపాటునకు కారణము, ఈర్ష్యయో, అసహనమో, అనుమానమో అతనికే తెలియదు. అదేమైనను తనకు తెలియకుండగనే హృదయమును కలచివేయుచున్నదది. వారిద్దరు నట్లు లానందతన్మయులై సంభాషించుకొనుచుండ తాను ఖిన్నుడై కలకబారిన మనస్సుతో చిడిముడిపాటుతో చటాలున లేచివచ్చుటలోని నిగూఢార్థ మాతనికి బోధపడలేదప్పుడు. అట్లుల వారి యనుమతి లేకుండ లేచి వచ్చివేయుట సుర్యాదకు భంగమని మాత్ర మాతడు మరు నిముసముననే గ్రహించినాడు.

నిశ్శబ్దముగ వెన్నరంగుపట్టుసూట్ వేసికొని, సిగరెట్టు వెలిగించి బయలుదేరినాడు షికారుకి అతడు. తిన్నగా ఎక్కడను ఆగకుండా కాళులు దిగబడిపోవుచున్న మెత్తనిదూదివంటి యిసుకలో సముద్రతరంగముల దగ్గరగా బిగువుగా నడచుచు డాల్ఫిన్సు నోసువరకు వచ్చి అచటి శిలాఖండముల మీద కూలబడినాడు రమణ. ఇంతవరకు నాతనిహృదయము శూన్యస్థలముగనే యున్నది.

రెండు నిముసములు గడిచినవి. ఆ ఎత్తైన పర్వతము కేసి, యెగిరియెగిరి మెరియుచు నురుగుతో వచ్చుచున్న ఆకసపురంగు తరంగముల కేసి, దృష్టి వెళ్లినంతదనుక అనంతవిశాల మైన సముద్రముమీదుగా ఉత్తేజిత భావసిక్తములైన చూపుల తోడనే గాంచినా డొక్కదీర్ఘనిశ్వాసము విడిచి అతడు.

హృదయమున చలనము విజృంభించినది. ఎదుటనున్న నత్తుంగతరంగములవలెనే వెల్లువలై ఒకదానిని తరుముకొని

యొకటి పరుగెత్తినవి ఆలోచనావీచికలు అప్పుడప్పుడే శాంతి నందుచున్న శూన్యతలమున: "ఎందు కీ కలత?—"

రమణ ఆలోచించినాడు తీవ్రమైన చూపులు లోనజొరిచి. మరల నిర్మలముగానుండికూడ మనస్సున నావేశమును కలిగించుచున్న ఆకాశమువంక దృష్టి సారించినాడు:

"ఎందు కీ కలత?—" ఆమె అంతసంతోషంగా వుండడ మేమిటి? నాకీ కలకపాటు యెందుకూ? వాళ్ళిద్దరితో చెప్పకుండా వచ్చివేసినందుకు యేమనుకుంటారో, మర్యాద తెలియదని. అయినా యిదంతా యెందుకు, మనస్సు కీ చిడిముడిపాటు, చీకటి, ఆరాటమూను.

ఆమె అతనితో అంతచనవుగా మాటాడుతుందనా? మాటాడితే యేమి—లేకపోతే అతను ఆమెతో యెందుకు మాటాడాలి అనా? ఏమి టీ తుపాను...

ఏమీఆలోచడములేదు. ఎందుకు మరి నే నీ హడావుడిగా కలతపడిన మనస్సుతో వాళ్ళతో చెప్పకుండానైనా లేచిరావడమూ! ఆమె గోపాల్‌తో మాటాడడము తప్పనా లేక అతను విమీతో మాటాడకూడదనా ...... విమీ అతన్ని అంత పొగిడింది, ఆతని అందాన్ని, నాజూకుదనాన్ని, అటువంటి వానితో విమీ యెందుకు మాటాడడమనా ......విమీ అతన్ని పొగుడుతూ చిన్నప్పటికబుర్లు చెపితే యిప్పుడేగా సంతోషించా. మళ్ళీ యింతలో యీ కలత యెందుకు......అతను, అంత అందమైన మనిషి, అంత ఆకర్షణీయమైన మనిషి విమీతో

మాటాడితే ఆమెమనస్సు తనవైపు తిప్పివేసుకొంటా డనా. లేకపోతే సౌందర్యరాశియైన నా విమలతో మాటాడి ఆమె స్నేహము ఆనందిస్తూ అటువంటి నా విమల నిరుపమానమైన అందము చూస్తున్నాడనా ?——ఛీ ! ఏమిటీ పిచ్చిఆలోచనలు !

మొత్తానికి స్త్రీలవిషయమై సంకుచితముగాను, క్రూరము గాను, నీచముగాను ప్రవర్తించే హిందూకుటుంబములో పుట్టి నందుకు దానియొక్క బలం చూపించక పోవడములా, బ్రాహ్మ సమాజమువంటి విశాలభావాలు మెరుస్తూవున్న మతం స్వీకరించినా, ఆ ఉత్కృష్టమతం యొక్క ఆదర్శాలు పూర్తిగా కోరి తృప్తిదీరా హృదయములో జీర్ణము చేసు కొన్నా. దయానంద, వివేకానంద, కేశవబాబు— యిటు వంటి మహాపురుషుల జీవితాలు, అమృతగుళికలవంటి మహా గ్రంధాలు పఠించినా కూడా యింకా యిట్టి సంకుచితమే. అంతదాకా యెందుకు పూర్వుల్లోమాత్రం లేరూ, స్వేచ్ఛా మూర్తులు ! సత్యభామ, దమయంతి, సావిత్రి, ద్రౌపది, రాధ- వీళ్ళందరినీ హృదయంలో యెక్కించివేసి వీరికి అగ్ర స్థాన మిచ్చి మననము చేస్తూవుంటానే— అయితేమాత్రమేం, అదంతా గడిచిపోయిన కలలాగా అయిపోయిందికామాను యింకోయుగం వృత్తాంతము కావడముచేత. అయినా యీయుగంలో చుక్కాని మారిపోయిందిగా, మొత్తానికి యీపాడుశరీరములో ప్రవహిస్తూవున్న యీయుగపుపెద్దల జీవంలేని—జీవంలేకపోతే పోనీ, క్రూరమైన, నీచమైన, బురద

వంటి రక్తం తనప్రతిభ చూపించుకొంది. అందుకే యీవెర్రి అసహానమూ, ఈర్ష్య, కలత పవిత్రమైన భార్య యింకొక పురుషుడితో మాటాడుతుంటే. లేకపోతే యేమిటి యీపిచ్చి తనం—ఆమె అతనికి కనిపించకూడదనా అతను ఆమెకు కని పెంచకూడదనా చిన్నప్పటి స్నేహితులైనాకూడా!

అయినా యీ అసహానమంత మహాఘోరమైన పాపం, శిక్ష యింకొకటిలేదు. అసహానానికి శిక్ష వెంటనే జరిగిపోతూ వుంది— కలత, చీకటి, విచారము. ఇంతవరకూ ఆమెతో అంతచనువుగా, ప్రేమగా, మాట్లాడి, ఆమెకూడా అంత నిష్కల్మషంగా ప్రేమ నిధిలాగా మనస్సువిప్పిచూపితే చూచి, వొకరికొకరము హృదయాలు విప్పిచూపుకుంటూ, వొకరి హృదయపాత్రలో ప్రేమామృతం యింకొకరము సంతోషముతో తృప్తితీర త్రాగి స్వర్గీయానందము అనుభవిస్తూ, ఒక్కహృదయం, ఒక్క ఆత్మ అయిపోయికూడా యింత ఘోరమా నేను చేసేది? యింతకన్నా ఘోరమైన పాపముందా సమస్తము నాకు అర్పించివేసి మహాత్యాగశీల, ప్రణయశీల అయిన విఫీ యింకొక పురుషునితో మాటాడినంతమాత్రాన అసహానమూ, ఈర్ష్యయూ, ఉత్తలపాటూ, చిడిముడిపాటూ! యెందుకిదంతా తెలివితక్కువ, అజ్ఞానంకాకపోతే.

వడిగా పరుగులెత్తుచున్న రక్తము విచ్చియున్న ఆర్ద్ర హృది, అనంతమధురసుందర భావప్రకాశితములైన తరళనేత్ర ములు — చూచినాడు; మరల నింకొకసారి అనంతమైన ఆకా

శేము, సువిశాలమైన సముద్రము, ఎగిరిపడుచున్న పెద్ద పెద్ద కెరటములు, గంభీరమైన యెత్తైన పర్వతపంక్తులు, ఉదయించుచున్న చందమామ నిశ్చలుడై పోయినా డతను కొంతిసేపు :

"ఎక్కడచూచినా ఉత్సాహము, ఆనందము, సౌందర్యము, మాధుర్యము. గొప్పగొప్ప భావాలతో మెరిసిపోతూ వున్న సృష్టిలోని తునకలు...ఎందుకీ నా కొక్కనికీ యీ కలత, అసమానము—కేవలం వ్యామోహం......"

ఒక్కసారిగా ఆవేశప్రపూరితమైన అతనిచూపు సముద్రపు టొడ్డున యిసుక తిన్నెలపై ఆనందమోహనంగాస్తూ ఆడుకొనుచున్న బాలికాబాలకులవైపు, పెనుసలు పగునలుగా కూర్చుండి ఆ యానందసమయమున తియ్యని కలలాగు నవ్వులుచ్చుచున్న యువతీయువకులవైపు పరుగెత్తి ది. వెంటనే యెదోవిధముగానున్న చూపు చటుక్కున భావగర్భితమై పోయినది: మరల సముద్రము మీదుగా దృష్టి ప్రసరించినాడు.

"అబ్బా సముద్రం.. ..ఎంత విశాలం . ...ఎంత ఆనందం......దానికేసిచూసి వొడ్డున ఆడుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ ఉన్న వీళ్ళనుచూస్తే యెల్లావున్నారూ! పిచ్చుకల్లాగా యిసుకరేణువుల్లాగా......ఆమహాశక్తి, ఎదో ఆలోచన కందని రూపం ముందు మనం... . పసిపాపలము...... ఆ మహానంతశక్తి యే మనుకుంటూ వుంటుందో వీళ్ళందరినీ చూసి.. ... ప్రేమవర్షం యేకధారగా కురిపిస్తూవుంది. అమృతంతో నింపివేస్తూంది లోకమంతా......గ్రహిస్తూందా

లోకం......చెరుపుకుంటున్నాం, వచ్చిన పని మరచి పోతున్నాం ...... అంతా స్వప్నంలాగా సన్నని మబ్బుతెర లాగావుంది ...ఏమిటో తట్టుతూంది, ఏమిటో చెపుతూంది గాలి, తరంగాల గుసగుసలూ, వెన్నెలా, మబ్బుతునకలూ. ... ఏమని బోధపడడములేదే అంతా ఆనందం, అంతా అమృతం అంతా మహోన్నత ప్రవాహంగా ప్రవహించిపోతూంది ..... మరి యేమిచేస్తూంది లోకం, మరచిపోయింది తన్ను తానే అధఃపాతాళానికి కూలిపోతూంది...ఆనందంకోసం, అమృతంలో మునిగి తేలడానికి, ప్రేమప్రవాహంలో దానితో పాటే ఎడిఎడిగా కొట్టుకుపోవడానికి తనకి కాళ్ళు వచ్చిందని ... మరచిపోయింది వెర్రిలోకం.

తెలుసును, యిప్పుడు తెలుస్తూంది. ఎందుకింత వెర్రిగా కలవరపడ్డాను ఆమె చిననాటి స్నేహితునితో మాట్లాడినంత మాత్రాన, ఇంకేముంది యింతకన్నా తెలివితక్కువ"

ఇంతలో సేవకుడు తీసుకొనివచ్చి గులాబీపూలు ఇచ్చినాడు రమణకు విచియానీ పంపినవి. రమణ సాయంకాలము విచియానీతో ప్రతిరోజు షికారు వచ్చినప్పుడు తనచేతులలో గులాబిపూలు పట్టుకొని పరిమళ మాఘ్రాణించుచు వచ్చుట మామూలు. నేడాతడు పువ్వులు తెచ్చుకొనుట మరచిపోయి వచ్చుటచేత ఆమె పంపినది వానిని. సేవకుడు చెప్పినాడిట్లు:

"అమ్మగారు పావుగంటలో వస్తానని చెప్పమన్నారు గోపాల్‌గారితో కలిసి." — వాడు వెళ్ళిపోయినాడు.

మరల ఆలోచనలో మునిగిపోయినాడు రమణ ఆతీంగా, పువ్వులు ప్రశాంతతరళదృక్కులతో వీక్షించి; అప్పు డాతని లేతహృదయము లోలోపనే రహస్యముగా బాష్పబిందువుల విడిచినది :

"యింత సౌందర్యం, యింత ఆకర్షణా, యింత లాలిత్యము యెందుకు వీటికి వూరికినే నిరుపయోగంగా నిరర్థకంగా వీటి కింత చక్కని రూపు, మోహనత్వము అబ్బంగా, తరతరాలు గడిచి. యీ మార్పు యెందుకని, దినదినము ఒక్కొక్క అడుగు ముందు వేసి సృష్టిలోని ప్రతివస్తువు సాంగము కావడా నికి యేదో ప్రయత్నము జరగడంలేదూ! యీ సంపూర్ణ త్వానికి ముందునడక దేనికోసం...ఆనందం, ఆనందం, మరి మానవు డేమిచేస్తున్నాడు. రోజురోజు అభివృద్ధి పొందడానికి బదులు, ఆనందం అనుభవిస్తున్నాడా! నామట్టుకు నేనేమి చేస్తున్నా? ఆమె సౌందర్య మాలోచించిపోతాడేమో ననేగా, ఆమెతో సంభాషించడమువల్ల కలిగే ఆనందము ఆత డనుభవించి పోతాడనేగా యింత వ్యాకులపడ్డాను యింత సేపటినుంచీ. ఈ గులాబిపువ్వులు పెట్టిలో పెట్టి దాచి యెవరూ చూడకూడదు నే నొక్కణ్ణే తప్పు అంటే, న్యాయ్యం వుంటుంది. యీనాడాల్ఫిన్సునోజు అందము, యీ మెరుస్తూ సుఖం పండుగచేసే సముద్రము, యీ దివ్యసందేశాలు పంపే రత్నాల తారలు, చలువవెన్నెలమూలంగా ఆనందప్రవాహం ప్రసవింపచేస్తున్న చందమామ, ప్రకృతికాంత నిత్యశుభానంద సమ

యంలో పరవశన్లై విడిచే నిశ్వాసాలు — ఎవరూ ఆనందించ కూడదంటే యెల్లావుంటుంది? అంతకన్న అజ్ఞానముందా? యి వన్నీ యిల్లా వుండగా గులాబిపువ్వుల్ని పెట్టిలో పెట్టి దాయడము — క్రూరం, నీచం, వైరీతంం కాదూ?

ఇంలా ఆలోచిస్తూ నె నేమి చేశాను యిందాకటనుంచీ! ఆమెతో బయటికి షికారు స్తాను. సముద్ర మొడ్డున తిరుగు తాము; వెన్నెల్లో యీదుతాము సముద్రపు చేపల్లాగు; కాని, యింటిలోకి ఒక స్నేహితుడువచ్చి మాట్లాడితే మళ్లా అసూయా, అసహనమూ ..అదికాదు చిన్నప్పటి స్నేహితు డని ఆమెకి...ఛీ, యేమి చిన్నప్పటి స్నేహితుడైతే! యిల్లాగే తెలివితక్కువచేతే చెరుపుకుంటాము, నలిపివేస్తాము, జీవన పుష్పాన్ని. ఇంతకన్నా ఘోరముందా ఆమె నడిసముద్రములో అట్టడుగున బ్రతకాలి అనడముకంటే, యిప్పుడైనా మెలకువ కలిగి ఆమె వచ్చినప్పుడామెదగ్గర చెప్పివేయాలి యీ కలవర మంతా. లేకపోతే యిది మళ్ళా యెప్పుడైనా తలచూపడానికి అవకాశము దొరుకుతుంది. ఒక్కసారి ఆమెముందు అనుతాప పడితేనేకాని నా విధ్యుక్తధర్మము నేను నెరవేర్చుకున్నట్లు కాదు...తుపానుకు ఆకులు రాలినయి. మళ్లా చిగురుస్తూ వుంది. జోగుముని వర్షం కురిస్తే ధూళిదూసరి కొట్టుకుపోయి మార్గము అద్దంలాగా తయారయింది......అదుగో తరంగా లలో చంద్రుడు, చుక్కలు తునకలు తునకలుగా కనిపిస్తూ వున్నా అల్లాగే మెరిసిపోతూవున్నాయి అనంతాకాశములో అవి చలనము, కళంకమూ లేకుండా ... ”

సముద్ర నిశ్వాసములలో ఆమె చీరచెరగు ముచ్చటగా ఎగురుచున్నది. వేణుగోపాల్ [illegible] చిన్నగా నవ్వు చున్నాడు. ఆమె అతనివంక, [illegible] గంభీరము [illegible] చున్న [illegible] వైపు చూస్తూ [illegible] చిన్నలాలతోనే జవాబుచెప్పుచున్నది. రమణ వెన్నెలలో మెరిసిపోవుచున్న దరహాసముతోడనే వారి సమర్పించి, అందరును కలిసి [illegible] బద్దెలుపైకి [illegible] వెళ్ళినారు.

“ గోపాల్‌గారు, మీరు మాతో ఎలాగో [illegible] నసవేయడ మెందుకు, యిక్కడికే తిన్నగా రావలసింది” అన్నాడు రమణ.

“ఇప్పుడైతే నేమిలెండి, చీటీపంపి సామానూ తెప్పించి వేద్దాము యింక యిక్కడే వుండిపోతాము.” అన్నది వివియానీ. వేణుగోపాల్ నవ్వుచు ఊరకున్నాడు.

“ఏమండీ, వివీ యేమిచెవుతూంది యింత సేపు.” అన్నాడు రమణ నగుమోముతో.

“మీకెందుకూ? ఎన్నికబుర్లు చెప్పుకున్నామనుకున్నా రేమిటి, గోపాలన్నా” ఉప్పొంగిపోవుచున్న ఉత్సాహముతో అన్నది వివియానీ.

“మాసుబ్బులు అందరిలాగా కాదండి చిన్నప్పుడుకూడా అంతే —”

“అదుగో మళ్లా ఆపేరుతో పిలుస్తున్నారు. వివీ అనాలి.”

గోపాల్ నవ్వుచు... “అల్లాగే అంటాలెండి కాని—బాల్యం సముద్ర ప్రయాణంలాంటిదండీ. ఎంతముచ్చటగావుంటుం దను

కున్నారు స్త్రీమరులో వున్నప్పుడు నలువైపులా స్వప్నంలాగా సముద్రం, అప్పుడప్పుడు రెండుమూడు పిట్టలు, అల్లా వుంటుంది చిన్నప్పుడు అటువంటి బాల్యంలో యీమె పొందిన ఆనందాని కన్నా, అప్పుడు తనలో మిళితంచేసుకున్న అమాయికత్వాని కన్నా, అవి తలుచుకొని యిప్పుడీమె పొందే సంతోషము ఎన్నోరెట్లు అధికంగావుంది. అంతేనండి కొందరిస్వభావాలు. ఒకసమయంలో తాము అనుభవించే సంతోషముకంటే, అది గడిచిపోయిన తర్వాత వాటిని తలుచుకొని, నెమరువేసుకొని, ఆ కాలాన్ని దూరంగా వున్నట్టు భావించుకొని యెన్నోరెట్లు ఆనందం, ఉత్సాహము పొందుతారు కొందరు. ఈమెకూడా అంతేనండి. ఏవేవో చిన్నప్పటి సంగతులు వొకటితర్వాత వొకటి తియ్యనికలల్లాగు జ్ఞాపకమొస్తూవుంటే మాటాడుతూ కూర్చుండిపోయాము.”

“అవునండీ, నాకొక్కప్పుడదే విచిత్రముగా కనిపిస్తుంది. మామూలుగానే మనముచూసే వస్తువుల్ని యేచిత్రకారుడో, యేకవో, కుంచెతీసుకునో, లేఖినితోటో చిత్రించితే వాటికెంతో ముచ్చటైన అందము వస్తుంది. అల్లాగే అయివుంటుంది యిది కూడాను, గడచిపోయిన సంగతులు మననము చేసుకోవడము వల్లకలిగే ఆనందం, ఉత్సాహము అనిపిస్తుంది. అవునండీ మనలో కవిహృదయము లేకపోయినా గడచిన సంగతులు కలల్లాగు జ్ఞాపకమువచ్చి భావించుకుంటూవుంటే కవికి, చిత్రకారుడికి

ఉండే మెదోశక్తి మనకుకూడా తనంతతానే కలుగుతుందను కుంటా. ఏమంటావు, వివి ”

“ అయి వుంటుంద ” అన్నది ఆమె అమాయికపు పసిపావ వలె నవ్వుచు.

ఇంక నేమేమో మాట్లాడుకొనుచు, చలువ వెన్నెల, గభీర పర్వతములు, వాసిపైని పెద్దపెద్ద తెల్లని మేఘములు ఆనందిం చుచు, ఒకొక్కప్పుడు ఏబ్బుతునుకలపై మెరియుచున్న చంద మామ చల్లని చూపులు గాంచుచు, తమకు తెలియకుండగనే శ్రోత్రపర్వ మొనర్చుచున్న తరంగముల 'హోరు' తెలిసికొన కుండగనే మెల్లగా నడచుచు వారు రైలుబద్దీలకోస మేర్పరుప బడిన లోయ సమీపించినారు.

ఆగువ కెదురుగనున్న లోయ తోట, తోటకిరు కెలంకుల యెత్తైన మనోహరమైన పర్వతములు, వీనిముందు విశాలమైన కాలువ, ఆనీరమున ప్రతిబింబించుచున్న సుధాకరుని మనో హరమైన ప్రతిరూపు, ఒకవైపు ఘోషిల్లుచున్న సముద్రము, మఱొకవైపు నిశ్శబ్దములై గభీరముగనున్న పర్వతశ్రేణి - యివ న్నియు గాంచి వేణుగోపాల్ నిస్తబ్ధుడై నిలువబడిపోయినాడు. అటులనే చటాలున నిలువబడిపోయి తన్మయానందమున ఆ యనంతసృష్టిసౌందర్యము నీక్షించుచు ముగ్ధుడైపోయినాడతడు.

రమణ వివియానీ భుజముపై చేయివైచి లోయలోనికి కొంత దూరము తీసికొనివెళ్ళి ఆమెకోమలహస్తముల కేల గీలించి పైకి దృష్టి పరికించినాడు.

ఆ యెత్తైన పర్వతమునందు తా నెంత...గభీరదృష్టితో తమకు రెండువైపుల సమీపముగానేయున్న పర్వతము చూచినాడతడు. హృదయము చలించినది; వేగ మినుమడించి నది. ఇట్లులన్నాడు గభీరవదనమున సన్నని కంఠముతో రమణ :

"వినీ, ఏమిచెప్పను! హృదయము తరుక్కుపోతూంది. యింతసేపటినుంచి హృదయంలో తుపాను పుట్టింది. మన ప్రేమ లతకు తుపానుదెబ్బ బాగా తగిలింది. కొన్ని ఆకులు రాలి పోయినవి. అయితే నేమి ధన్యుణ్ణి, రాలిపోయిన ఆకులు మళ్లా తీగకే యెరువుగా మారిపోయినవి......"

వినియోనీ కిది యంతయు నేమిటో బోధపడలేదు. ఆమె తెచ్చుకొనిన నవ్వుతోడనే :

"ఇదంతా నాకేమీ అర్థము కావడము లేదండీ, క్షమించండి" అన్నది.

"అయితే చెప్పుతాను విను. నువ్వు గోపాల్‌గారితో మాటాడుతూంటే యెందుకో వెర్రి అసహనము కలిగింది. ఏమిటీ వెర్రితనమంతా అని ఆలోచించా. అంతకన్నా మంచి భావా లెల్లాగుకలుగుతవి యినుపమరలవంటి పూర్వుల రక్తము యీరక్తంలో ప్రవహిస్తూ వున్నప్పుడు అనుకున్నా...యిప్పు డెంతకూ చెప్పవచ్చే దేమిటంటే ఆ అసహనము, అసూయ ఘోర పాపమని గ్రహించా. అవి యెంత తేలికగా వచ్చినయ్యో అంత తేలికగా కాకపోయినా వాటిని వెంటనే పాతమార్చి వేశా...యీవిషయము నీతో చెప్పి మన్నించమని కోరవలె

నని మనస్సు యిందాకటనుంచి తహతహ లాడింది. అటువంటి ఘోరపాపానికి పరిహారము అయిపోయింది...మన్నించాలన కుంటూ..."

వివియానీ నిర్విణ్ణయై, నిస్తబ్ధయై నిలువబడి నిలిచిపోయినది ఒక్క రెండు నిముసము లటులనే ఆమెకనులు పెద్దవి చేసి తదేక దృష్టితో శూన్యహృదయముతో పతివైపు చూచినది. ఆమెకు తెలియకుండగనే ఒకటిరెండు బిందువు లామె కనుకొలంకుల నుండి జారి పడినవి. ఒక్క నిశ్వాసము విడిచి :

"మీవంటి పతి దొరకడము నిజంగా నా అదృష్టము..." అని గుటక మ్రింగిన దామె.

రెండు నిముసములు వారటులనే ఒకరిహస్తము నొకరు పట్టుకొని ఆకొండనడుమ ప్రతిమారూపమున నిలుచుండిపోయినారు.

కొంతసేపటికి వివియానీ తేరుకొని మృదుకంఠముతో :

"గోపాల్ గారు, వెళ్లుదాము రండి" అన్నది.

రాజహంస

తళతళ మెరిసిపోవుచున్న ఎత్తయిన గంభీరమైనమంచు కొండలు వరుసలుదీరి యున్నవి. కొండల నడుమ నుండి సూర్య రశ్మిప్రకాశమై ప్రవహించుచున్న తేజోవంతమైన సుస్నిగ్ధజలవాహిని వచ్చి సరోవరమున గలియుచున్నది. ఆ విశాలసరోవరమున వివిధ వర్ణముల వికసితపద్మములు—నలుపు, తెలుపు, యెరుపు పసుపు. తీరమున అనేక జాతులపూలచెట్లు, తీగెలు, వాని వెనుక దట్టమైన కారడవి. మంచుకొండలపై సూర్యప్రకాశము దేదీప్యమానమై వెలుగొందుచున్నది. సరోవరము, కమలములు చల్లనిమబ్బునీడలో నున్నవి లతానికుంజములపై జల్లువాన కురియుచున్నది. కాననమున కారుమబ్బులు, ఉరుములు, మెఱుపులు, ప్రబలమైనతుపాను, గాఢాంధకారము.

విమలాకాశమున నెలబాలునివలె సదమలసరోవరమున రాజ హంస మనోహరముగా మధురసుందరముగా విరుల వలపులో వియత్తరంగములపై దేలియాడుచున్నది. గగనసీమను ప్రకా శించుచున్న ఇంద్రధనువు జూచి ననుగాంచి రాజహంస చిఱు నగవుతో నిట్లు లన్నది: "ఓ మానవుడా! చూచినావా, ఆ మెరిసిపోవుచున్న నక్షత్రాలు, వింతరంగుల ఇంద్రధనుస్సు, ఈ విశాలమైన సుందరమైన ప్రకృతి: దీని ముందు నీ వెంతటి వాడవు! ఈ మాత్రమున నే నీవు క్రిందుమీదు తెలియక ఎగసి పడిపోవుచున్నావే! నిను పోల్చుటకే విశాలసృష్టిలో ఇంకే

మియు లేదని నీవు విర్రవీగుచున్నావు. ఒక సారి కనులు తెరిచి నిన్ను నీవే చూచుకొనుము, ఎట్లుందువో !"

నేను ఆకసమునైపు చూచితిని. ఒకేసారి సూర్యదీప్తి, నక్షత్రములు, ఇంద్రధనుస్సు ప్రకాశించుచున్నవి తర్వాత నన్ను నేను గాంచితిని. అప్పుడు నే నొక రేణువు రూపము దాల్చితిని. నవ్వుచు: "అవును రాజహంస! మానవుడు ఈ అనంతమైన సృష్టిలో కించి న్మాత్రుడే"

రాజహంస:— ఇది తెలిసికోలేక మానవజాతి మాయంతటివారు లేరుఅని విర్రవీగుచున్నది అణువుకంటె అణుమాత్రమైనమానవుడు తనబుద్ధి, ప్రతిభ చూచి సిగ్గుపడి నవ్వుకొనుటకు బదులు ఉన్మత్తుడై సంతోషపడుట, గర్వపడుటచూచి నాకు జాలికలుగుచున్నది ! స్త్రీనిచూచి, స్త్రీరూపముచూచి మీరు పొందే సంతోషము, వర్ణించే వర్ణనలుచూచితే నవ్వువచ్చును. సృష్టి అంతట మగజాతియే సౌందర్యమైనదయి యుంటే మీరు మానవులు గ్రుడ్డివారైపోయి స్త్రీకి మోకరించి పూజసేయుచున్నారెందులకు ? ఈ కమలములవంక చూడుము. నీ స్త్రీని ఊహించుకొమ్ము. వీని సౌందర్యము, మనోహరత్వము ముందు స్త్రీయెంతటిదో ఊహించుకొమ్ము. ఒక్కలేతఆకుకున్న లావణ్యమైనా ఉండదే నీ స్త్రీకి? మరెందుకు మానవుడు స్త్రీముందు కుంగిపోవుచున్నాడు, ఆమెచూపులో కరిగిపోవుచున్నాడు, ఆమె తాకితే పులకరించిపోవుచున్నాడు ? వినుము. నీ స్త్రీ కల్పనామయి వేరేమియుకాదు ; కాజాలదు. ఆమె యే రూపముతో

పుట్టినదో ఆరూపమును మరచి మానవుడు క్రొత్తరూపమును సృష్టించుకొనుచున్నాడు. ఆరూపము కొన్నాళ్ళకు భగ్నమై పోతే ఆతడు కూలిపోవుచున్నాడు. ఇదిమరిచిపోయి అంతలోనే నాయంతటివాడు లేడు అని గర్వించుచున్నాడు. ప్రకృతిని జయించగలుగుచున్నానని వొళ్ళు మరచుచున్నాడు. అయ్యో! వెఱ్ఱిమానవుడా! నీ వేమి మహత్తరకార్యము చేయగలిగినావు!

నేను :— రాజహంసా! అట్లుచెప్పెద వేమి? మానవుడు నీటిని, గాలిని — పంచభూతములను జయించగల్గినాడు. మానవున కవి యిప్పుడు దాస్యము చేయుచున్నవి. అంతకంటె ఇంకేమి కావలయును ?

రాజహంస :— ఓయి వెఱ్ఱివాడా ! ఇంతమాత్రమునకు సంతోషించుచున్నావా? నీ సంకుచితమైన మనస్సు, హృదయం చూచితే నవ్వువచ్చుచున్నదినుమా ! మానవుడు సృష్టిలోనికి వచ్చి యెన్నినాళ్ళయినది ? కొన్నివేలు, లక్షలు, కోట్లు సంవత్సరము లైనవే ఇంతకాలమునకు మీరుచేయగలిగిన పనులు, చూడుము. కాకి,పిచ్చుక సృష్టి ప్రారంభమునుండియే చేయగలుగుచున్నవి. గాలిలో, నీటిపై, భూమిమీద ప్రయాణము చేయ గలుగుచున్నానని నీకుగర్వము. పిచ్చుక ఆనాడే యివన్నియు, నేర్చుకొన్నదని మరిచిపోయితివి, ఏమేమో పంచభూతములను జయించినానని గర్వించుచున్నావే కాని నీకు ఆనందమేది? తృప్తి యేది? క్రిమికీటకాదులు కలనైనా యెరుగని రోగములతో, బాధలతో నీవు బాధితుడ వగుచున్నావు. ఆబాధలు, రోగ

ములు మాన్పుకొనుటకై నానాకష్టములుపడి పక్షుల, జంతువుల మలమూత్రములుకూడ నీవు భక్షించుచున్నావు. ఎన్ని చేసినను స్వేచ్ఛగా ఆనందవశమై తిరిగే పక్షి కున్న ఆనందము నీ కేది? ఉత్సాహము నీ కేది? శాంతి నీ కేది? అనేక బంధనములలో నీవు కట్టుపడిపోయియున్నావు. నీకు స్వేచ్ఛలేదు. నీవు బంధితుడవు.

నేను :— మానవుడు బంధితు డెట్లగును? ఇదివరకే కొన్ని దేశములు స్వేచ్ఛకై పోరాడి సంపాదించుకొన్నవి దానిని. కొందరింకను ప్రయత్నము చేయుచున్నారు : కొన్నాళ్ళలోకి తెచ్చుకొందురు, వారుకూడా.

రాజహంస:— ఓయి వెర్రివాడా! మానవుడు స్వేచ్ఛ అంటే యేమిటో యెరుగడు. అది యిట్టిదని చెప్పుటకు నలవు పడదని. మాటలకు దానిని తెలిపెశక్తి లేదు. సృష్టిని గమనింపుము శ్రద్ధతో, సూక్ష్మబుద్ధితో. స్వేచ్ఛ అంటే నీ కేమిటో కొంత వరకైనా తెలియగలదు. స్వేచ్ఛవిషయములో మీరు పుట్టుకలోనే జంతువులకంటె, పక్షులకంటె తక్కువదశలో సృష్టింపబడినారు. స్వేచ్ఛగా తిరిగే ఆ తేనెటీగను చూడుము. అది ప్రకృతిలో విలీనమైపోయి స్వేచ్ఛగా తిరుగాడుచున్నది. మానవుడో ప్రకృతి నతిక్రమించుట స్వేచ్ఛ అని పొరబడుచున్నాడు. ఆ రీతిగా అతడు సేచ్ఛను పొందజాలడు. అతడు ప్రకృతిలో విలీనమైనప్పుడే ఆ యానందము నందుకొని ఆనందించగలడు.

నేను.— ఆయానందముకొరకే మేము లోతుగాఆలోచించి శాస్త్రములు, నియమములు ఏర్పరచుకొని యున్నాము.

శాంతిజీవనము పొందుచున్నాము. జంతువులు, పక్షులు—వాటికి నీతినియమములు లేవు. మహాపాప భూయిష్ఠమైనది వాటి బ్రదుకు.

రాజహంస :—ఓయి, అజ్ఞానుడా ! మీశాస్త్రములు, కట్టుబాట్లు తీసుకువెళ్ళి నడిసముద్రములో పారవేయుము. అప్పుడే నీవు స్వచ్ఛమైన పునర్జన్మ యెత్తగలిగెదవు. అంతవరకు నీకు పాతాళమే గతి : నీవు మానవజాతిఅంతా ఒక్కటేఅని మరచిపోయి నీలో నీవు అనేకజాతులు, కులాలు, మతాలు, రంగులు తెచ్చుకొన్నావు. అనేక వెర్రిఆచారాలు, అనేక పిచ్చికట్టుబాట్లు, అనేక అర్థములేనిరీతులు ఏర్పరచుకొన్నావు. మీలో ఒకరి జాతి, శాస్త్రము, కట్టుబాటు అంటే యింకొకరికి అసహ్యము. ఒకరినిచూచి యింకొకరు సహించలేరు. మానవుని వదలివేసిన సృష్టిలో ఈవెర్రితనము, అజ్ఞానము, పాపము ఇంకెచ్చటను లేవు. మేము సృష్టిఅయిననాడు ఎట్లున్నాము! ఈనాడు కూడా అటులనే స్వచ్ఛమైన జీవనము గడుపుచున్నాము. మానవుడో అతడు సృష్టిఅయినప్పటి జీవితము ఇప్పుడు తారుమారైపోయినది. తాను తెలివిగలవాడననుకొని వెర్రిమొర్రి గ్రంథాలు, కట్టుబాట్లు, జాతులు తనలో తానే సృష్టించుకొని తననాశనమునకు తానే కారకుడైపోయినాడు. శాంతి, ఆనందము, ప్రేమ వీనిని మరిచిపోయి వానిని చేతులార పోగొట్టుకొని యిప్పుడు తాను పొందుచున్నదే శాంతిఅనీ, ఆనందమనీ, ప్రేమఅనీ భ్రమించిపోవుచున్నాడు. వీని నిజరూపము నాతడు

కోల్పోయినాడు. ప్రకృతికి ఆతడు దూరమైపోయినాడు. తన సృష్టి వేరుపరచుకొన్నాడు. ఆ కలుషకూపములోపడి అదియే మహాస్వర్గమని మురియుచున్నాడు. సృష్టిఆరంభమునుండి యెట్లు లానందమూర్తులమైయున్నామో నేడును అటులనే మూర్ఖులు లేక యున్న మేము ఆ కూపకలుషనివాసులను దుఃఖమూర్తులను చూచి జాలిపడుచున్నాము. అకల్మషమైన, ఆనందమయమైన, శాంతిమయమైన, ప్రేమమయమైన సృష్టిజీవనము మూలో మూర్తీభవించి యున్నది. నిజమైన స్వేచ్ఛకు భంగము కలిగించని నియమములు, శాస్త్రములు మారక్తములో ప్రకాశించుచున్నవి. మా జీవనములో వికసించుచున్నవి. వెర్రి శాస్త్రములు, అర్థములేని కట్టుబాట్లు మేమిక సృష్టించుకో వలసిన అవసరములేదు. ప్రకృతియే మేము, మేమే ప్రకృతి అయియున్నపుడు — అంతటా ఆనందము, శాంతి, ప్రేమ. మీవలె మాకు దుఃఖము, అశాంతి, ఈర్ష్య లేవు. మీరు ప్రకృతికి దూరమైపోవుటలోనే పతితులైపోయినారు. అంతను మించి మీశాస్త్రములు, కట్టుబాట్లు సృష్టించుకొనుటతో మరింత పతితులైపోయినారు మీకు ఇంతలో ముక్తిలేదు ఇక పాపపుణ్యములంటువా! మీలో ఒకనికి పాపమైనది మరొకనికి పుణ్యమగుచున్నది; ఒకనికి అవినీతియైనదియే ఒకనికి నీతి యగుచున్నది. ఇంకెట్లు పాపపుణ్యములకు, ధర్మాధర్మములకు, నీతి అవినీతులకు నీవు అర్థము చెప్పగలవు? ఈ పాపపుణ్యభేదము నీవు సృష్టి నతిక్రమించి సృష్టించుకొన్నావు.

వేరొకడు ఇంకొకరీతిగా ధర్మాధర్మ విచక్షణ చేసికొను చున్నాడు. ఇది నీతి, అది అవినీతి అని నిర్ధారణగా మానవునకు చెప్పేశక్తిలేదు. మాకో రెంటిభేదమెలేదు: మాకు పాపము లేదు, పుణ్యములేదు. ఈ రెంటికిని అతీతులమే మేము. ఇకెట్టులు మాది పాపభూయిష్ఠమైనజీవన మనగలవు? ఓహో! నీదృష్టిలో దేవుడుకూడా పాపియే అగుచున్నాడుగా! అదియే నీసంపూర్ణపతనమునకు కారణమైనది. నీవుఱాయిని పూజించితే పుణ్యమువచ్చుననీ, పామును పూజించితే స్వర్గమువచ్చుననీ మురిసేవాడవు. నామాట నీకేమిబోధపడగలదు? పరమేశ్వరుని ప్రతిబింబమైన ఈ మహాసంతస్సృష్టి కనులయెదుట అద్వితీయమైన తేజస్సుతో, సౌందర్యముతో జీవకళతో ప్రకాశించుచుండగా చూచి ఆనందించి ఆరాధనచేయజాలక నీవు ఱాయిని ఆపాము పూజించుటతో తృప్తిపడుటచూడగా నవ్వువచ్చును. మరియు నీవు ఎదుటనున్న ప్రకృతిసంతానమును ప్రకృతిని చూచి ఆనందించలేక వానిజీవములేని బొమ్మలు, నీ గృహములో పెట్టుకొని మురియుచున్నావు సంకుచితుడవు. ఇంకను సంకుచితుడవై పోయెదవు కొన్ని క్రూర జంతువులను, పక్షులను చంపి వానితో నీవు, నీ స్త్రీ అలంకరించుకొను చున్నారు, అలంకరించుకొని యింతటిసౌందరు లింకెవరును లేరని గర్వపడు చున్నారు. ఓయి వెర్రిమానవుడా! ఒక్కఆకు, ఒక్కపువ్వు తీసికొని వానితో నీ సౌందర్యము, నీ స్త్రీ మనోహరత్వము పోల్చి చూచుకొనుము: నీవు, నీ యలంకారములు వానితో పోల్చుటకైనా అర్హతలేకుండా పోవుచున్నారే! ఇంకను గర్వించెద వెందుకు?

నేను :— రాజహంస! గర్వమున కేమిలెమ్ము. నిజముగునా కాదా మాకు విలువలేని ధనసంపత్తి, స్వచ్ఛమైనకీర్తిసంపత్తి ఉన్నమాట! మీకో అవి యేవి?

రాజహంస :— వినుము! ఆదిలో మానవుడు శాంతప్రేమానందమూర్తిగా రూపమునందినాడు, ఇతర జంతుసంతానము వలెనే. కాని అతడు ధనమనీ, కీర్తిఅనీ వీని సంపాదనకోసము పాటుపడి వీనినిపొంది తన్ను—అంటే తన ఆనందము, ఉత్సాహము, శాంతి, ప్రేమ—కోల్పోయినాడు. అంతటితో అతని నిజరూపము మాసిపోయినది. అతడు కల్పితరూపము పొందినాడు. ధనము, కీర్తి ఎందుకొరకు కావలె నని మానవుడు ప్రయత్నించుచున్నాడు? ఆనందము—సౌఖ్యముకొరకేగదా! కాని యే ధనకీర్తులమూలముగా అతడు ఆనంద సౌఖ్యములను పొందదలచుచున్నాడో వానిమూలముననే ఆ యానందసౌఖ్యముల నాతడు గోల్పోయి పతితుడై తన్ను తాను కోల్పోవుచున్నాడు. తను పుట్టి యున్నాళ్ళయినను తన తప్పు తాను తెలిసికోలేకున్నాడు. మానవుని ప్రపంచమంతయు గెలువనిమ్ము. కాని తన్ను తాను కోల్పోయిన ఆ ప్రపంచముతో అతనికి ప్రయోజన మేమున్నది? ధనకీర్తుల సంపాదనములో అతనికి తీరిక లేదు. తృప్తిలేదు. అందుచేతనే అతడు తన ప్రకృతిసిద్ధమైన ఆనందమును, ఉత్సాహమును, శాంతిని, ప్రేమను కోల్పోవుచున్నాడు. వీనినిగూర్చి ఆలోచించుటకైనా అతనికి సమయము చిక్కదు. వీనికొరకు అతడు తనసౌఖ్యముకూడాపోగొట్టు కొనుచున్నాడు. యుద్ధములుచేసి మనుష్యజాతిని నాశనము చేయుటకుకూడా

అతడు వెనుకాడుటలేదు. పతితుడై పోయినాడు. పతితత్వము నుండి పావనత్వము పొందవలెనంటే అందరకు సరిసమానముగా ధనముండవలెనని మరియొకడనుచున్నాడు. ఆప్రయత్నములో అతడు కొంత సౌఖ్యము నాశనముచేసికొనుచున్నాడు. సరిసమానముగా పంచుకొనినను ప్రకృతి సంతానములో ఉన్న ఆనందము, ఉత్సాహము, శాంతి, ప్రేమ వారిలో కనిపించుటలేదు. మేమో : మాకు ధనముతో, కీర్తితో అవసరములేదు. వీటికి మేము అతీతులమైయున్నాము. అందుచేతనే మేముకూడ మానవునివలె క్రుంగిపోవక మనుష్యులను మేము కోల్పోవక ఆనందమూర్తులమైయున్నాము. మీవలె మేము దానికోసము యుద్ధములుచేసి సరిసమానముగ పంచుకోవలెనని బాధపడము. వానిపై కోరికఉన్నచో మానవునివలెనే మాకును పతిత్వము కలిగియుండెడిది. ఒక్క విషయముచూడుము. మీలో కోటీశ్వరుడుండనిమ్ము. కాని అతనికి ఒక చిలుకకున్న ఆనందము, ఉత్సాహము, శాంతి, ప్రేమ యేవి? అది స్వేచ్ఛగా, మనోరంజకముగా తిని తిరిగి గానముచేయును. అవి అతని కేవి?

నేను :— ఏమైనను ఇహపరసాధన మెరిగినవారము మేము.

రాజహంస :— వెర్రివాడా! పెద్దపెద్దమాటలు మాటాడుచున్నావు. ఇహము, పరము—ఉట్టికెగరలేనిది స్వర్గానికెగిరిందని : ఈలోకము, ఈజీవనము తెలిసికోలేని నీవు ఇచ్చట ఆనందము, సౌఖ్యముపొందని నీవు పరలోకములో నేమిచేయగలిగెదవనేది వెర్రిభ్రమ, ఇప్పుడు ఆనందమున్నదా లేదా అనేది అంత ప్రాముఖ్యమైనవిషయము కాదు. పరలోకానందముకోసము ఇప్పుడు కష్టమనుభవించుతామనేది అంతకంటే నమ్మతగినమాట

కాదు. ఇక్కడ ఇప్పుడే ఆనందించవలె: అప్పుడే నీవు సఫలు
డవు, ధన్యుడవు కాగలవు.

నేను :— రాజహంస! మానవుడు దైవమును తెలిసికొనిన విజ్ఞుడు కాడా మరి!

రాజహంస :— ఏమి? మానవుడా! నీవు దైవమును తెలిసి కొన్నావుగా! ఆకాశము ఎదుట కనిపించుచునే యున్నది. అది అనంతము. దానిని నిరూపణచేయుట నీచేత కాదు. అతులమే దైవము. అయినను—ఇరుగు [illegible] నీవు, ఇరుగుపొరుగు వానిని తెలిసికోలేని నీవు దైవమును కూడ తెలిసి కొనగలవా? అందుకు నీశక్తి చాలదు. అతడు అనంగమూర్తి. ఆనందమునుండియే ఈ సృష్టి వెల్వడుచున్నది. ఆనందము చేతనే [illegible] నడచుచున్నది. అంతట ఆనంద తేజస్సు, ఎటు జూచినను ఆనందామృతమే. ఈ ఆనందమును [illegible] నీ [illegible] అప్పుడు నీకు [illegible] [illegible] విముక్తిర [illegible] [illegible] మెక్కడిది! ...... ఉత్సాహము - ఆనందము - [illegible] ... ..ఆనందించుము—అమృత[illegible]...... [illegible] బ్రతుకుచున్నా[illegible].... .ఎందుకు [illegible]....

* * * *

ఫెళ ఫెళా [illegible] మేఘము [illegible] గట్టిగా ఉరుము [illegible] వల్లనే సృష్టియైన మబ్బుల [illegible] విప్పి వేయుటచూచి సూర్యభగవానుడు నవ్వుచున్నాడు. ఆ నవ్వు వెలుగులో లోకము ఆనందపులకితమైనది.

ప రి వ ర్త న ము

మౌంటురోడ్డులోని 'బసటో' హోటలులో సాయంకాల ఫలాహారము నారగించి యొకరిహోస్టు కొరకు వేచియుండి అప్పుడే బయిటకు వచ్చిన రాధారమణుని, ఆంగ్ల యువతిని ఆనంద పులకిత హృదయంతో గాంచి వీరరాఘవస్వామి ఒక అరనిముసము నిలువబడి 'గుడ్ ఈవినింగు మిస్టర్ రమణ' అని హస్త చాలనము చేసినాడు.

స్వామి 'మిమ్మల్ని చూచి అప్పుడే అయిదు సంవత్సరాలయిందనుకుంటాను. తిరిగి చాలారోజులకు కలిశాము. ఇప్పుడెక్కడుంటున్నారు? ఏమిచేస్తున్నారు?'

రమణ 'మైలాపూరులో ఉంటున్నాను. మూడు నెలల క్రిందటనే యూరోపునుంచి వచ్చాను. ఇకముందుకూడా యిక్కడే ఉంటాను. ఒకసారి మాయింటికి రండి' అని తన భవనముయొక్క వివరములు తెలుపు కార్డు మిత్రునకిచ్చెను. వీరరాఘవస్వామి కార్డుచూచి చిరునవ్వుతో 'అల్లాగా, రమణ! కలియక కలియక చాలరోజులకు కలియుటము శుభవార్త. బాగుంది. తప్పకుండా వస్తాను. రేపు ఆదివారము కూడాను. ఉదయాన్నే వస్తాను.' రమణ 'తప్పకుండా రావాలి సుమా! ఉదయాన్నే కాఫీయేర్పాటుచేస్తాను. అన్నట్టు ఇక్కడ పనేమిటి స్వామి. ప్రమాదవశాత్తు అరవవారిలో కలిసిపోలేదు కదా' ఇరువురు నవ్వుకొన్నారు. ఆంధ్రము తెలియని ఆయాంగ్ల

రమణి వారిసంభాషణ మే విషయమునుగూర్చియో గ్రహిం పకపోయినను వారిరువురు దరహాసితవదనులగుట చూచి తాను కూడ చిరునవ్వునవ్వినది. అప్పుడు ఆ గులాబిపువ్వువంటి చిన్ని నోరు కొంచెము [illegible] వికసించి తెల్లని పైపలువరుస కొంచెలు కనిపించినవి. రాధారమణ తనకెంతో ప్రియమైన ఇట్టి చిఱునగవును, మందమారుతమునకు కదలు గులాబిరేకులవలె కదలుచున్న పై పెదవిని విశాలనేత్రములతో గమనించి, మిత్రుని యెదుటనే ఆచిన్నినోటిని దృష్టులలోడనే ముద్దిడి, స్వామి వైపు తిరిగినాడు.

సన్నని లేతశరీరము—ఆకుపచ్చని పట్టుగౌను చూచి, ఆమె ప్రక్క ఆకసపురంగు సూట్‌లోనున్న రాధారమణను వీక్షించుచున్న స్వామి దృష్టి మరలించుకొన్నాడు.

స్వామి 'లేదు అరవవారిలో కలిసిపోలేను. ఇక్కడొక ఇంగ్లీషు దినపత్రికాలయంలో సహాయ సంపాదకుడుగా ఉంటున్నాను రెండు సంవత్సరాలనుంచి.'

రమణ 'అల్లాగా, నాలుగు నెలలక్రిందట లండను టైమ్సు పత్రికలో వి. ఆర్. స్వామి అనే పేరుతో మనగ్రామజీవనమునకు, నగరజీవనమునకు తారతమ్యం తెలుపుతూ ఏదో వ్యాసం చూచాను. హోటలులో కూర్చుండి నేను, ఇంకొక అమెరికను స్నేహితుడు చాలశ్రద్ధతో చదివాము. అప్పుడు కర్తగురించి ఆలోచనే లేకపోయిందిసుమీ.'

స్వామి హాసవిలసిత గభీరవదనముతో 'అవును నేనే రమణ! గ్రామజీవనంఅంటే జ్ఞాపకంవచ్చింది. నాలుగైదేళ్ళ క్రిందట నేను కలత్తాలో యం. ఏ. చదువుతూ ఉండగా ఒక మిత్రుడు కనిపించి "మన రాధారమణ బి. ఏ. ప్యాసుచేసి సొంత గ్రామంలోనే ఉంటున్నాడు. ఏమో విరాగమెక్కువైందట. సన్యసిస్తాడని అనుకుంటున్నారు" అన్నాడు'

రమణనవ్వుచు 'అవును, నిజమే! రేపువస్తే చరిత్ర చాలా చెప్పవలసివుంది. ఆచరిత్రలో ఈవిషయ మొక ప్రకరణం. స్వామి! రేపు తప్పక రావలిసుమా ఉదయాన్నే!'

స్వామి చిరకాలమునకు గనిపించిన మిత్రునిగాంచి యానం దించుచు 'రమణా, అల్లాగే తప్పకవస్తాను. గుడ్ ఈవ్ నింగ్' అని బసటో హాూటలు ప్రవేశించినాడు.

రమణ, అతని సతీమణి ఆంగ్లరమణి యొకరిచేయి యొకరు పట్టుకొని యొకరి వదనము నొకరు చూచుకొనుచు మెల్లగా మోటారుకారులో గూర్చుండిరి.

సతీమణి చిన్నినగుమోము చూచుచుండగనే రమణకు పూర్వచరిత్రమంతయు కన్నులకు గట్టినట్లయినది.

ఆతనికి తనకనుపాపలో బరుగిడుచున్న మందిరముల విష యమే తెలియలేదు. మందిరముల శూన్యదృష్టితో జూచు చుండగనే తనలో తానిట్లనుకొన్నాడు 'దహనభూమి, మేక పిల్ల — ఈరెండు నాజీవితాన్ని పూర్తిగా మార్చివైచినవి. అప్పుడు నక్షత్రాలు, ఆకాశం, వింతరూపం దాల్చినవి.'

రెండుసంవత్సరములనుండి విస్మృతికుహారమున నడగియున్న భూతకాలచరిత్ర ఒక్కసారిగా తనయంతటానే పుటలు త్రిప్పుకొన్నది. ఎందుకో అకు ?—

రాధారమణకు అకస్మాత్తుగా తన జీవితగగనావధి స్మృతికి వచ్చినది. పరుగిడివచ్చుచున్న భావములను కోపముతో తొలగ వైచినాడు.

పతివదనమున భావపరివర్తనముగాంచి గమణీమణి ఇంగ్లీషున 'ఏమిటి ఆలోచిస్తున్నారు ?' అన్నది.

రమణ నవ్వుచు ఇంగ్లీషున 'బిలవెడ్ లైస్ ! హృదయాలకు భేదంలేనప్పుడు నాకు రహస్యమనేది యెలాఉంటుంది. ఇప్పుడే నీకు చెప్పుదామనుకుంటున్నాను. ఇంతలో అడుగుట కలిగినది'

మోటారు నిశ్శబ్దముగ పరుగిడుచున్నది.

౨

మైలాపూరులో మనోహరోద్యానమునడుమ సుందరభవనము. భవనమంతయు క్రొత్తరకపు వస్తువులతో నలంకరింపబడి యున్నది. భారతదేశమున లభించని వస్తునిచయము — యూరపులో కష్టముపైదొరకు సుందరవస్తువులు. ఎచట నెచట నేవియుండవలెనో నచట నచట లైస్ మృదులహస్తములతో నుంచబడి కనులపండువుగ నున్నవి.

పరిమళవిలసిత తోయములతో స్నానముజేసి అప్పుడే స్నానపుగదినుండి బయిటకువచ్చిన రాధారమణ చేతులలో

మనోజ్ఞముగ నేర్పరుపబడిన గులాబిపూవులగుత్తి జెస్ యుంచి చిరునవ్వు నవ్వినది.

జెస్ 'డ్రెస్సింగు గదిలో దుస్తులుంచినాను రండి'

రమణ ఆమె కోమలకరపల్లవమును బట్టుకొని గదిలోనికి వచ్చి ప్రభాతకాలపు వస్త్రములు ధరించినాడు. జెస్ తాను ఫ్రాన్సు దేశము నుండి తీసికొనివచ్చిన పన్నీరు రమణ కేశములపై జల్లి మెల్లగా తలదువ్వినది

'జెస్ కాశీరత్నం పొదరింటిలో పడకకుర్చీ వేయించినాను. కాఫీతీసికొని వస్తాను మెల్లగా వెళుతూ ఉండండి'

రమణ 'ఇప్పుడప్పుడే వద్దు డియర్! మిత్రుడువచ్చిన తర్వాత మనము ముగ్గురము కూర్చుండి ఆరగించుదాము. నేనువెళ్ళి అక్కడ కూర్చుంటాను. ఈలోపుగా పియోనా వాయించు' అని గులాబి పూలగుత్తి పట్టుకొని ఒయ్యారముగ నడుగు లిడుచు ఉద్యానవనము—'ఆనందనిలయము' ప్రవేశించినాడు.

భవనము చుట్టును విశాలమైన ప్రదేశమున్నది. అందు ప్రహరీ గోడ లోపలిభాగము చుట్టును కొబ్బరిచెట్లును, వానికి అయిదు గజములదూరమున బొగడచెట్లవరుస, తరువాత మామిడిచెట్లు, పిదప వేపచెట్లు, ఆ వృక్షశ్రేణికి కొంతదవ్వున అనేకరకముల లతలు, గులాబిచెట్లు నున్నవి. మధ్య చక్కని చిన్నిబాట లేర్పరుపబడియున్నవి. ఒకపెద్దవేపచెట్టుకొక ఉయ్యెల వ్రేలాడు చున్నది. దానికి సమీపమున చంద్రకాంతశిలావినిర్మిత వేదికలు రెండున్నవి.

రమణ తిన్నగా నొక వకుళవృక్షము దగ్గరకు వెళ్ళి సునిశ్చిత ముగా బొగడపూవులు సేకరించుచు ఇట్లనుకొన్నాడు.

'పరమేశ్వరుడు ఈపూలు ఊరకే సృష్టించలేదు' వెంటనే అతనిలో మఱియొకవ్యక్తి—రూపరహితమైన వ్యక్తి యిమిడి యుంచి యిట్లన్నది 'అవును నిజమే! వీటిని ఆనందముకోసము సృష్టించాడు. పరమేశ్వరుడు తన ఆనందముకొరకే కాదు. తన పిల్లల ఆనందముకొరకు— సచేతనములు, అచేతనములు అయిన బిడ్డలకోసము సృష్టించాను. తనివిదీరా ఆనందించండి అన్నాడు.

'జీవులకు విచారము కలిగితే ఏమి చేయువలె?'

'విచారమా: ఈప్రపంచంలో విచారమెక్కడుంది. విచార మనేది లేనేలేదు. ఒక వేళ జీవులు పరమేశ్వరుడు సృష్టించని విచారాన్ని తాము సృష్టించుకొన్నా, వెనకనుండి ఆనంద మూర్తి చెపుతూనేఉంటాడు. ఏమని? 'నేను ఇందుకోసము సృష్టించలేదు మిమ్మల్ని, ఈవస్తువుల్ని. విచారము కల్పించు కొని పాడైపోకండి. విచారంలోకూడా ఆనందం అనుభవించండి. అంతటా ప్రసరించిఉన్న ఆనందామృతం గ్రోలండి. ఇందుకొరకే మీరు సృష్టింపబడ్డారు.'

రమణ హృదయాంతర్గతమున జరిగిన సంభాషణ పూర్తి యైనది. ఒక్కసారి నలుదిక్కులు దేనికొరకో వెదకుచున్నట్లు చూచినాడతడు. దేదీప్యమానముగా వెలిగిపోవుచున్న ఆకా శము కేసికూడా చూచినాడు. మరలబొగడపూలు తిలకించినాడు.

'నా కీసందేహామెందుకు కలగవలె? ముమ్మాటికినిజము. పరమేశ్వరుడు ఆనందముకోసం సృష్టించాడు ఈలోకము, సూర్యుణ్ణి, చంద్రుణ్ణి, నక్షత్రాలు, ఆకాశము—ఇవన్నీ అందుకే. నా మేః పిల్లచెప్పనే చెప్పిందీసంగతి నాలుగేళ్ళక్రిందట. నాప్రియమైన దేవి శ్మశానమునుంచి ఈవిషయమే చెప్పింది. ఇది ఈనాటి క్రొత్తసంగతికాదు.'

బొగడపూలు పరిమళ మానందముతో నాఘ్రాణించుచు కాశీరత్నము పొదరింట్లోనికి వెళ్ళినాడు రమణ. అచటనొక పడకకుర్చీ, ఒకమేజాచుట్టు నాలుగుమామూలు కుర్చీలునున్నవి. మేజాపై తెల్లని వస్త్రము—దానిపై గాజుతొట్టెలో వివిధ విధసుమములు సమర్పబడియున్నవి. వానిప్రక్క నొక లవండరు సెసా యున్నది. అతడు పడకకుర్చీలోనాసీనుడై గులాబీపూలు మేజాపైనుంచి, బొగడపూలు వాసనచూచుచు లవండరు పైన జల్లుకొన్నాడు.

టెస్ దొరసాని పయోనాపై మధురకంఠమెత్తి పాడుచున్నది. అతని హృదయమున ఆనందసరోవర ముప్పొంగినది. తరంగములు మధురగానమునకు శ్రుతిగలిపినవి. ఉద్యాన మందలి వృక్షములు తీగెలు అన్నియు నానందముతో నాలకించుచున్నట్లున్నవి.

అతడు పడకకుర్చీలో కొంచెముసేపు పరుండి మరల లేచి గులాబి చెట్లవద్దకు వెళ్ళినాడు. ఒకపువ్వు గోసి 'నీ వెందుకు వచ్చావు ఈప్రపంచములోకి? నాకోసమా నాటెస్‌కోసమా—

కాదు, అవును—ఆనందముకోసము, జెస్ మృదుహస్తాలంకరించడానికి.' అనుకొని, యింక గొన్నిపూలు గోసినాడు.

'పొండిమీరు ఆ మధురసంగీతములో మిళితమై పోవుడు. మరల మీతల్లి, భూదేవిదగ్గరకు నెప్పుడు దగ్గరకు వెళ్ళి ఆనంద డోలికలలో ఊగండి. ఆపలగ మానుభవించండి?'

పసిపాపవలె నవ్వినాడతడు. తన అమాయికపుస్థితి చూచి తనకే నవ్వువచ్చినది. మరల నవ్వినాడు. ఆ చిరునగవులో నుదయించిననవ్వు గులాబిపూవులలో సమ్మిళితమై పోయినది.

గులాబిపూలు పట్టుకొని జెస్ ఉన్నగదిలోనికి వెళ్ళినాడు. పూవు లొకచోనుంచి ఆమెకు తెలియకుండగనే వెనుకవైపు నుండి వెళ్ళి కనులుమూసినాడు. జెస్ నవ్వినది.

'నాకు తెలుసు మైడియరెస్టు' చేతులుతీసి గులాబిపూలా మెకిచ్చి,

'నాకూ తెలుసు నీవు నాడార్లింగుజెస్సీవని' అన్నాడు. జెస్కు తెలియకుండగనే సంగీత మాగిపోయినది. ఇరువురును కలిసివచ్చి యుయ్యాలపై నాసీనులైనారు.

రాధారమణ కుడివైపునున్న ప్రేయసి సన్నని నడుము చుట్టును దక్షిణ హస్తమునుంచి యొరసి లేత పెదవులను విలోకించుచున్నాడు. ఆ కోమలాధరోష్ఠముల లాలిత్యమును, విన్నాణమును, మనోహర రక్తవర్ణమును, వంపులను దిలకించుచు నానందపారవశ్యమున నాతడు మైమరచిపోయినాడు. అన్నిటికన్న ఆ చిగురుటాకు పెదవుల వంపులు, వంపులలోని సౌందర్యము నాతనిని తన్మయానందుని జేసివైచినవి.

3

అట్టి యానందసమయమున మోటారు వచ్చి భవనము ముందఱ ఆగినది. మోటారు చూచి త్వరితగతి రాధారమణ, టెస్ వెళ్ళి రాఘవస్వామియెదుట నిలువబడినారు.

రమణ మిత్రునితో హస్తచాలనముజేసి యిట్లన్నాడు 'ఈమె మిసెస్ రమణ'

టెస్ షేక్ హేండు చేసిన తర్వాత వారు కాశ్మీరత్నము పాదరింటికి బయలుదేరినారు. ముగ్గురు నాసీనులైరి. రమణ సేవకుని నిమిత్తము మేజాపైనున్న గంట నొక్కినాడు. సేవకుడు పరుగునవచ్చి అచేతనునివలె నిలువబడి 'సార్' అన్నాడు.

రమణ 'స్వామిగారికి కాఫీ తీసికొని రమ్మని చెప్పు బట్లరుతో'

వాడు వెళ్ళిపోయినాడు. రమణ ప్రేయసి వైపు తిరిగి 'ఈతడు నా పూర్వస్నేహితుడు. ఇతను నేను బి. యె క్లాసు కలకత్తాలో చదువుకున్నాము' అని మిత్రు నామె కెరుక జేసినాడు.

టెస్ చిఱునగవుజేసి యూరకున్నది. అప్పుడామె యధరము కదలఁగ పైపెదవిపై మీసము కొంచెము కదలినది. రమణ ముచ్చటైన ఆ చిన్నినోరు గాంచి యానందించినాడు.

రమణ మిత్రునిజూచి 'ఆమె పేరు టెస్ అంటే థామస్ హార్డీ నవలలోని టెస్ కాదుసుమా' అన్నాడు.

టెస్ ఆఫ్ ది డర్బర్ విలీస్ నవల స్వామి, టెస్ యిదివఱకే చదివియుండుటచే అందరు కలిసి నవ్వినారు.

ఇంతలో బట్లరు కాఫీ తీసికొనివచ్చి మేజాపై నుంచినాడు. టెస్ నిలిచి పళ్ళెరములు, పాత్రలు సమర్చినది. ఫలాహారము మెల్లగా నారగించుచు వారువురు నెన్నో విషయములను గూర్చి ఆనందముతో ముచ్చటించుకొన్నారు.

రమణ సతీమణి నగుమోము గాంచి 'నిన్న ఏనుచేసిన వాగ్దత్తము జ్ఞాపకముందా ?' అన్నాడు.

టెస్ 'ఉంది. ప్రారంభము చేయండి మీచరిత్ర. మీచరిత్రతోపాటు టెస్ చరిత్ర కూడా గాదుకదా'

రమణ 'అవశ్యం వస్తుంది. కాని ఈచరిత్రకు, టెస్‌కు ఏకత్వం యేర్పడుతుంది కథలో కూడాను. ఎందుచేతనంటే చరిత్రకు పరమావధి టెస్ గనక, నదీప్రవాహాలు అనంతసముద్ర గర్భంలో కలసిపోవునట్లు — కాదు — నీల మేఘము అనంతమైన ఆకాశములో సమ్మిళితమయి వ్యాపించిపోవునట్లు — ఈచరిత్ర, భావాలు, ఆదర్శాలు, ఆనందము అన్నీ టెస్ అనంత మధుర సౌందర్యంలో సమ్మిళితమైపోతాయి. అంటే యిక అక్కడ ఏకత్వమే కాని భిన్నత్వము లేదు.'

టెస్ హృదయేశ్వరుని శర్కా ప్రావీణ్యానకు నవ్వుచు స్వామి వైపుజూచి 'మీరు కూడా ప్రోత్సహించండి' అన్నది.

స్వామి 'ఏది రమణా, నిరాకారమునకు ఆకారమిచ్చి వేదాంతివి కావోయి'

రమణ గొంతు సవరించుకొని హృదయేశ్వరి ముద్దు మోము గాంచి 'మొదలుపెడుతున్నాను' అన్నాడు.

జెన్ 'మీరు వేదాంతి మాత్రము కావద్దు — కథకులు కండి'

రమణ 'అది యెల్లాగు! వేదాంతానికి నాకు బద్ధవిరోధము. కథకుణ్ణి అవుతూ గులాబిపూవును కూడా అవుతాను అంటే పూవు నిశ్శబ్దమై యేమిబోధచేస్తుందో నేను అపనే చేస్తాను'

జెన్ 'అయితే కానియ్యండి. గులాబిపూవుకు నాకు చాల రోజులనుంచీ ప్రాణస్నేహము'

రమణ 'అయిదేళ్ళక్రితము కలకత్తాలో బి. యె. క్లాసు చదువుచున్నప్పుడు నేను, ఒక స్నేహితుడు సాయంకాలము గంగాతీరమున షికారు వెళుతున్నాము. ఆవలి ఒడ్డుకు వెళ్ళవలె నని బుద్ధి పుట్టినది ఒక చిన్ని పడవ యెక్కి తీరము చేరి అచటనే యున్న ఒక సన్యాసాశ్రమము చేరుకున్నాము. ఆ గుడిసెలో మహాజ్ఞాని అయిన సన్యాసి ఉన్నాడని యిదివరకే విని వుండడము వల్ల ఆయన్ని సమీపించి నమస్కరించి కూర్చున్నాము. మేము వచ్చిన పనేమిటని సన్యాసి అడుగగా యేమీ లేదని చెప్పి అరగంటసేపు మౌనంగా కూర్చున్నాము.'

స్వామి 'మౌనమంటే కనులు మూసుకొనేనా'

రమణ ' లేదు — '

అందరు నవ్వినారు.

జెన్ 'ఎందుకంతసేపు కూర్చుండుట?'

రమణ 'ఏదైనాప్రశ్న అడుగుదామని అనుకునేవాణ్ణి కాని సిగ్గు. ఎల్లాగైతే ధైర్యముచేసి యీవిధముగా అడిగాను ఒకటితర్వాత ఒకటి వెంటవెంటనే "మనుష్యుడు పాపాలు చేస్తే ఈజన్మలోనో లేక మరొక జన్మలోనో అనుభవిస్తా డంటారు. ఎందు కనుభవించాలి. వీళ్ళకు బుద్ధి ఇచ్చింది పర మేశ్వరుడేకదా. తానిచ్చిన బుద్ధితోనేకదా వీళ్ళీపని చేసినను. ఇక పాపమెల్లా అవుతుంది. ఈమాత్రమునుగాని కింకో జన్మ మెందుకు. ఇల్లా జన్మ లెత్తించడము వీళ్ళకు ఉత్తము జన్మ యివ్వడానికా, ఇప్పుడు చేసిన పాపాలయొక్క ఫలము మరల జన్మలో అనుభవించడానికా, మొదటి దానికోస మెత్తిన రెండో జన్మలో ఇంకా కొన్ని పాపాలుచేస్తే వాటి పరిహా రార్థము ఇంకొక జన్మ యిల్లాగే అనేక జన్మలు కలిగిస్తాడా? జంతువు పుట్టుక పుట్టి మరల మానవ జన్మమెత్తి, ఈమానవ జన్మలో పాపమూచేస్తే మరల నీచ జన్మనిస్తాడా ఏమిచేస్తాడు? ఇన్ని విధాల జన్మలు ఎందుకు? మానవజన్మలో ఉన్న ఎక్కు వేమిటి? పరమేశ్వరుణ్ణి తెలిసికోవడానికి అవకాశాలు ఎక్కువన్న వంటారు. ఇన్ని అవకాశాలుండగా ప్రపంచముపుట్టి యిన్ని వేల సంవత్సరాలైతే నేటికి పరమేశ్వరుణ్ణి గురించి మానవుడు తెలిసికోగలిగిన మహాభాగ్య మేమిటి. అతనెన్ని తెలుసుకుంటు, అతనీ జీవులను యిన్నికష్టా లెందుకు పెడుతున్నాడో యెవ రైనా చెపుతారా? ఈప్రపంచము కొన్ని వేల సంవత్సరాలుండి తర్వాత ప్రళయములో కలిసి పోతుందంటారు, నిజ.

మేనా ? అల్లా కలియుడ మెందుకు ? తన్ను కలియు వలెనని దైవముయొక్క ఉద్దేశమైతే, తాను జీవులకిచ్చిన కించిన్మాత్ర వివేకముతో పరీక్ష యెందుకు ? వీళ్లకు బుద్ధి యింత తక్కువ యిచ్చి ముందుముందు యెక్కువ చేస్తాడా ? ప్రపంచము పుట్టి నప్పటికి ఇప్పటికి మానవునిలో యేమాత్రము వివేకాభివృద్ధి కనిపించినది ? దైవమే మనలను వెనుకనుండి నడిపించు చున్నా డంటారుగదా ? తాను వెనకనుంచి మనలను నడుపుచు తన దగ్గరకే తీసికొని వెళ్తాడా ? తాను సృష్టించిన కించిన్మాత్రు లతో దాగుడుమూతలాట ఆడుచున్నాడా ? " ఏవో యిటు వంటి ప్రశ్నలు అనేకము లడిగినాను.

బెస్ ఆశ్చర్యాన్విత దృక్కులతో పతిని గాంచినది ఆమె కీమాటలలో నొక్కటియు బోధపడినది కాదు. ఆవిషయము రమణ కిస పట్టియే ప్రశ్నలు తగ్గించి వైచినాడు.

సతీమణి యాశ్చర్య భావమును దెలిసికొని రమణ తనలో నిట్లనుకొన్నాడు: 'సౌందర్యోపాసకులకు ఇట్టి ప్రశ్న లేమి అర్థ మవుతవి. అర్థము కావలసిన అవసరమేమిటా ఆనంద తన్మయు లకు, ఆనందమూర్తులకు ? సౌందర్యానందమును, మధుర ప్రేమైకానందమును అనుభవించుటె వారిపని. ఇంకో విషయము వారి కవసరములేదు. '

బెస్ నవ్వుచు 'తర్వాత ఏమిచేశారు ? ' అన్నది. రమణ 'ఒక్క ప్రశ్నకు కూడా జవాబు చెప్పినాడు కాదు. మఱు నాడు రమ్మన్నాడు. మఱునాడు వెళ్లుట కిష్టములేక పోయి

నను ఏదో శక్తి అటువైపు లాగుకొని వెళ్ళినది. రెండవసారి ఆచటికి వెళ్ళకముందు అతన్ని గురించి మరల భోగట్టాచేశాను. అతడు మహాత్ముడనీ, చాలమంది ఇంగ్లీషు విద్యావంతులు శిష్యులున్నారనీ చెప్పారు. సరేకదా అని నేనొక్కడనే వెళ్ళి నాను. నా ప్రశ్నల కేవో వెర్రిసమాధానాలు చెప్పాడు నేను బాలుణ్ణి అవడముచేత, నాకు లోకానుభవమంతగా లేకపోవ డమువల్ల యిటువంటి ప్రశ్నలు వేస్తున్నానన్నాడు. దానిపై నాకు కోపము వచ్చినది. కోపము రాదామరి. తను వృద్ధు డయి, లోకానుభవము సంపాదించి నా ప్రశ్నలకు చెప్పగలిగిన సమాధాన మేమిటి? చాలాకోపమువచ్చి పళ్ళు పటపటకొరికి నాను'

ఆత్రముతో నాలకించుచున్న ఔస్ పతినిగాంచి నవ్వుచు "కోపమువచ్చి యేమి చేశారు? పాపము ముసలిసన్యాసిని కొట్టలేదు కదా!" అన్నది. రమణ "లేదు. నాకు యిరు వయి సంవత్సరాలున్నవి. మీకు అరవయి వయస్సు. ఏమి ప్రయోజనము? సరియైన సమాధానములు చెప్పలేక వయస్సు చిన్న దనడములో ఏమి న్యాయముంది. ఈ ప్రపంచములో ఎక్కువ సంవత్సరములు జీవించడమువల్ల కఠినమై పోయిన మీ మేధస్సుకు ఇటువంటి కోమలమైన ప్రశ్న లేమి అర్థమవు తవి?" అన్నాను ఉద్రేకముతో. ఆ సన్యాసి శాంతముతో "పదినిముసాలు మౌనము వహించుబాబు" అన్నాడు. పావు గంట నేపూరకున్నాను. తర్వాత అతడు మెల్లగా లేచి నన్ను

సమీపించి నా యెదురొమ్ముపై చేయివైచి మెల్లగా తీసి కొన్నాడు. నాకు అప్పుడు చాలా భయమయినది. కంపితస్వర ముతో 'నన్నేమిచేస్తున్నా' రన్నాను. అతడు మాటాడలేదు. అప్పుడు నేను మెస్మరిజము చేసివైచి నట్లైపోయినాను. ఆ ఉద్రేకము, ఆప్రశ్న పరంపర విచిత్రముగా అణిగిపోయినవి. నాచుట్టు శాంతమయ వాతావరణ నాకు తెలియకుండగనే యేర్పడింది. అతడు నా ముందరకూర్చుండి "బాబూ, భక్తికున్న ప్రభావము జ్ఞానానికి, తాంత్రికశక్తులకు లేదు. పరమభక్తివల్లనే మనము మన పరమావధి సాధించవలిగాని ప్రజ్ఞానమువల్ల ప్రశ్నలవల్ల మంత్రతంత్రములవల్ల ఉపయోగములేదు. నాయనా! నినాదముచేస్తూ పూవుచుట్టు తిరిగే తేనెటీగ నెప్పుడూ చూడ లేదూ? అది మకరందము గ్రోలునపుడు నిశ్శబ్దమయ్యే ఉంటుంది. అల్లాగే నీప్రశ్నలూను. ఆ కాళీమాత దయవల్ల నీ హృదయాకాశములో భక్తి సూర్యుడుదయిస్తే ప్రశ్నలనే తిమిరములు పటాపంచలై పోతాయి." అన్నాడు. తర్వాత ఏదో మంత్రము చెవిలోచెప్పి దాన్ని స్మరించుకొని మఱునాడు రమ్మన్నాడు.'

లెస్ ఉద్విగ్నచిత్తముతో వినుచున్నది. అప్పుడామె చిన్ని నేత్రములు నవ్వుచున్నవి. ముందేమి చరిత్ర వచ్చునో యని ఆమె యాత్రహృదయురాలై పతివంక నిశ్చలనయనయై చూచినది.

స్వామి 'ఆమంత్ర మేమిటో మాకు చెప్పకూడదా రమణా?' రమణ 'అట్టి అభ్యంతరమేమీ లేదు. దానివల్ల మీకు

ప్రస్తుతము ప్రయోజనము లేకపోవునప్పటికి చెప్పమంటుంటే చెపుతున్నాను. అది మరేమీకాదు. నీకు తెలిసినదే, ఓం — మఱునాడు సాయంకాలము కాలేజీనుండి తిన్నగా అచటికి వెళ్ళినాను. ఆరోజు చాలా ఆతురతతో ఎప్పటి సామాన్యమునకు గురుదేవుని సమీపించినాను. సాష్టాంగముగా నమస్కరించవలెనని బుద్ధిపుట్టినది. అల్లాగే నమస్కరించాను. ఆయన శిరస్సుపై చేయివైచి ఆశీర్వదించినాడు. ఏమని, గ్రాహ్యమునకు కలుగగల అవసరము కాదు. "కాళీమాత సాక్షాత్కరించుగాక" ని, బోధ ప్రారంభించినాడు. ఒక్కొక్కమాట విద్యుత్ తరంగమువలెనే సమీపించి నాహృదయమును ఊపివైచినది. సంపూర్ణముగా మారిపోయినాను. మరల వెళ్ళిపోవునప్పుడు సాష్టాంగనమస్కారము ఆచరించాను. అప్పుడు—భూమిపై నుండి యున్నట్లు ఒక ప్రకాశమానమైన దివ్యజ్యోతి కనిపించినది. ఆమహాజ్యోతిలో సమస్తలోకములు గిరగిర తిరిగిపోతూ ఉన్నవి. ఒక్కక్షణమాత్రము నాకా దృశ్యము కనిపించినది. మెల్లగా లేచి వెళ్ళిపోయినాను. బయట అడుగు పెట్టునప్పటికి ప్రపంచము వేరువిధానముతో గోచరించినది. అంతా యేదో ప్రకాశము వ్యాపించినట్లు స్ఫురించినది. ఆప్రకాశ మేమిటో స్వగృహమునకు చేరేసరికి పూర్తిగా బోధపడింది. తల్లి సాక్షాత్కారమయినది. సమస్తవస్తువులలోనూ ఆమె కనిపించినది. జంతువులు, ఉదకము, చీమ, దోమ, ఆకాశము, నక్షత్రాలు, చంద్రుడు తల్లిలాగునే — కాళీమాత వలెనే గోచరించినవి. వెర్రివానివలె అన్నిటికి నమస్కరించాను.

మనస్సులో, మహత్తరమైన మార్పు కలిగినది. ఈ మాటలు చెప్పుచున్నప్పుడు రాధారమణ వదనము పూర్తిగా మారిపోయి నది. అప్పటికి యూతని ముఖభావము గాంచి బెదరిన హృదయ ఏమి వణికిపోయినది. అప్పుడామె కతని యూననము తక్క అన్యము కాన్పించలేదు. కొంతసేపటికి ఏమి సేదదీరి 'అబ్బా, పావుగంట సేపు మీకథ ఆపుచేయుండి, చాల భయంకరముగా ఉన్నది. సన్యాసి నాకొరకే పుట్టినట్లున్నాడే' అన్నది.

రమణ ప్రేయసి కరపల్లవము కేలగీలించి నవ్వుచు 'ఏమి భయపడకు. ఇందులో భయమేమున్నది. చివరకి కథను నీలోనే ఐక్యమొనర్చుతానని చెప్పినాను కదా! ఈచరిత్ర నీ అనంతసౌందర్యమునకు — అనుపమాన లాలిత్యమునకు — అవాజ్య ప్రేమనిధికి యిదివరకే అంకితమయిపోయినది. భయ పడెదవనియే నీకెప్పుడు ఈకథ చెప్పియుండలేదు' అన్నాడు.

అప్పుడు స్వామి కనుపాపలో నానవదంపతులిద్దరు నొక్క రూపముగా గోచరించినారు.

కొంతసేపు ముద్దురు మౌనముద్రితులై యున్నారు.

రమణ 'మిగుల కథ ప్రథమభాగము త్వరలోనే పూర్తి చేస్తాను. భయములేదు విను. తర్వాత అతని దగ్గరకు చాలసార్లు వెళ్ళి నాను. నాఆవేశము దినదినము పెరిగి పోయినది. ఎల్లప్పుడు, ప్రతివస్తువులోను కాళీమాతనుజూచి ఆనందించినాను. పరీక్షలైన తర్వాత స్వగ్రామము వచ్చివేసినాను. పూర్తిగా మారిపోయిన వ్యక్తినిజూచి మావూర్లో వాళ్ళంతా ఆశ్చర్యపోయారు. ఇది

వరలో వస్త్రాలంకారమునకు, సౌందర్యమునకు అంకితము చేయ బడిన శ్రద్ధాభక్తులు మాత్రు దేవి నానందించడమునకు మరలి పోవుటచేత, వేషభాషలు సంపూర్ణముగా పరిణామ మంది పోయినవి. అదివరకెప్పుడు పట్టువస్త్రాలు ధరించే శరీరము మాత్రు దేవీ ప్రకాశముతో కూడిన మామూలు వస్త్రములతోనే అమందానంద మందినది'

స్వామీ 'అన్నట్లు విద్యార్థి జీవితములో మీస్వగ్రామము కనుకోవలసిన అవసర మే కనిపించలేదు. ఇపుడు రవంత గృహా స్థులమైనాము గనక—మీఊరు పేరేమిటి, రమణ!' అన నవ్వుచు 'నన్నడిగితే నేను చెపుతాను కదా! ఈ భయంకర మైన కథ తెలియకపోతే తెలియకపోవచ్చు కాని యీమా త్రపు విషయాలు గ్రహించకుండా ఉన్నాననుకున్నారా? పిఠాపురముదగ్గర పల్లెటూరు. ఆజమీందారీ పీగిదే' అన్నది. స్వామి 'అటులనా! విద్యార్థిజీవనములో యీపూసే లేక పోయినది.'

రమణ 'ఆసంవత్సరము బి. యె. క్లాసు ప్యాసు అయ్యెదనని రూఢిగా తెలిసిన సంగతి. అంతవరకు మాజమీ అజమాయిషీ చేస్తూఉన్న మేనమామ సమస్తము నాకొప్పగించినాడు. ఇక యింటిదగ్గరనే వుండి జమీ స్వయముగా చూచుకోవడానికి నిశ్చయించుకొన్నాను. అంటే ఆయావేశము తగ్గలేదు. దేవీ సాక్షాత్కారము సర్వవేళల, సర్వవస్తువులందు ఉంటూనే

వుంది. అన్నట్టు కథచెపితే పూర్తి వివరములతో చెప్పవలె. ఆస్థిసంగతికూడా చెప్పమంటావా యేమిటి స్వామీ!'

స్వామి 'ముఖ్యంగాను'

రమణ 'చిన్న జమీా, భూములు, తోటలు, ఉన్నవి. వీని మీాద సంవత్సరమున కాదాయము ముప్పయివేలు'

స్వామి 'అవును, ఇంత ధనాగారమున్నప్పు డింకా చదు వెందుకు. ఈ మాత్రపు యింగ్లీషు చదువు బి. యె. వరకు చదివితే చాలదా?'

రమణ 'అప్పుడు చదువుమానుటలో నాయుద్దేశ మది కాదు. ఆస్థి నాచేతుల్లోకి వచ్చేవరకు నాకింత ఉన్నట్లు తెలి యనే తెలియదు. కాని నేనంతకుముందే నిశ్చయించు కొన్నాను, భక్తిజీవనము గడపవలెనని.'

స్వామి 'బాగుంది. కాని ఈమార్పు యెట్లు వచ్చిందోయి' అని టెస్‌వైపు చూచినాడు.

రమణ 'అదే చెప్పబోతూ వున్నాను. ఆనందమూర్తి అయిన పరమేశ్వరుడు మన ఆనందముకోసము మనజీవిత ములో విచిత్రమైన మార్పులు కలిగించుతూ 'ఆనంద మనుభ వించండి' అంటే మనకాబోధ అర్థముకాదు. అర్థమైనదా ధన్యులమవుతాము. ఆవిధముగ లోన పైన దేవీసాక్షాత్కా రము చేయుచున్ననాకు యింకొక శ్రోత్రవిషయముతో పరి చయము కలిగినది. ఇదంతా విచిత్రమోయి, స్వామి!'

స్వామి 'ఊఁ'

రమణ 'నాకొక్కతె చెల్లెలు. మరచినాను. తలిదండ్రుల ప్రేమామృత మనుభవించే అదృష్టము నాకు చిన్నతనములోనే లేకుండా పోయినది. ఆచెల్లెలంటే నాకమితమైన ప్రేమ. కాని దురదృష్ట వంతుడ నోయి నేను ఆమెనుకూడా లేకుండా పోయినది. శ్మశానభూమిలో ఆనా ప్రేమైక నిధిని - సు[illegible] మూర్తిని అగ్నిలో చూచి గుండె బ్రద్దలై పోయినది. అది వరకు వహించిన శాంతి మెల్లగా మాసి మొదలంటిని నాకు కన్నీరు ఏకధారగా ప్రవహించినది. ఆసుకుమార నయనములు — నాచెల్లెలి ముద్దుమోము, వంపులు తీరిన కేశపాశములు జ్వాలలలో గాంచి 'తల్లీ, నీవెంత ప్రేమైక స్వరూపిణివో అంత కఠినాత్మురాలవు. అందుచేతనే నిన్ను లోకము క్రూరాత్మురాలివలె సృష్టించినది' అనుకొన్నాను. కాళీ మాత సాక్షాత్కారమునకు తోడు వైరాగ్యము జతకూడినది. ఇక అప్పుడు నాస్థితియేమి చెప్పను. ఉన్మత్తుడ నైపోయినాను.

బెన్ 'అదిగో, మీరు మరల భయంకరమైన విషయాలు చెపుతున్నారు.'

రమణ ఆమె అమాయికపు మోము—చూపులు గాంచి జాలితో 'బెస్, ఏమిభయ మున్నది' అన్నాడు.

బెస్ లవండరు సీసా గైకొని హృదయేశ్వరునిపై చిలుకరించినది. రమణ బెస్ పైనను, స్వామిమీదను జల్లినాడు.

స్వామి నవ్వుచు 'రమణ, అప్పటినీస్థితి యేనుగుతో దెబ్బలు తినిన వెర్రిభక్తునివలె కాలేదుకదా' అన్నాడు.

రమణ ప్రత్యుత్తరముగా నవ్వినాడు.

ఔస్ ఆశ్రమములో 'అదేమిటి. ఏనుగు యెవరిని కొట్టి నది ? —' అన్నది.

స్వామి 'ఈకథకూడా విచిత్రమైనదే. ఒకగురువు శిష్యునితో ప్రతీవస్తువులోను పరమేశ్వరుడున్నాడని చెప్పినాడట. ఆవెర్రిభక్తుడు ఆమాట హృదయ పూర్వకముగా నమ్మినాడు. తర్వాత త్రోవవెంబడి అతడు వెళ్ళుచున్నాడట. ఒకఏనుగు యెదురుగా వచ్చుచున్నది శిష్యుడు తనలో "నేను పరమేశ్వరుణ్ణి, ఏనుగు పరమేశ్వరుడు ఇదినాకు హానిచేయదు" అనుకొని దాని కెదురుగా వెళ్లినాడు ఏనుగు ఊరుకుంటుందా? తొండముతో గట్టిగా కొట్టినది. అతడు దెబ్బలుతిని గురువు దగ్గరకు వచ్చి "మీరు చెప్పిన మాట అబద్ధము. ఏనుగు దేవుడైతే నన్నెందుకు కొట్టెం" దని తనకథ చెప్పినాడు. అప్పుడు గురువు వాని తెలివితక్కువతనము తెలిసికొని "మావటివాడు తప్పుకోమని చెప్పివుంటాడు. ఆదేవునిమాట యెందుకు వినలేదు" అన్నాడు. ఈవిధముగ కాలేదుగదా అప్పటి నిస్థితి ?'

ఔస్, రమణ పకపక నవ్వినారు. ఆనవ్వులో ఔస్ భయభావము లీనమై పోయినది. చాలసేపు వారునవ్వులో మునిగిపోయిరి

ఔస్ అనుమతిపై రమణ మరల స్వీయకథనము ప్రారంభము చేసినాడు 'నాచెల్లెలి మరణమువల్ల ప్రపంచ మశాశ్వతమనే భావము స్థిరస్థాయిగా నాహృదయ ఫలకముపై

నాటిపోయినది. అప్పడు నాభార్యకూడా తల్లిలాగానే కని పించినది. ఒకసారి ఆమెను 'తల్లీ' అని సంబోధించాను కూడాను, వెర్రినైపోయి. పాపమా అమాయకురాలు ఆమాట విని ఏకధారగా కన్నీరు గార్చినది. కాని యేమిలాభము. నాభావ మామెకు బోధపడలేదు. ఆమె నామార్పుచూచి దుఃఖించుచున్న సంగతి నాకు బాగా అర్థమయినది కాదు. కాని అప్పుడామె యేడుపు నాఉన్మత్తతను నాకు కొంతవరకు యెరుక జేసినది.'

ఔస్, మీరు భయంకరులండీ అని గంభీరభావము చాటున మెల్లగా నవ్వినది.

రమణ 'ఆమాట ఒకానొకప్పుడు నిజమే. అప్పుడు యితరులయెడ నాప్రవర్తన మరలించుకొన్నాను. ఎల్లప్పుడు, యేకాంతముగ మామిడితోటలో కూర్చుండి యీవిధముగ నాలో నేను పాడుకొనెడివాణ్ణి'

'కనుగొని నినుమది గానము జేసెడు
దినమది సుదినము కాదా
తల్లీ!
దినమది సుదినము కాదా'

నావెర్రిధోరణి చూచి అనేకులు విచారించినారు. తమ ప్రయత్నములను తాముచేసినారు. కాని వారి ప్రయత్నములు వృధాకాలేదు. నావిరాగభావము మెల్లగా మటుమాయమై పోయినది. దేవీసాక్షాత్కారము మాత్రము పోలేదు.

అప్పుడు పదునొకండు గంటలు కొట్టినవి.

జెన్ 'ఇప్పటికి చాలు. భోజనము వేళయినది. మిస్టర్ స్వామి మీ రీరోజు యిచటనే భోజనము. '

రమణ 'అవును, ఈపూట కాపుచేస్తాను. సాయంకాలము ద్వితీయభాగము ప్రారంభము చేస్తాను '

జెన్ 'అయితే ఆభాగములో యూరపు ప్రయాణము గురించి వస్తుందన్న మాట.'

రమణ 'దానికిముందు మేకపిల్లసంగతి కూడా చెప్పవద్దా!'

జెన్ ' అవును, మరిచాను. ఈచరిత్ర నాకు తెలిసినదే.'

౪

రాధారమణ మధ్యాహ్న సూర్యప్రదీపితాకాశము శూన్య దృష్టితో నీక్షించుచు భవనము ముంగినున్న సోపానములపై నిలుచుండి వరాండాలో పడకకుర్చీయం దుపవిష్టుడై మఱు నాటికి సంపాదకీయము వ్రాసికొనుచున్న స్వామివైపుజూచి 'స్వామి, సాయంకాల ఫలహారమైన తర్వాత కథ సాగించు దాము. ఈలోపున నీ పని చూచుకోవచ్చును' అన్నాడు.

ఏకాగ్రచిత్తముతో వ్రాసికొనుచుండిన స్వామి మిత్రుని జూడగనే 'అటులనే' అన్నాడు.

ఇంతలో జెన్ దొరసాని చుట్టును సన్నని జల్తారీఅంచుగల గులాబీరంగు పట్టుచీర, తెల్లనిజాకెట్టు ధరించి చేతనొక సంచి పట్టుకొని వరాండాలోనికి వచ్చినది.

స్వామి తలయెత్తి పరీక్షా దృష్టితో నామెను అర నిముషము వీక్షించి వారలను తీసుకొని పొమ్మనినాడు.

తెల్లని పట్టువస్త్రములు ధరించిన రాధాగణము, జెసస గారిని ఒకరి శరీరమునొకరు చేతులపై చిగాని ఉద్యానవనమును ప్రవేశించినారు.

నిశ్శబ్దముగ నా ప్రేమైక మిథునము తోటచుట్టును గొంత సేపు తిరిగి కాశ్మీరవృక్షచ్ఛాయను నున్న శిలావేదికపై నొకరి కెదురుగ నొకరు ఆసీనులైనారు

ఎవ్వరును మాటాడలేదు రమణి విశాల నేత్రములను మఱింత విశాలపరచి యెదురుగనున్న ఉయ్యాలపైపు అర్థ రహితదృక్కులతో ననిమేషనయనయై చూచుచున్న జెస్సను. (ఆకలిగొని యున్నట్లున్న) చూపులతో గంభీరముగ జూచినాడు. ఆ సుందరిని నునుపైన బాహులతలు, కంఠసీమ, సంపూర్తి దీరిన ఎఱ్ఱని పెదవులను, బంతిపూవువంటి చిన్ని చుబుకమును, నలుపు, ఊదా, ఎరుపు, పసుపు, ఆకుపచ్చ వగైరా అన్ని రంగులు కలిసియున్నట్లున్న చిన్ని తీవ్రమైన నేత్రములను, అరటిదూటను మించిన లాలిత్యము గలిగిన చిన్ని బుగ్గలను, ఫాలభాగమును, తరువాత సన్నని మనోహరశరీరమును అర్ధ గంభీరమైన చూపులతో తృష్ణగొనియున్న ఆత్మ ఆయా యువ యువ పాత్రలలో ప్రేమామృతమును గాంచినట్లు పిపాసావిహ్వలమైన దృక్కులతో చూచినాడు. మధురము, మంజులము, సుందరము, లలితము, మనోహరము నయిన దివ్యశరీరముతో

దృప్తిదీరక, చూపులను లోన జొరనిచ్చి శరీరమును మించిన హృదయమునుగూడ ప్రేమైకవీక్షణములతో గాంచినాడు. ఇవన్నియు గాంచుచున్న రమణ మెల్లమెల్లగా తన్మయానందుడై పోయినాడు. అతడటులే పావుగంటసేపు బెస్‌ను జూచినాడు. బెస్ శాంతమయము దృష్టితో యథాప్రకారము మొయ్యలను, ఎదురుగనున్న తీగెలను గాంచుచున్నది.

రాధారమణ చటాలున లేచి బెస్ సుంద్రని భుజములపై మెల్లగా చేతులు వాన్చి, "డియర్, నీ సౌందర్యముతో నా జీవితము వెలిగించి వేశావు" అని కోమలాధరముపై ముద్దిడినాడు.

బెస్ పతి సుందరవదనమును అర్థములేని చూపులతో జూచినది.

'గులాబీపూలు గొరనా లేను.' అని వెంటదీసికొని వచ్చిన సంచిలోనున్న గులాబి పూలను తీసి వేదికపై పరచి వానిప్రక్క తాను గూర్చున్నది

రమణ మెత్తని గులాబిపూల శయ్యపై బరుండి మస్తకము ప్రేయసి నితంబముపై నుంచి దక్షిణహస్తముతో నామె [illegible] చుబుకము బట్టుకొని, ముద్దుపెట్టుచు గాంచినాడు. అతడాడే ప్రేమించున్న మాటలకు ప్రత్యుత్తరముగా నామె అర్థగంభీరము కోమలమునైన దృష్టితో నాతని విశాలనేత్రముల లోనికి జూచినది. నయనాంతరమున నామె కేమి కనిపించినదో!

ఒకరు సౌందర్యమును ప్రేమను నొకరు తరళనయనములతో అవలోకించుచు వారటులనే తన్మయులైయున్నారు. ఎంత సేపో వారికే తెలియదు.

రాధారమణకు ముందుగా మెలకువవచ్చినది. "టెస్సీ, నా ఆదర్శాలు, అనుభవము, సమస్తము నీలో లీనముచేసివైచాను' అన్నాడు.

విమలహృదయమైన టెస్ కు ప్రత్యుత్తరమేమి ఇయ్యవలెనో తెలియలేదు.

రమణ 'ముఖ్యముగా నాపరమావధికి నీలేతహృదయములో చోటుదొరికింది' అన్నాడు.

ఆవేశముచే మెరిసిపోవుచున్న ప్రణయరసరంజిత నేత్రములతో నామె ప్రియుని గాంచినది.

రమణ 'ప్రేమైకమూర్తి — ఆనందస్వరూపము అయిన పరమేశ్వరుడు దయతో నాకనేక విషయముల మూలముగా గొప్పగొప్పపాఠాలు నేర్పినాడు. ఉదయము చెప్పానుకదా కొంతచరిత్ర. ఈజీవితములో మార్పు విచిత్రముగా వచ్చి వచ్చి తుదకు నా గమ్యస్థానము—'

టెస్ప్రియుని యావేశవాక్యములు వినజాలక సంభాషణము మార్పు జేయవలెనను తలంపుతో 'గొప్ప గొప్ప పాఠాలంటే జ్ఞాపకము వచ్చింది. నిజమే. పరమేశ్వరుడు చిన్నవిషయముల ద్వారా మనకు సాధారణముగా బోధపడని తన మహాతత్వము ఎరుకజేస్తూ ఉంటాడు. మనమా ప్రబోధము గ్రహించడములోనే మన అదృష్టము ఇమిడివుంది.' అన్నది. సంభాషణా పరిణామమున కభిలషించిన యామె ప్రయత్నతము సఫలముకాలేకపోయినది.

రమణ 'సత్యం, జెస్సీ.'

జెస్ 'మీకీసంగతి ఎప్పుడైనా చెప్పానేమో కూడాను. నాకిప్పటికీ ఆదృశ్యము కళ్ళకు గట్టినట్లుంటుంది. అప్పుడు నాకు పన్నెండు సంవత్సరాలు వయస్సు. నేను నాపినతండ్రి స్విడ్జర్లాండులో ఒకకొండపైకి ఎక్కుచున్న రైలులో ఉన్నాము. బండిమెల్లగా కొండపైకి వెళ్ళుతూఉంది. మాకెదురుగ అప్పుడప్పుడే విడిపోతూఉన్న మంచు, గంభీరమైన కొండలు కొండల చాటునుండి అప్పుడే కొంచెము కనిపిస్తూఉన్న సూర్యుడు, మంచును భేదించుకొని కొండకొండకు మధ్యనున్న మనోహర ప్రదేశము ప్రవేశిస్తూఉన్న సూర్యకిరణాలు, పైన నల్లని మబ్బులు—ఎంతో ఆకర్షణీయముగా ఉన్నవి. దూరాన ఉన్న పట్టణము చిన్నపల్లెలాగు గోచరిస్తూఉంది. మతప్రచారకుడైన పినతండ్రి ఆవేశముతో నావంకచూచి 'జెస్, ఆమనోహరమైన ఈశ్వరసృష్టిలోని సౌందర్యము చూస్తూఉంటే నీకేమిస్ఫురిస్తూ ఉంది?' అనిప్రశ్నించాడు. నాకు వయస్సుతక్కువ. ఆకర్షణీయముగా ఉన్న ప్రకృతి దృశ్యము చూచిన కొలదీ చూడాలనే కోరిక కలిగింది. నేనాతని భక్తిరసనిలయముకైన వృందారంగు కళ్ళకేసి జవాబు చెప్పకుండానే—ఏమిచెప్పవలెనో తెలియక సగము భయముతోను సగము భక్తితోను చూశాను. ఆయన ఆవేశముతో — తన ఆవేశము తెలియపరచడానికి తగినవ్యక్తి ఇంకొకరెవరూ అక్కడలేక పోవడమువల్ల—నాతో ఇల్లాఅన్నాడు. 'ఈమహా మధుర సౌందర్యమైన ప్రకృతి

దృశ్యము చూస్తే పరమేశ్వరుడు లోకము ఆనందము కోసము సృష్టించాడని బోధపడుతూ ఉంది. ఔను, నేటికి నా సంశయాలు నివారణ అయినవి. మాధుర్యానికి, సౌందర్యానికి నిలయమైన ఆ దృశ్యము చూచిన చూపుతో దూరముగా ఉన్న పట్టణము చూడు. ఈమనోహరదృశ్యానికి దానికీ పోలికా ? పరమేశ్వరుడు లోకము ఇంత సౌందర్యముతో మాధుర్యముతో సృష్టించి మన ఆనందముకొరకు మనల్ని ఇందులో విడిస్తే—చూడు ఆపట్టణాలలో — [illegible] ధర్మాధర్మమనే భేదాలు, పాపపుణ్యమనే తారతమ్యాలు, కీర్తి అపకీర్తి అనే భ్రమ, ఇన్ని పెట్టుకొని తమ ఆనందము [illegible]కోవడమే కాకుండా సృష్టియొక్క నిశ్చలానందమునకు కూడా [illegible]కము కలిగించుతూఉన్నారేమో అని భయము వేస్తూ ఉంది. డియర్, దేవుడు ఈలోకమేమిటి ఏలోకమైతే నేమి ఆనందము కోసము సృష్టించాడు. అతడు ప్రేమనిధి. అతనిసృష్టి ఆనందనిలయము. ఇందులో సంశయము లేదు. మనము ఆనందముకొరకు సృష్టింపబడ్డా, మనల్ని మనమే చెరుపుకొని రోజురోజుకి ఆనందానికి దూరమైపోతూ ఉన్నాము' అన్నాడు. ఈవిషయము జరిగి పదకొండు సంవత్సరాలైనా, నాకామాటలు ప్రతిఅక్షరమూ ఇప్పటికీ జ్ఞాపకముంది.

రమణ 'ఎప్పుడూ ఈసంగతి చెప్పినావు కాదు. అయితే నీకు కూడా ఈ విషయాలలో ప్రవేశముందన్నమాట. లేకపోవడమేమిటి ? ఔను, మీపినతండ్రి చెప్పినమాట నిజము. మను

ష్యులలో భేదాలు పెట్టుకొని పరమేశ్వరుని ఉద్దేశానికి దూరులై పోతూఉన్నారు. 'మీరారు ఆనందముకోసము సృష్టింపబడ్డారు. గానిని తనివిదీరా అనందించండి' అనిపరమేశ్వరుని ఆదేశమైతే పిల్లు దానికి భిన్నముగా నడుస్తూ ఉన్నారు. భిన్న స్వరూపములో ఏకస్వరూపము — ఆనందము — ప్రవరించి మధురశ్రుతి గీతముతో నిర్వికల్ప పరమార్థము దగ్గిరికి ఆహ్వానించుతూఉన్నా తారతమ్య ఫలసిద్ధి బాధతో అనుభవించే తెలివితక్కువ లోకానికి శ్రుతిగీతి వినిపించడములేదు. అయినప్పటికి గాలివలె వ్యాపించి ఉన్న యథార్థస్వరూపము జాలితో బాధలోకూడా తన అనుభవము కలిగించుతూ ఉంది కేసర్లుంకు.'

రెస్ భావావేశముతో, 'సరేకాని ఆపిచ్చుకలు చూడండి. వాటిలోకూడా మీగూఢమైన మాటలలోని తెలియని అర్థము సులభముగా స్ఫురిస్తూఉంది. ఆ జీవులకున్న ఆనందము కూడా లేదు పాపము ఈమనుష్యునికి. ఏమో తాము సృష్టిలో అగ్రస్థానము వహించామని మురిసిపోతూవుంటారు.'

అప్పుడేయొక నల్లపిల్లి యటుబోవుచున్నది.

రమణ పిల్లిని మనము నీచజంతు వంటాము. దానికున్న సుఖముకూడా లేదు వీరికి; ఏదోపొడిచివేస్తామని గోతులోపడుతున్నారు. జంతువులది అజ్ఞానముతో కూడిన ఆనందమట. వీరిదేమో మహాజ్ఞాన పూర్వకమైన సంతోషమట. పాపము మానవప్రపంచము దినదినము అధోలోకము పాలవుతూ ఉన్న

దని ఎన్నో [illegible] సముద్రమువలె ఎంత [illegible] ఆఘ్రాణించినవి?'

[illegible] 'నా [illegible] [illegible] పెదవులొత్తి ముద్దిడినది.

రాధారమణ ప్రత్యుత్తరముగా చుంబనము గొన్నాడు.

బెస్ [illegible] భాషించుకొన్నది 'ద్రాక్షాసవమున కింత పరవశ్యము కలిగించే శక్తి ఉందా?"

అప్పుడే రాధారమణునకు ద్రాక్షాసవము స్మృతి గోచర మైనది. గాలి వీచుటచే బొగడపూలు ఐక్యహృదయులైన సతీ పతులపై [illegible] అని సమీరశబ్దమున సస్పష్ట ముగ వినిపించినది.

రాధారమణ కొంతదూరము మరిగి 'ప్యూన్' అని సన్నని కంఠముతో సేవకుని బిలిచి 'వైన్ తీసుకురా' అన్నాడు.

శిలావేదికపై నిశ్శబ్దముగ కూరుచుండియున్న వారిప్రక్క సీసా, పాత్రను ఉంచి అతడు వెళ్ళిపోయినాడు.

పాత్రలో కొంత ద్రాక్షాసవము బోసి రాధారమణ ప్రేయసి నోటి కందించినాడు. బెస్ ప్రహృష్టహృదయయై ఆస వము కొంచెము త్రాగినది. మిగిలినది తాను పుచ్చుకొని మరల పాత్రయందు ఆసవము పోసినాడు రమణ.

(స్వార్థిచేయుని, చేయుబాలనికథ)

బాలుని ఆలోచనలు

ఒకరోజున : ఈ ప్రపంచమెందుకు పుట్టించె. ఈ గొడవంతాయేమిటి ఇదిలేకుండావుంటే బాగుండునుగా. ఒక వేళ యెందుకో ఉన్నదనుకుందాము, ఉంటే మాత్రము అందరు సంతోషముగా ఉండకూడదూ! మరి యీ దుఃఖమెందుకు? అసలే లేకుండావుంటే బాగుంటుంది. దేవుడెందుకు పుట్టించాలి యీ ప్రపంచం! అసలు పుట్టించకుండా వుంటే చాలా బాగుంటుంది. అతను మంచివాడంటారుగా! నిజంగా మంచివాడే అయితే యిల్లాయెందుకు పుట్టించాలి! అతను లేడేమో? దేవుడు లేకపోతే యేముంటుంది! ఏమీ వుండదు గాని ఎప్పటిలాగా గాలి ఉంటుందేమో! గాలి మాత్రం యిల్లాగే ఉంటుంది? ఏమీ ఉండదు. ఏమీ వుండకపోతే ఎల్లావుంటుంది! ఏమిటో యిదంతా గొడవగా ఉంది.

కొన్ని రోజులు గడచిన తర్వాత : దేవుడంతా వున్నాడంటారుగదా! అతనికి పాపమంటదంటారు. అతనికి పాపమంటకపోతే యీ ప్రపంచములో పాపమెందుకుండ! ఇక అంతా పుణ్యమన్నమాటే. ఇక పాపమనేదిలేదు. ఇదేమీ తెలియక పెద్దవాళ్ళు దేవుడంతా ఉన్నాడంటారు. తప్పుచేస్తే పాపమంటారు, ఏమిటో గొడవంతాను. ఎవరినడిగినా సరియైన సమాధానము చెప్పరు. నాకంతా తెలిసికోవలెనని ఉంటుంది. ఎవరూ నచ్చచెప్పరు. వాళ్ళకేమీ తెలియదేమో! మేము

పెద్దవాళ్లమని ఏమిటో వాగుతారు. వాళ్లంతా వట్టివెఱ్ఱివాళ్ళు. ఇంకొక రోజున : ఈ చిత్రాలన్నీ దేవుడు మనసంతోషం కొరకు పుట్టించాడంటారు. మనసంతోషముకోసము పుట్టించితే మనకింకా దుఃఖమెందుకు ? నిజంగా మనల్ని సంతోషపెట్టాలని దేవుడికుంటే అతని ప్రపంచంలో దుఃఖమనే మాటే ఉండదు. వీళ్లు వట్టివెర్రివాళ్లుకాని, మనకు సంతోషము కలిగించాలని దేవుడికివుంటే నిమిషంలో అంతా సంతోషమే చేసివేస్తాడు. అతను తలచుకుంటె యెంతపని, ఇవన్నీ పుట్టించాలా ఏమిటి? ఇల్లాచేయడానికి యెదో కారణముంటుంది. అదేమిటో తెలుసుకుందామంటే తెలియదు. ఎవరినైనా పెద్దవాళ్ళు అనేవాళ్ళనడిగితే ఏమిటో పిచ్చిసమాధానాలు చెప్తారు. చెప్పేది వాళ్ళకూ తెలియదు. నాకూ తెలియదు. నాకేమీ తెలియడంలేదూ అంటె పెద్దవాడవైనతర్వాత తెలుస్తుంది అంటారు. ఏమి తెలుస్తుందో ! ఏమిటుండుపో ! ఇదంతా గోలగావుంది.

మరొకరోజున : ఎవరూ పెళ్ళి చేసుకోకుండా వుంటె పక్షులు, మృగాలు, మనుష్యులు, అందరూ మానివేయాలి పెళ్ళి. మానివేస్తే ప్రపంచం వృద్ధికాదు. అప్పుడు దేవుడికి శాస్తిఅవుతుంది బాగా. లేకపోతే యెందుకీ గొడవంతా దేవుడికి. ఒకణ్ని యేడిపిస్తాడు. ఒకరిని నవ్విస్తాడు. కొందరిని పుట్టిస్తాడు, కొందరని అమాంతంగా చంపివేస్తాడు.

వాడికేమైనా పిచ్చిపట్టిందా యేమిటి! అప్పుడు ప్రపంచం మీాదవున్న జీవులన్నీ నాశనమవుతారు. మళ్ళీ పుట్టిస్తాడేమొ గొడవ. మళ్ళా పుట్టిస్తే మళ్ళావాళ్ళంతా అల్లాగే చెయ్యాలి. ఎన్నిసార్లుపుట్టించినా అన్నిసార్లు అందరూ అల్లాగేచెయ్యాలి. అప్పుడు ఆదేవుడికి బుద్ధివస్తుంది. విసుగెత్తి పుట్టించడము మానివేస్తాడు...బలే పన్నాగం పన్నాను. (గంతులువేస్తాడు)

మరికొన్ని రోజులైన పిమ్మట : ప్రహ్లాదుడు మంచివాడం టారు. ఏంమంచి! వాడి మొకంమంచి! వాడు భక్తుడట, ఏం భక్తి! విష్ణు అంతా ఉన్నాడట. విష్ణుపేరు తలిస్తే పుణ్య మొస్తుందీ! శివుడుపేరు తండ్రి తలవకూడదూ? శివుణ్ణి తలిస్తే పుణ్యము రాదుకామాసు! వాడికా భేదం యెందుకు. అంత టికీ మూలం దేవుడున్నాడు, వాడినే తలవకూడదూ! విష్ణు ప్రహ్లాదుడి తండ్రిని చంపివేశాడట. శివుడు ప్రహ్లాదుణ్ణి చంప లేకపోయాడు కామాసు! విష్ణు అంతా వున్నాడట: శివుడు లేడా యేమిటి? విష్ణు నిజంగా దేవుడే అయితే వాడి తండ్రి మనస్సు నిమిషంలో మార్చివేయవచ్చునుగా! మనస్సే మార్చ లేకపోయాడు కామాసు పాపము! లేకపోతే తోచలేదేమొ! శివుడే దేవుడయితే ప్రహ్లాదుడి మనస్సు మార్చివేయ వచ్చు నుగా, అతనికీ తోచలేదు కామాసు, పాపము! వీళ్ళందరి పైన వుండే అసలు దేవుడు ఉన్నాడుగా! అతను వచ్చి వీళ్ళి ద్దరి చిల్లర దేవుళ్ళనీ తనవైపు మార్చివేసుకోరాదూ! ఏమిటో, ప్రపంచమంతా పిచ్చిలోపడి కొట్టుకుంటూంది.

ఇంకొకసారి: ఇదంతా యెందుకు పుట్టించాలి? యేమీ తోచక చేసిన పని అయివుంటుందా! లీలకోసము పుట్టించాడట. లీలకోసము పుట్టిస్తే సంతోషం, విచారం యెవరికీ లేకుండా పుట్టించ కూడదూ! రాళ్ళుమాదిరిగా ప్రాణంలేకుండా పుట్టించి వాటితో గంతులు వేయించి చూచి సంతోషించరాదూ! సూర్యుడితోపాటు కిరణాలు ఉన్నట్లుగా దేవుడితోపాటు జీవులుకూడా వున్నయ్యట. ఇదేదో కొంచెము సమాధానం గానే వుంది. ఇక దేవుడు పుట్టిస్తున్నాడంటారు, ఎందుకీపిచ్చి వాళ్ళు. పుట్టిస్తున్నాడట, చంపుతున్నాడట. పాపంచేసితే నరకంలోకితోసి యముణ్ణి దండించమంటాడట. యముడు దండించకపోతే తను దండించకూడదూ! ఇన్నిపనులు చేయగా లేంది దానికొక నౌకరు కావలసి వచ్చాడు కామోసు! పుణ్యం చేస్తే తనదగ్గిరికి తీసుకు వెళ్ళుతాడట. సూర్యుడికి కిరణాలు లాగు దేవుడికి జీవులంటారు, మళ్ళా, పుట్టిస్తున్నాడని కొంత సేపటికి అంటారు, కొంచెంసేపు దేవుడంతటా ఉన్నాడంటారు: నిమిషాని కొకమాట—యమలోకంలో మాత్రం దేవుడుండడు కామోసు! అంతటా ఉన్నాడంటారుగా! ఏది నమ్మవలె, ఏది నమ్మకూడదు! నోటికి వచ్చినట్లల్లా అంటారు.

ఒకరోజు ఉదయం: అబద్ధమాడితే పాప మంటారు. అబద్ధమాడేది, ఆడించేది ఎవరు! అంతటా అతనేగా ఉంది. తను ఆడించినట్లు ఆడుతూంటే అందులో పాప మెక్కడుంది!

మరొకసారి: ఆపెద్దవాళ్ళు అనే పెద్దమనుషులు చెప్పే మాటలు వింటే పిచ్చి తలకెక్కుతుంది కూడాను. ఇక ఈ రోజునుంచి నేను వాళ్ళమాట లెక్కచేయను కడుపునిండా తిని ఒక పిల్లంగ్రోవి కొనుక్కొని పాడుకుంటూ, గంతులు వేస్తూ కాలం గడుపుతాను. అదే సుఖం; ఈపిచ్చివాళ్ళు ఉన్న చోటఉంటే నాకుకూడా పిచ్చియెత్తుతుంది. ఆటలాడుకుంటూ, పాటలు పాడుకుంటూ, విసుగెత్తి ఆకలి వేసినప్పుడు భోంచేసి, మరలా ఆటలు, పాటలు—ఇంతకు మించింది లేదు.

సంపూర్ణము.
